www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 22
గురువారం | 8-5-2025
వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి మ.12:30 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తర రా.9:06 తదుపరి హస్త, వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.10:04-10:55, మ.3:10-4:01; అమృతఘడియలు: మ.1:03-2:50; రాహుకాలం: మ.1:30-3:00; సూర్యోదయం: 5:49; సూర్యాస్తమయం: 6:34
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రెండు స్కాల్ప్ క్షిపణులతో రాఫెల్ యుద్ధ విమానం

ఆడబిడ్డల కన్నీటికి ప్రతీకారమే ఇది..


ఆపరేషన్‌కు సిందూర్ పేరు పెట్టిన మోదీ

ఉగ్రవాదానికి దీటైన జవాబిచ్చే హక్కును భారత్ ఉపయోగించుకుంది. ఉగ్ర శిబిరాలను కచ్చితత్వంతో ధ్వంసం చేయడం ద్వారా మన భద్రతా దళాలు చరిత్రను లిఖించాయి.
- రాజ్‌నాథ్‌సింగ్

ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోమని భారత్ ప్రపంచానికి తెలియజేసింది. భారత సరిహద్దులను, పౌరులను సవాలు చేసేవారికి సైనిక చర్యే దీటైన జవాబు. - అమిత్ షా

సిందూరమే.. సంహారమై

80 మంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన భారత్





- పహల్గాంకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'
- పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ క్షిపణి దాడులు
- లష్కరే తాయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ప్రధాన కార్యాలయాలు సహా ఉగ్ర శిబిరాలు నేలమట్టం
- వీటిలోనే కసబ్, డేవిడ్ హెడ్లీ తదితరులకు ఉగ్ర శిక్షణ
- వాటి శిక్షణ, కమ్యూనికేషన్, మౌలిక సదుపాయాలన్నీ ధ్వంసం
- 70 మంది ఉగ్రవాదులకు తీవ్ర గాయాలు
- మృతుల్లో మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు, అనుచరులు
- జైషే, లష్కర్, హిజ్బుల్ ఉగ్రవాదుల నిర్మూలనే దాడుల లక్ష్యం
- మరిన్ని దాడుల్ని అడ్డుకోవడానికే సైనిక చర్య: విక్రమ్ మిస్రీ

నేను పోయినా బాగుండేది: మసూద్



మసూద్ ఇంట్లోనే 14 మంది హతం


మసూద్ పెద్దక్క సాహిబా, ఆమె భర్త, మేనల్లుడు అలీమ్ ఫాజిల్, అతని భార్య. సోదరుడు హుజైఫా, అతని తల్లి, మేన కోడలు అలామ్ ఫాజిలా. ఐదుగురు పిల్లలు, ఇద్దరు సహచరులు.



పాక్ పంజాబ్‌లో బహావల్‌పూర్‌లోని మసూద్ అజహర్ భవనం ధ్వంసమైన దృశ్యం

ముజఫరాబాద్ సమీపంలో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరంలో పాక్ సైనికులు

'చున్ చున్ కే మారేంగే (ఏరి ఏరి మరీ చంపుతాం).. 'షోలే' సినిమాలో ధర్మేంద్ర డైలాగ్ ఇది! పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకుంటామంటూ కొద్ది రోజుల కిందట కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఇదే చెప్పారు! ఆయన అన్నట్లుగానే.. మంగళవారం అర్ధ రాత్రి దాటిన తర్వాత ఏరి ఏరి మరీ లష్కరే తాయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర స్థావరాలు, ప్రధాన కార్యాలయాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది! సరిహద్దు దాటకుండానే.. క్షిపణుల వర్షం కురిపించింది! ఉగ్ర శిబిరాలు, స్థావరాలను నేలమట్టం చేసింది! కరుడుగట్టిన ఉగ్రవాది మసూద్ అజహర్‌ను మళ్లీ కోలుకోలేకుండా చావు దెబ్బ కొట్టింది! 'దాడుల్లో నేను కూడా చచ్చిపోతే బాగుండు' అని అతడు అన్నాడంటే వాటి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు! దాడుల్లో అతని ఇంట్లోనే పది మంది సహా మొత్తంగా దాదాపు 80 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. నిజానికి, బుధవారం సాయంత్రం దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ ఉంటుందని ప్రకటించారు కానీ.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాతే అసలైన ప్రతీకారానికి శ్రీకారం చుట్టేశారు! ఈ దాడులకు భారత సైన్యం పెట్టిన పేరు 'ఆపరేషన్ సిందూర్'! పహల్గాంలో భార్యల కళ్లెదుటే భర్తలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపి.. వారి సిందూరాలను ఉగ్రవాదులు రక్తంతో తుడిచేసిన సంగతి తెలిసిందే! భర్తతోపాటు తననూ చంపేయాలని ప్రాధేయపడితే.. 'వెళ్లి మోదీకి చెప్పుకో పో' అంటూ వదిలేశారు! అప్పట్లో చెరిగిపోయిన వారి సిందూరమే ఇప్పుడు మృత్యు క్షిపణిగా మారి ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడింది! వాళ్లు వెళ్లి మోదీకి చెప్పలేదు కానీ.. మోదీ రణ గర్జన ప్రపంచమంతా ప్రతిధ్వనించింది!



9 ఉగ్ర శిబిరాలు
25 నిమిషాలు
24 క్షిపణిదాడులు
80 హతమైన ఉగ్రవాదులు

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): మతం అడిగి మరీ 26 మంది అమాయకుల ఉసురు తీసిన.. మహిళల కన్నీటి ధారకు కారణమైన పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మారణ హోమానికి పాల్పడిన ఉగ్రవాదుల ఆయువు పట్టులపై మన సైన్యం, వాయుసేన దళాలు క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఉగ్ర శిబిరాలు, స్థావరాలు, వాటి ప్రధాన కార్యాలయాలను తుత్తునియలు చేశాయి. రెండు మూడు నిమిషాలకు ఒక దాడి చొప్పున కేవలం 25 నిమిషాల్లోనే తొమ్మిది ఉగ్ర స్థావరాలపై 24 క్షిపణులను ప్రయోగించాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని బహావల్పూర్, మురిడ్కేల్లోని లష్కరే తాయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాయి. ఈ దాడుల్లో దాదాపు 80 మంది ఉగ్రవాదులు హతమైనట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. మరో 70 మంది గాయపడ్డారు. మృతుల్లో కరుడు గట్టిన ఉగ్రవాది మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు

మిగతా 9వ పేజీలో...

మళ్లీ పౌరులపైనే గురి

- భారత్ దాడితో విచక్షణ కోల్పోయిన పాక్
- కశ్మీర్ జనావాసాలపై యథేచ్ఛగా కాల్పులు
- పిల్లలు సహా 13 మంది మృతి.. 57 మందికి గాయాలు.. ఇళ్లు అగ్నికి ఆహుతి
- సురక్షిత ప్రాంతాలకు వేల మంది తరలింపు



ఉరి సమీపంలో పాక్ కాల్పుల్లో ధ్వంసమైన ఇల్లు

ప్రతీకారం తీర్చుకుంటాం



భారత్ జరిపిన దాడులకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. భారత్ చేసిన తప్పునకు పర్యవసానాలు తప్పక ఉంటాయి. భారత్ చేసిన దాడులను పాకిస్థాన్ వాయుసేన సమర్థంగా ఎదుర్కొంది. రాఫెల్ జెట్‌తో సహా ఐదు యుద్ధవిమానాలు, రెండు డ్రోన్లను నేలకూల్చింది.
- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

బదులిచ్చేందుకు సిద్ధం

పాకిస్థాన్ మరేదైనా దుస్సాహసానికి పాల్పడితే బదులిచ్చేందుకు భారత్ సర్వసన్నద్ధంగా ఉంది.
- భారత విదేశాంగ కార్యదర్శి మిస్రీ



కశ్మీరీ పండిట్.. ముస్లిం సైన్యాధికారిణి..

'ఆపరేషన్ సిందూర్' దాడితోనే కాదు.. ఆ వివరాలను వెల్లడించిన తీరుతోనూ పాకిస్థాన్‌కు, ప్రపంచానికి భారత్ బలమైన సంకేతాలు పంపింది. ఇద్దరు మహిళా సైనికాధికారులు, ఓ కశ్మీరీ పండిట్ (విదేశాంగ కార్యదర్శి మిస్రీ) ద్వారా ఈ ఆపరేషన్ వివరాలను మీడియాకు వెల్లడించింది. ఈ ఇద్దరు సైనికాధికారుల్లో ఒకరు ముస్లిం వర్గానికి చెందిన ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ కావడం గమనార్హం. సోఫియా తాత, తండ్రి సైన్యంలో పని చేయగా, ఆమె భర్త కూడా సైన్యంలోనే ఉన్నారు. మరో అధికారిణి వాయుసేన వింగ్ కమాండర్, పైలట్ వ్యోమికా సింగ్. ఆమె భర్త కూడా వాయుసేనలో పైలట్‌గా పనిచేస్తున్నారు. మతం అడిగిమరీ అమాయక పౌరులను చంపి ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేసిన ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగిన ఆపరేషన్ వివరాలను మహిళా సైనికాధికారుల ద్వారా మతాతీతంగా భారత్ వెల్లడించడం గొప్ప విశేషం.

లోపలి పేజీల్లో..

సమగ్ర కథనాలు 9, 10, 11, 12, 13

దేనికైనా సిద్ధంగా ఉండాలి

శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి
అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ఇండియన్ ఆర్మీకి సెల్యూట్

జాతి గర్వించాల్సిన సమయం: గవర్నర్
చివరి ఉగ్రవాదిని అంతం చేసేవరకూ 'సిందూర్' ఆగకూడదు: పవన్ కల్యాణ్

'యుద్ధం'పై అప్రమత్తం!

విశాఖ, ఒంగోలు, బాపట్లలో మాక్ డ్రిల్

ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం షాక్



ఓఎంసీ కేసులో ఆమె పాత్రపై పునర్విచారణ అవసరమన్న ధర్మాసనం
తాజాగా సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశం
ఆమె పాత్ర ఉందో లేదో 3 నెలల్లో తేల్చాలని స్పష్టీకరణ **14**

చేసిన పాపం వెంటాడుతోంది!
శ్రీలక్ష్మి మెడపై 'ఓఎంసీ' కత్తి

'బెయిల్' అర్హత మీకు లేదు!

మద్యం స్కాంలో జగన్ బ్యాచ్‌కు హైకోర్టు షాక్
ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలకు ముందస్తు బెయిల్ నో **14**

ఏబీవీపై కేసు కొట్టివేత

ఆరోపణలకు ఆధారాల్లేవన్న హైకోర్టు
కామ్‌సైన్ మధుకు 21 వరకు రిమాండ్



ప్రణాళిక, జీఎస్టీపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

నైపుణ్యంతో నాణ్యమైన సేవలు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రతి ఉద్యోగికి శిక్షణ: సీఎం

తిరుపతి ఐఐటీకి మహర్దశ!

మౌలిక సదుపాయాల పెంపు, విస్తరణకు కేంద్రం ఓకే **3**

వైదొలగండి!



జస్టిస్ యశ్వంత్‌ను కోరిన సుప్రీం సీజే
న్యాయమూర్తి ఇంట నగదు నిజమే..
చీఫ్ జస్టిస్ ఖన్నాకు అందిన కమిటీ నివేదిక **14**



కర్రెగుట్టల్లో 19 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

ఆంధ్ర-ఒడిసా సరిహద్దుల్లో ఏవోబీ జోనల్ కమిటీ నేత జగన్, డీసీఎం నేత రమేశ్ కాల్చివేత

ప్రేమ తగ్గింది చెల్లిపైనే.. నాపై కాదు కదా!



సరస్వతి పవర్‌లో 99.89% షేర్లు నా వద్దే
ఎన్‌సీఎల్‌టీలో విజయలక్ష్మి వెల్లడి
ఆ కంపెనీ వంద శాతం నాదే
కుటుంబ వ్యవహారాన్ని కోర్టుకు ఈడ్చారని మండిపాటు
తప్పుడు పత్రాలు సృష్టించి నా వాటాల బదిలీ: జగన్
విజయలక్ష్మే మా యజమాని: సరస్వతి పవర్ **3**

వన్డేల్లో కెప్టెన్ అతడే

వన్డేలలో రోహిత్ కెప్టెన్‌గా కొనసాగుతాడని ప్రకటించిన బీసీసీఐ..టెస్టుల్లో అతడు అందించిన సేవలను శ్లాఘించింది. 'కెప్టెన్.. థ్యాంక్యూ..టెస్టులకు రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించడంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో ఓ శకం ముగిసింది. వన్డేలలో అతడే సారథిగా వ్యవహరిస్తాడు. నిన్ను చూసి గర్వపడుతున్నాం హిట్‌మ్యాన్' అని ఎక్స్‌లో బీసీసీఐ పోస్ట్ చేసింది.



'టెస్టు'లిక చాలని..

సంప్రదాయ ఫార్మాట్‌కు రోహిత్ గుడ్‌బై

వరుస పరాభవాలా.. తన సారథ్యంపై విమర్శలా.. పేలవ ఫామా.. కారణం ఏదైనా హిట్‌మ్యాన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా, అందరినీ ఆశ్చర్యపరుస్తూ సంప్రదాయ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

హిట్‌మ్యాన్ అనూహ్య నిర్ణయం

వన్డేలలో కొనసాగుతానని ప్రకటన

భారత క్రికెట్‌లో ఆటగాడిగా, నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న రోహిత్ శర్మ తన బాధ్యతలను 'పరిమితం' చేసుకుంటూ టెస్టులకు గుడ్‌బై పలికాడు. గతేడాది ప్రపంచకప్ అనంతరం టీ20లకు దూరమైన రోహిత్.. ఇక వన్డేల్లో మాత్రం కొనసాగుతానని ప్రకటించాడు.

న్యూఢిల్లీ: సుదీర్ఘకాలంగా వస్తున్న ఊహాగానాలకు రోహిత్ శర్మ తెరదించాడు. టెస్టుల నుంచి రిటైరవుతున్నట్టు బుధవారం రాత్రి ప్రకటించాడు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపాడు. దాంతో క్రికెట్‌లో రెండు ఫార్మాట్లకు హిట్‌మ్యాన్ వీడ్కోలు పలికినట్టయ్యింది. గత ఏడాది జూన్‌లో టీ20 వరల్డ్ కప్‌ను తన సారథ్యంలో అందించిన అనంతరం రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇక సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకొంటున్న విషయాన్ని రోహిత్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. 'అందరికీ హాయ్..టెస్టుల నుంచి నేను రిటైర్ అవుతున్న విషయాన్ని మీతో పంచుకుంటున్నా. సుదీర్ఘ ఫార్మాట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఇన్ని సంవత్సరాలుగా నాకు మద్దతుగా నిలిచి, నాపై ప్రేమాభిమానాలు కురిపించిన అందరికీ కృతజ్ఞతలు. వన్డేలలో మాత్రం భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తా' అని టెస్టుల్లో తాను ధరించే టోపీతో కలిపి 38 ఏళ్ల రోహిత్ తన ప్రకటనను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. కాగా, ఇటీవలే రోహిత్ కెప్టెన్సీలో ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీ టైటిల్‌ను టీమిండియా సొంతం చేసుకోవడం విశేషం.

రోహిత్ టెస్టు కెరీర్

మొత్తం మ్యాచ్‌లు 67

ఇన్నింగ్స్	116
నాటౌట్	10
రన్స్	4301
అత్యధికం	212
సగటు	40.57
సెంచరీలు	12
అర్ధసెంచరీలు	18

	మ్యాచ్‌లు	గెలుపు	ఓటమి	డ్రా
కెప్టెన్‌గా	24	12	9	3

టెస్టు అరంగేట్రం
వెస్టిండీస్‌పై (2013 నవంబరు 6)

చివరి టెస్టు
ఆస్ట్రేలియాపై (2024 డిసెంబరు 26)

ఒడిదుడుకులు..



2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో రోహిత్ సారథ్యంలోనే ఆస్ట్రేలియాతో భారత్ తలపడింది. ఆ సైకిల్ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ ప్రశంసనీయంగానే రాణించింది. కానీ ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్‌తో, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భారత జట్టు దారుణ వైఫల్యాలు చవిచూసింది. ఈ సిరీస్‌లలో బ్యాటర్‌గా కూడా రోహిత్ పూర్తిగా నిరాశ పరిచాడు. పైగా.. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చివరి టెస్టు నుంచి రోహిత్ తనంతటతాను వైదొలిగాడు. దాంతో అప్పట్లోనే అతడు టెస్టుల నుంచి రిటైర్ అవుతాడనే ఊహాగానాలు వెల్లువెత్తాయి. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ప్రారంభం కానుండడంతో గత కొన్ని రోజులుగా రోహిత్ రిటైర్మెంట్‌పై తిరిగి వార్తలు షికారు చేస్తున్నాయి.

అందుకేనా నిర్ణయం?



ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు త్వరలోనే భారత జట్టును ఎంపిక చేయనున్నారు. మరోవైపు కొత్త సారథితోనే 2025-27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ సైకిల్‌ను టీమిండియా ప్రారంభించాలని సెలెక్టర్లు నిర్ణయించినట్టు తెలిసింది. దాంతో కెప్టెన్‌గా రోహిత్‌ను తొలగించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే హిట్‌మ్యాన్ టెస్టులకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్టు భావిస్తున్నారు.

వారసుడు ఎవరు?

రోహిత్ రిటైర్ కావడంతో టెస్టుల్లో భారత జట్టుకు కొత్త కెప్టెన్ రానున్నాడు. అయితే, రోహిత్ వారసుడు ఎవరనేది ఇప్పుడు ఆసక్తికరం. బుమ్రా, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ రేసులో ఉంటారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ కొత్త సైకిల్‌ను జూన్‌లో ఇంగ్లండ్‌తో ఆ దేశంలో జరిగే సిరీస్‌తో భారత్ ప్రారంభించనుంది. త్వరలోనే జాతీయ సెలెక్షన్ కమిటీ ఈ సిరీస్‌కు సారథితోపాటు జట్టును ఎంపిక చేయనుంది.

అరంగేట్రం ఘనంగా..

ఓవరాల్‌గా కెరీర్‌లో 67 టెస్టులాడిన రోహిత్ 2021లో విరాట్ కోహ్లీ నుంచి సుదీర్ఘ ఫార్మాట్ పగ్గాలు స్వీకరించాడు. రోహిత్ సారథ్యంలో 24 టెస్టులు ఆడిన భారత్.. 12 మ్యాచ్‌ల్లో గెలుపొందింది. తొమ్మిదింటిలో ఓడిపోయింది. మూడు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. పరిమిత ఓవర్ల ఆటలో తిరుగులేని మొనగాడుగా పేరుపొందిన రోహిత్ టెస్టుల్లో మాత్రం పెద్దగా రాణించలేకపోయాడు. సుదీర్ఘ ఫార్మాట్ అరంగేట్రం ఘనంగా చేసినా.. తర్వాత..తర్వాత..అదే స్థాయిలో సత్తా చాటలేకపోయాడు. ఒకే ఆర్డర్‌లోగాక ఓపెనర్‌గా, వివిధ స్థాయిల్లో బ్యాటింగ్ చేయడం టెస్టుల్లో రోహిత్ అంతగా ఆకట్టుకోలేకపోవడానికి కారణంగా చెబుతారు. 2013లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్ దిగ్గజ బ్యాటర్ సచిన్‌కు వీడ్కోలు. ఆ సిరీస్‌లో ఈడెన్‌గార్డెన్స్ మ్యాచ్‌లో రోహిత్ టెస్టుల్లో అడుగుపెట్టాడు. 177 పరుగులతో భళా అనిపించాడు. సొంత గ్రౌండ్ ముంబైలో జరిగిన రెండో టెస్టులో మరో శతకం (111 నాటౌట్)తో వహ్వా అనిపించాడు. తర్వాత నిలకడ లోపించడంతో టెస్ట్ జట్టులో సుస్థిర స్థానం సంపాదించలేకపోయాడు. 2019లో దక్షిణాఫ్రికాపై టెస్టులో డబుల్ సెంచరీ (212) చేయడం రోహిత్‌కు అత్యుత్తమ ప్రదర్శన.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఈడెన్ మ్యాచ్‌కు బాంబు బెదిరింపు

కోల్‌కతా: 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో..చెన్నై-కోల్‌కతా మ్యాచ్‌కు బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. బుధవారం మధ్యాహ్నం బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధికారిక ఈ-మెయిల్‌కు ఈ బెదిరింపు రావడంతో.. పోలీసులు మ్యాచ్‌కు వేదికైన ఈడెన్ గార్డెన్స్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

తుదిపోరుకు సురేఖ, చికిత బృందం

షాంఘై: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-2 పోటీల్లో తెలుగమ్మాయిలు వెన్నం జ్యోతి సురేఖ, చికిత తానిపర్తి పతకం ఖాయం చేసుకున్నారు. ఈ టోర్నీలో భారత పురుషులు, మహిళల కాంపౌండ్ జట్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లి కనీసం రెండు రజతాలు ఖరారు చేశారు. మహిళల టీమ్ ఈవెంట్‌లో సురేఖ, చికిత, మధురలతో కూడిన త్రయం సెమీస్‌లో బ్రిటన్‌ను.. అభిషేక్, ఓజాస్, రిషభ్‌లతో కూడిన పురుషుల బృందం డెన్మార్క్‌ను ఓడించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	12	5	6	1	11	0.193
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	12	3	9	0	6	-0.992

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

బ్రేవిస్ అదుర్స్

- చెన్నైకి మూడో విజయం
- కోల్‌కతా నాకౌట్ ఆశలు ఆవిరి?
- నూర్‌కు 4 వికెట్లు



డెవాల్డ్ బ్రేవిస్ (52)

నూర్ అహ్మద్ (4/31)

ఐపీఎల్‌లో నేడు
పంజాబ్ x ఢిల్లీ
వేదిక ధర్మశాల
రా.7.30 నుంచి

కోల్‌కతా: డెవాల్డ్ బ్రేవిస్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 52) మలుపుతిప్పే ఆటతో.. డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపుగా ఆవిరయ్యాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 2 వికెట్లతో కోల్‌కతాపై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 179/6 స్కోరు చేసింది. రహానె (48), రస్సెల్ (38), మనీష్ పాండే (36 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నూర్ 4 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 19.4 ఓవర్లలో 183/8 స్కోరు చేసి గెలిచింది. శివమ్ దూబే (45), ఉర్విల్ పటేల్ (31) రాణించారు. వైభవ్ అరోరా 3 వికెట్లు తీశాడు.

ఆశలులేని స్థితి నుంచి..: పవర్‌ప్లేలో 62/5తో టాప్-5 వికెట్లు చేజార్చుకొన్న చెన్నై.. మ్యాచ్‌పై దాదాపుగా ఆశలు వదిలేసుకొంది. కానీ, దూబేతో కలసి బ్రేవిస్ ఆరో వికెట్‌కు 67 పరుగులు జోడించడంతో ఒక్కసారిగా మ్యాచ్‌లోకి వచ్చింది. 11వ ఓవర్‌లో అరోరా బౌలింగ్‌లో చెలరేగిన బ్రేవిస్ 3 సిక్స్‌లు, 3 ఫోర్లతో 30 పరుగులు రాబట్టడం హైలైట్. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న బ్రేవిస్‌ను వరుణ్ అవుట్ చేశాడు. విజయానికి చివరి 5 ఓవర్లలో 40 రన్స్ అవసరమవగా.. ధోనీ (17 నాటౌట్), దూబే ఏడో వికెట్‌కు 43 రన్స్ భాగస్వామ్యంతో గెలుపుముంగిట నిలిపారు. దూబేను కూడా అరోరా అవుట్ చేసినా.. అన్షుల్ (4 నాటౌట్) ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఓపెనర్లు మాత్రె(0), కాన్వే (0) డకౌటవగా, ఉర్విల్‌ను హర్షిత్ అవుట్ చేశాడు. అశ్విన్ (8), జడేజా (19) నిరాశపర్చారు.

దెబ్బకొట్టిన నూర్: స్పిన్నర్ నూర్ దెబ్బకు కోల్‌కతా ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్ గుర్బాజ్ (11) విఫలమైనా.. నరైన్ (26), రహానె రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. దీంతో పవర్‌ప్లేను కోల్‌కతా 67/1తో ముగించింది. కానీ, 8వ ఓవర్‌లో నరైన్, రఘువంశీ (1)ని అవుట్ చేసిన నూర్ దెబ్బకొట్టాడు. రహానెను జడేజా బౌల్డ్ చేశాడు. ఈ దశలో రస్సెల్.. మనీష్‌తో కలసి ధాటిగా ఆడుతూ స్కోరు వేగం పెంచాడు. అయితే, రస్సెల్, రింకూ సింగ్ (9)ను కూడా నూర్ అవుట్ చేశాడు.

స్కోరు బోర్డు

కోల్‌కతా: గుర్బాజ్ (సి) నూర్ (బి) అన్షుల్ 11, నరైన్ (స్టంప్డ్) ధోనీ (బి) నూర్ 26, రహానె (సి) కాన్వే (బి) జడేజా 48, రఘువంశీ (సి) ధోనీ (బి) నూర్ 1, మనీష్ (నాటౌట్) 36, రస్సెల్ (సి) బ్రేవిస్ (బి) నూర్ 38, రింకూ (సి) మాత్రె (బి) నూర్ 9, రమణ్‌దీప్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 179/6; వికెట్ల పతనం:** 1-11, 2-69, 3-71, 4-103, 5-149, 6-167; **బౌలింగ్:** ఖలీల్ 2-0-14-0, అన్షుల్ 3-0-38-1, అశ్విన్ 3-0-19-0, నూర్ అహ్మద్ 4-0-31-4, జడేజా 4-0-34-1, పతిరన 4-0-39-0.

చెన్నై: ఆయుష్ మాత్రె (సి) హర్షిత్ (బి) అరోరా 0, కాన్వే (బి) అలీ 0, ఉర్విల్ (సి) వరుణ్ (బి) హర్షిత్ 31, అశ్విన్ (సి) రఘువంశీ (బి) హర్షిత్ 8, జడేజా (బి) వరుణ్ 19, డెవాల్డ్ బ్రేవిస్ (సి) రింకూ (బి) వరుణ్ 52, శివమ్ దూబే (సి) రింకూ (బి) అరోరా 45, ధోనీ (నాటౌట్) 17, నూర్ (సి) రింకూ (బి) అరోరా 2, అన్షుల్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19.4 ఓవర్లలో 183/8; వికెట్ల పతనం:** 1-0, 2-25, 3-37, 4-56, 5-60, 6-127, 7-170, 8-172; **బౌలింగ్:** వైభవ్ అరోరా 3-0-48-3, మొయిన్ అలీ 2-0-23-1, హర్షిత్ 4-0-43-2, వరుణ్ 4-0-18-2, నరైన్ 4-0-28-0, రస్సెల్ 2.4-0-22-0.

'ఖేలో' గేమ్స్‌లో తెలుగు అథ్లెట్ల జోరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. బుధవారం బిహార్‌లోని గయాలో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్, తీర్థ స్విమ్మింగ్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో రజతం, కాంస్యం నెగ్గారు. 4-100 మెడ్లే రిలేలో ఏపీ జట్టు కాంస్యం సాధించింది. ఆర్చరీ రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో ఏపీ జంట కోదండపాణి, వైష్ణవి కాంస్యం అందుకుంది. స్విమ్మింగ్ 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో తెలంగాణకు చెందిన సుహాస్ రజతం, 400 మీటర్ల మెడ్లేలో శ్రీనిత్య కాంస్యం, సైక్లింగ్‌లో తనీష్ కుమార్ కాంస్యం సాధించాడు.

ఫైనల్లో భారత్

- అదరగొట్టిన జెమీమా, దీప్తి
- దక్షిణాఫ్రికాపై ఉత్కంఠ విజయం

కొలంబో: జెమీమా రోడ్రిగ్స్ (123) సెంచరీతోపాటు దీప్తి శర్మ (93, 2/57) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మహిళల ముక్కోణపు సిరీస్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 23 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. దీంతో ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో శ్రీలంకతో భారత్ అమీతుమీ తేల్చుకోనుండగా.. వరుసగా మూడో ఓటమితో సౌతాఫ్రికా టోర్నీ నుంచి అవుటైంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 337 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (51) హాఫ్ సెంచరీ చేయగా, హర్మన్‌ప్రీత్ (28) ఫర్వాలేదనిపించింది. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 314/7 స్కోరు మాత్రమే చేసింది. అమన్‌జోత్ 3 వికెట్లు తీసింది. అనెరి డ్రెకెసెన్ (81), కెప్టెన్ చోల్ ట్రయాన్ (61) పోరాటాలు వృథా అయ్యాయి.

బిజినెస్

భారత్ బేఫికర్.. పాక్ బేజార్!

ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలు.. ఒడుదుడుకుల్లోనూ 105 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్



ముంబై: పహల్గాంలో తీవ్రవాదుల దాడికి ప్రతీకారంగా అపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం మెరుపు దాడులు జరిపిన ప్రభావంతో పాక్ స్టాక్ మార్కెట్ బుధవారం కుప్పకూలింది. కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని కేఎస్ఈ-100 ఇండెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 6,500 పాయింట్లకు పైగా (దాదాపు 6 శాతం) పతనమైంది. చివరికి 3.13 శాతం నష్టంతో ముగిసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ భారీ ఒడుదుడుకులకు లోనైనప్పటికీ చివరికి లాభాల్లో ముగిసింది. ప్రారంభ ట్రేడింగ్‌లో 700 పాయింట్ల మేరకు క్షీణించి 80,000 కన్నా దిగజారిన సెన్సెక్స్ చివరికి 105.71 పాయింట్ల లాభంతో 80,746.78 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఆటో షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ లాభాలకు ఊతం ఇచ్చాయి. నిఫ్టీ 34.80 పాయింట్లు లాభపడి 24,414.40 వద్ద ముగిసింది.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 42 పైసలు తగ్గి రూ.84.77 వద్ద ముగిసింది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

గతంలోనూ మన మార్కెట్లో స్వల్ప దిద్దుబాట్లే..

కార్గిల్ యుద్ధం, మన పార్లమెంట్‌పై తీవ్రవాదుల దాడి.. యురి, పుల్వామా ఘటనల కారణంగా భారత్-పాకిస్థాన్ మధ్య గతంలోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సందర్భాల్లోనూ దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం తక్కువేనని ఆనంద్ రాఠీ పరిశోధన బృందం నివేదిక పేర్కొంది. మన సూచీలు పరిమితంగా, స్వల్పకాలం పాటు దిద్దుబాటుకు లోనయ్యాయే తప్ప భారీగా, దీర్ఘకాలిక పతనాలను చవిచూసిన సందర్భాల్లేవని అంటోంది. మన ఆర్థిక మూలాలు బలంగా ఉండటం ఇందుకు దోహదపడిందని నివేదికలో ప్రస్తావించింది. భారత్-పాక్ మధ్య గత ఉద్రిక్తతల సమయంలో సెన్సెక్స్ దిద్దుబాటు 3.5-7.5 శాతం శ్రేణిలో ఉంది. ఈసారి రెండు దేశాల మధ్య యుద్ధం తరహా పరిస్థితులు నెలకొన్నప్పటికీ నిఫ్టీ సూచీ 5-10 శాతానికి మించి తగ్గకపోవచ్చని ఆనంద్ రాఠీ అంచనా వేసింది.

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ముందుజాగ్రత్త చర్యలు

పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాదుల శిబిరాలపై భారత సైన్యం మెరుపు దాడులు జరిపిన నేపథ్యంలో దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి. విదేశీయులు యాక్సెస్ చేయకుండా తమ వెబ్‌సైట్లను బ్లాక్ చేశాయి. ముఖ్యంగా పాకిస్థానీయులు సైబర్ దాడులకు పాల్పడకుండా నిరోధించడమే ఎక్స్ఛేంజ్‌ల ప్రధానోద్దేశం.

పీఎన్‌బీ లాభం రూ.4,567 కోట్లు

» 52 శాతం వృద్ధి » ఒక్కో షేరుపై రూ.2.9 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి బ్యాంకు రూ.4,567 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.3,010 కోట్లతో పోలిస్తే ఇది 52 శాతం ఎక్కువ. ఇదే సమయంలో బ్యాంకు స్థూల ఆదాయం రూ.32,361 కోట్ల నుంచి రూ.36,705 కోట్లకు చేరింది. క్యూ4లో వ్యాపార వృద్ధితో పాటు మాఫీ చేసిన రుణాల్లో రూ.4,926 కోట్లు వసూలు కావడం, ట్రెజరీ ఆదాయం రూ.1,157 కోట్ల నుంచి రూ.4,314 కోట్లకు చేరడం ఇందుకు ప్రధాన కారణమని పీఎన్‌బీ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంకు నికర లాభం రూ.8,245 కోట్ల నుంచి రూ.16,630 కోట్లకు పెరిగింది. స్థూల ఆదాయం రూ.1,20,285 కోట్ల నుంచి రూ.1,38,070 కోట్లకు చేరింది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో ఈక్విటీ షేరుపై వాటాదారులకు రూ.2.90 చొప్పున డివిడెండ్ చెల్లించాలని పీఎన్‌బీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

3,000 కొలువులు

వ్యాపార విస్తరణ కోసం ఈ ఆర్థిక సంవత్సరం కొత్తగా 200 శాఖలు ప్రారంభించబోతున్నట్టు బ్యాంకు ఎండీ తెలిపారు. దీంతో ఆఫీసర్లు, ఇతర కేడర్లలో కొత్తగా 3,000 మంది ఉద్యోగులను కూడా బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిక్రూట్ చేసుకోనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా తమ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.8 నుంచి 2.9 శాతం మధ్య ఉండే అవకాశం ఉందన్నారు.

బంగారం రూ.లక్ష పైకి


పసిడి మళ్లీ లక్ష రూపాయలు దాటింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,00,750కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం రూ.1,050 పెరుగుదలతో రూ.1,00,350కి ఎగబాకింది. కిలో వెండి కూడా రూ.440 పెరిగి రూ.98,940 ధర పలికింది. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలతో అంతర్జాతీయంగా వీటి ధరలు మళ్లీ ఎగబాకడం, భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి దేశీయంగా డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 3,369 డాలర్లు, వెండి 32.81 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	500
వరంగల్	487	గోదావరి	500
చిత్తూరు	563	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	145	విజయవాడ	144
వరంగల్	145	గుంటూరు	142
కరీంనగర్	145	ఒంగోలు	142
మహబూబ్‌నగర్	145	చిత్తూరు	117
కర్నూలు	145	నెల్లూరు	122
విశాఖపట్నం	141	అనంతపురం	122
గోదావరి	144		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,000 ▲	90,750 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	98,500 ▲
విశాఖపట్నం	1,00,800 ▲	90,750 ▲	1,11,000 ▲
రాజమండ్రి	99,000 ▼	90,075 ▼	99,000 ▲
ప్రొద్దుటూరు	98,700 ▲	90,800 ▲	98,600 ▲
ముంబై	97,430 ▲	89,240 ▲	95,770 ▼

ముడిచమురు ధరల తగ్గుదలతో భారత్‌కు 1.8 లక్షల కోట్ల లబ్ధి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల తగ్గుదల ట్రెండ్ కొనసాగితే భారత్‌కు ప్రయోజనకరమేనని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. ముడిచమురు, ఎల్ఎన్‌జీ దిగుమతులపై భారత్‌కు రూ.1.8 లక్షల కోట్ల మేర ఆదా కావచ్చని అంచనా వేసింది. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. మూడో అతిపెద్ద ఇంధన వినియోగదారు కూడా. దేశీయ ఇంధన అవసరాల్లో 85 శాతం దిగుమతుల ద్వారానే సమకూరుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) భారత్ చమురు దిగుమతుల కోసం 24,240 కోట్ల డాలర్లు (రూ.20.60 లక్షల కోట్లు), ఎల్ఎన్‌జీ దిగుమతి కోసం 1,520 కోట్ల డాలర్లు (రూ.1.29 లక్షల కోట్లు) వెచ్చించింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర గురువారం ఒక దశలో 0.64 శాతం పెరుగుదలతో 62.55 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో క్రూడాయిల్ 60-70 డాలర్ల స్థాయికి పరిమితం కావచ్చని ఇక్రా భావిస్తోంది.

కోల్ ఇండియా లాభంలో క్షీణత

» ఒక్కో షేరుపై రూ.5.15 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) 2024-25 ఆర్థిక సంవత్సరం ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. ఈ కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.37,402.29 కోట్ల నుంచి రూ.35,358.16 కోట్లకు పడిపోయింది. ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.1,52,731.5 కోట్ల నుంచి రూ.1,52,888.98 కోట్లకు చేరింది. అయితే మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మాత్రం సీఐఎల్ నికర లాభం, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 12 శాతం పెరిగి రూ.9,604 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఆదాయమూ రూ.40,457.59 కోట్ల నుంచి రూ.41,761.76 కోట్లకు చేరింది.

నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడంతో రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.5.15 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. సీఐఎల్ ఇప్పటికే ఒక్కో షేరుపై రూ.21.35 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. ఈ తుది డివిడెండ్‌ను కలిపితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.26.5 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూపాయి ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.10 ముఖ విలువ ఉన్న షేర్లపై కంపెనీ 265 శాతం డివిడెండ్ చెల్లించినట్టవుతుంది

పెట్టుబడి మోసాలకు చెక్

» 23 వేల ఫేస్‌బుక్ పేజీలు తొలగించిన మెటా

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్ వేదికగా పెట్టుబడి మోసాలకు మాతృసంస్థ మెటా చెక్ పెట్టింది. భారత్, బ్రెజిల్ వంటి దేశాల ప్రజలకు వల వేస్తూ మోసగాళ్లు రూపొందించిన 23 వేల పేజీలను మార్చి నెలలో ఫేస్‌బుక్ నుంచి తొలగించింది. "ఈ స్కామర్లు డీప్‌ఫేక్, ఇతర ఆధునిక టెక్నిక్‌లను ఉపయోగించి పర్సనల్ ఫైనాన్స్ క్రియేటర్లు, క్రికెట్ ఆటగాళ్లు, వ్యాపార ప్రముఖుల పేరిట మోసపూరితమైన ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లకు తాము మద్దతు ఇస్తున్నట్టు ప్రకటిస్తారు. అలా ప్రజలు వలలో పడి వారు చెప్పిన స్కామ్ గ్యాంబ్లింగ్ యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహిస్తారు" అని మెటా తెలిపింది. ఆ రకంగా మనుగడలో లేని నకిలీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రేరేపిస్తారని పేర్కొంది.

స్టార్‌లింక్‌కు కేంద్రం అనుమతులు

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ (శాట్‌కామ్) సేవల కంపెనీ స్టార్‌లింక్ భారత్‌లో సేవలందించేందుకు మన ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. శాట్‌కామ్ లైసెన్సులో జాతీయ భద్రతకు కీలకమైన నిబంధనలకు లోబడేందుకు అంగీకరించడంతో స్టార్‌లింక్‌కు మన టెలికాం శాఖ లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను జారీ చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. స్టార్‌లింక్ శాటిలైట్ టెక్నాలజీ ఆధారంగా అత్యంత వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలనందిస్తోంది.



తిరుపతి ఐఐటీకి మహర్దశ!

- మౌలిక సదుపాయాల పెంపు
- ఐఐటీల్లో పెరగనున్న 6,500 సీట్లు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఐఐటీ సహా పారిశ్రామిక శిక్షణ(ఐటీఐ), నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయడంతోపాటు ఆయా విద్యాసంస్థలను మరింత ఆధునీకరించేలా కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఐఐటీలకు నిధులు, సీట్ల సంఖ్య పెంపునకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా నైపుణ్యాభివృద్ధి కోసం ఐదు 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఐఐటీల విస్తరణకు రూ.11,828 కోట్లు, ఐటీఐల ఆధునీకరణ, 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ల ఏర్పాటుకు రూ.60,000 కోట్లు రాష్ట్రాల భాగస్వామ్యంతో ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో ఏపీలోని తిరుపతి ఐఐటీ సహా కేరళ, ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్, కర్ణాటకలలోని 5 ఐఐటీలకు మహర్దశ పట్టనుంది. వీటిలో అధునాతన మౌలిక సదుపాయాల కల్పన, సామర్థ్యాన్ని పెంచనున్నారు. 130 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తారు. వచ్చే 4 సంవత్సరాల్లో సీట్లను మరో 6,500లకు పైగా పెంచనున్నారు. దేశవ్యాప్తంగా వెయ్యి ఐటీఐల నవీకరణ, 5 జాతీయ అత్యున్నత నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

ప్రేమ తగ్గింది చెల్లిపైనే.. నాపై కాదు కదా!

- సరస్వతి పవర్‌లో 99.89% షేర్లు నా వద్దే
- ఎన్‌సీఎల్‌టీలో జగన్ తల్లి విజయలక్ష్మి వెల్లడి
- తదుపరి విచారణ 30కి వాయిదా



హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ షేర్ల బదిలీ విషయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంలో పుట్టిన చిచ్చు.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ వేదికగా పతాక స్థాయికి చేరింది. జగన్ తనకు చెల్లిపై ప్రేమ తగ్గిందనే చెబుతున్నారని.. తల్లిపై తగ్గిందని చెప్పడం లేదని జగన్ తల్లి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ కంపెనీ వందశాతం తనదేనని స్పష్టంచేశారు. సరస్వతి పవర్‌లో తమ వాటాను మోసపూరిత పద్ధతిలో బదిలీ చేసుకున్నారని.. షేర్ల బదిలీని నిలిపేయాలని, తమ వాటా పునరుద్ధరించాలని కోరుతూ మాజీ సీఎం జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ.. ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై రాజీవ్ భరద్వాజ్, సంజయ్‌పూరితో కూడిన ధర్మాసనం బుధవారం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. 'సరస్వతి పవర్ మా తండ్రి సంపాదించిన ఆస్తి కాదు. ఆయన సంపాదించిన ఆస్తిలో వాటాలు ఎప్పుడో ఇచ్చేశాను. ఆ తర్వాత చెల్లి షర్మిలపై ప్రేమ, అనురాగంతో సరస్వతి పవర్‌లో మాకున్న 51శాతం వాటాను ఈడీ కేసులు ముగిసిన తర్వాత ఇద్దామనుకున్నా. చెల్లి నాపై అనుమానంతో తల్లిపై ఒత్తిడి తెచ్చి వాటాలు బదిలీ చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల సందర్భంగా ఆమె వేరే పార్టీలో చేరి నాపై తీవ్ర విమర్శలు చేసింది. అందుకే ఆమెపై ప్రేమ, అనురాగం పోయాయి. ఆమెకు సరస్వతిలో వాటా ఇచ్చే ఉద్దేశం లేకపోవడంతో ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నాం. నేనే దాతనుకాబట్టి ఎంవోయూ, గిఫ్ట్‌డీడ్ రద్దుచేసే హక్కు ఉంటుంది. జూలై 6వ తేదీ ఇండెమ్నిటీతో జూలై 2న బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి.. తల్లి, చెల్లి మోసంచేసి నా వాటా బదిలీ చేసుకున్నారు. ఈ అక్రమ బదిలీని కంపెనీ ఎలా ఆమోదిస్తుంది? ఈ అక్రమాన్ని గుర్తించి నా వాటా నాకు పునరుద్ధరించండి' అని జగన్ కోరారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది, వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి, విజయలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'చెల్లిపై ప్రేమ తగ్గిందని నా కుమారుడు జగన్ పంతం పఠంగా చెబుతున్నారు. తల్లిగా నాపై ప్రేమ తగ్గిందని చెప్పడం లేదు. కంపెనీలో 99.89శాతం వాటా నా వద్దే ఉంది. వందశాతం కంపెనీ నాదే. కుటుంబ వ్యవహారాన్ని కోర్టుకు లాగారు. వివాదాస్పద అంశాలు ఉన్న ఈ వివాదాన్ని తేల్చాల్సింది ఎన్‌సీఎల్‌టీ కాదు. సివిల్ కోర్టు తేల్చాలి. నిబంధనల ప్రకారమే నాపేరిట షేర్ల బదిలీ జరిగింది. ఎలాంటి మోసం, కుట్రా లేవు. నా కుమారుడు, నేను ఒకే ఇంట్లో ఉంటున్నాం. అలాంటప్పుడు షేర్ సర్టిఫికెట్లు నా వద్ద లేవని ఎలా అంటారు' అని విజయలక్ష్మి ప్రశ్నించారు. తమ కంపెనీకి విజయలక్ష్మే పూర్తి స్థాయి యజమాని అని సరస్వతి పవర్ తరఫున సీనియర్ న్యాయవాది పాండ్యన్ పేర్కొన్నారు. గిఫ్ట్ డీడ్, ఎంవోయూ తర్వాత జగన్ సరస్వతి పవర్ బోర్డుకు రాజీనామా చేశారు. కంపెనీకి సంబంధించినంత వరకు ఆయన సంబంధం లేని వ్యక్తి. మా అంతర్గత వ్యవహారాలను ప్రశ్నించడానికి ఆయనెవరు?' అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంతో తన క్లయింటుకు సంబంధం లేదని.. ఆమెకు ఏ వాటా లేదని.. ఆమెను ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని షర్మిల తరఫు న్యాయవాది కోరారు. షేర్ల బదిలీ కోసం జరిగిన బోర్డు సమావేశంలో పాల్గొన లేదని.. సంతకాల కోసం షర్మిల తనను ఇంటికి పిలిచారని యశ్వంత్‌రెడ్డి అనే డైరెక్టర్ తెలియజేశారు. అనంతరం అన్ని పక్షాల వాదనలు పూర్తయ్యాయని ధర్మాసనం ప్రకటించింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

అజ్ఞాతం వీడిన తోపుదుర్తి

పుట్టపర్తి, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అజ్ఞాతం వీడారు. కుంటిమద్ది హెలిప్యాడ్ కేసులో అరెస్టు భయంతో ఊరు విడిచిన ఆయన.. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అనంతపురానికి బుధవారం తిరిగి వచ్చారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ అనంతపురంలో తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ఇంటికి వెళ్లి బుధవారం నోటీసులు ఇచ్చారు. ఈ నెల 12లోపు రామగిరి సర్కిల్ కార్యాలయానికి విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

నైపుణ్యంతో నాణ్యమైన సేవలు

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రతి ఉద్యోగికి శిక్షణ
- నేను నిత్యం కొత్త విషయాలు నేర్చుకుంటా.. టెక్నాలజీ గురించి తెలుసుకుంటా
- స్వర్ణాంధ్ర, జీఎస్‌డీపీపై చంద్రబాబు సమీక్ష
- ముఖ్యమంత్రి చైర్మన్‌గా పీ4 ఫౌండేషన్
- జనాభా నిర్వహణపై త్వరలో ప్రత్యేక విధానం

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉద్యోగులందరూ నైపుణ్యాల మెరుగుదలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల శిక్షణతో సామర్థ్యం పెంచడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారి నుంచి సెక్రటరీ వరకు, కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు అందరూ నైపుణ్యాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. బుధవారం సచివాలయంలో ప్రణాళిక, స్వర్ణాంధ్ర విజన్, జీఎస్డీపీపై ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. 'నేను కూడా నిత్యం మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సామర్థ్యాల పెంపుపై దృష్టి పెడతాను. కొత్త విషయాలు నేర్చుకుంటా. టెక్నాలజీ గురించి తెలుసుకుంటా. సాంకేతికత ద్వారా పాలనతో ఎలాంటి మార్పులు తేవచ్చనేది తెలుసుకుంటాను. ప్రతి ఉద్యోగి శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు. సేవల్లో నాణ్యత పెరుగుతుంది' అని చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యం చేరుకోవడం కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కాగా, నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్ వచ్చే నెల నాటికి రూపొందిస్తామని చెప్పారు. కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన నివేదికలు ఒకటి జూన్ నాటికి, మరొకటి సెప్టెంబర్ నాటికి రూపొందుతాయని అధికారులు వివరించారు. కీలక విధానాలైన జీరో పావర్టీ పీ4, జనాభా నిర్వహణ అంశాలను విజన్‌లో పొందుపరుస్తారు. ప్రతి జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపులు మే 9తో పూర్తవుతాయని అధికారులు చెప్పారు. నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్లు నెలకొల్పేందుకు 143 స్థలాలు గుర్తించారు. జీరో పావర్టీ పీ4 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రంలో 15,315 బంగారు కుటుంబాలను 1,118 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. పీ4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా 25 మందితో కూడిన రాష్ట్రస్థాయి కమిటీ వేస్తారు. దీనికి అనుబంధంగా ఎగ్జిక్యూటివ్ కమిటీ, సాధికార బృందాలతో పీ4 ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నారు.

జనాభా సమతుల్యతే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జనాభా నిర్వహణ విధానం తీసుకొస్తున్నారు. జనాభా సమతుల్యత అనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకువస్తోంది. జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. మహిళా ఉద్యోగులకు ఇద్దరు పిల్లల వరకు ఇచ్చే ప్రసూతి సెలవుల పరిమితిని ఎత్తివేసింది. అలాగే ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులుగా మినహాయింపు ఇచ్చింది. జనాభా పెరుగుదలకు ఉన్న అవకాశాలు, అడ్డంకులపై ప్రత్యేకంగా సర్వే నిర్వహించి వాటి ఆధారంగా విధానం రూపొందిస్తామని అధికారులు చెప్పారు. సమీక్షా సమావేశంలో ముందుగా ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగింది. ఉగ్రస్థావరాలపై భారత సైన్యం జరిపిన దాడులపై ముఖ్యమంత్రి ప్రశంసించారు. పహల్గాం దాడికి ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రం గట్టి సమాధానం ఇచ్చిందన్నారు.

రేటింగ్ ఆధారంగా 'విద్యాహక్కు' ఫీజులు

- ప్రైవేటు పాఠశాలలకూ స్టార్ రేటింగ్
- కనీసం రూ.8 వేలు.. గరిష్ఠం రూ.15వేలు
- పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదన

అమరావతి/విజయవాడ(మొగల్రాజపురం), మే 7(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ద్వారా అడ్మిషన్లు పొందే విద్యార్థుల ఫీజులపై ప్రభుత్వం కొత్త ప్రతిపాదన పెట్టింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఆధారంగా స్టార్ రేటింగ్ ఇచ్చి, అందుకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించాలని భావిస్తోంది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు బుధవారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఈ ప్రతిపాదన పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రకాల ఫీజులు అమలుచేసింది. పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6500, గిరిజన ప్రాంతాల్లో రూ.5100 చొప్పున ఫీజులు నిర్ణయించింది. ఆ ఫీజులు మరీ తక్కువగా ఉన్నాయని ఫీజులు పెంచాలని అప్పటి నుంచీ ప్రైవేటు పాఠశాలల యాజయాన్యాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించింది. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను 18 రకాలుగా వర్గీకరించి వాటి ఆధారంగా ఇటీవల స్టార్ రేటింగ్ ఇచ్చారు. ఇప్పుడు ప్రైవేటు పాఠశాలలకు కూడా అలాగే స్టార్ రేటింగ్ ప్రకటించారు. 95 పాఠశాలలు ఒక స్టార్, 3,420 పాఠశాలలు రెండు సార్లు, 5,730 పాఠశాలలు మూడు స్టార్లు, 708 పాఠశాలలు నాలుగు స్టార్లు సాధించాయి. ఫైవ్ స్టార్ సాధించిన పాఠశాల ఒక్కటి కూడా లేదు. ఒక స్టార్ ఉంటే రూ.8వేలు, రెండు స్టార్లు ఉంటే రూ.9వేలు, మూడు స్టార్లు ఉంటే రూ.10 వేలు, నాలుగు స్టార్లు ఉంటే రూ.12 వేలు, ఐదు స్టార్లు ఉంటే రూ.15వేలు చొప్పున సగటు ఫీజులు నిర్ణయించాలని పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించింది. తరగతుల ఆధారంగా ఫీజులు మారుతాయి. కాగా ఈ ఫీజులు సరిపోవని, ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఎంత ఖర్చు చేస్తున్నారో అంత ఫీజు చెల్లించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టప్రకారం ప్రైవేట్ పాఠశాలలు ఇస్తున్న 25శాతం అడ్మిషన్లలో అనర్హులను గుర్తించే అధికారాన్ని ఆయా పాఠశాలల యాజమాన్యాలకు ఇచ్చారని ఫెడరేషన్ ఆఫ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్స్ రాష్ట్ర ప్రతినిధి కె.తులసీ ప్రసాద్ చెప్పారు.

టీటీడీకి అలిపిరిలో 35 ఎకరాలు

- బదులుగా ఏపీ టూరిజంకు మరో చోట కేటాయింపు

తిరుమల, మే 7(ఆంధ్రజ్యోతి): అలిపిరి సమీపంలో ఏపీ టూరిజం అథారిటీకి చెందిన భూమిని టీటీడీకి కేటాయించినందుకు బదులుగా ఆ సంస్థకు మరో చోట భూమి కేటాయిస్తూ బుధవారం తిరుమలలో జరిగిన టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం నిర్ణయం తీసుకుంది. చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు ప్రశాంతిరెడ్డి, పనబాక లక్ష్మీ, జాస్తి పూర్ణసాంబశివరావు, సదాశివరావు శాంతారామ్, జానకీదేవి, భానుప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. మిగిలిన సభ్యులు వర్చువల్‌గా పాల్గొన్నారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామం పరిధిలోని సర్వే నం.604లో 24.68 ఎకరాల ఏపీ టూరిజంకు చెందిన భూమిని టీటీడీకి బదలాయించాలని గతంలోనే తీర్మానం చేశారు. తాజాగా అదే సర్వే నం.లోని ఏపీటీఏకు చెందిన మరో 10.32 ఎకరాల భూమిని టీటీడీకి బదలాయించాలని బోర్డు తీర్మానం చేసింది. ఈ స్థలాలకు బదులుగా తిరుపతి అర్బన్ సర్వే నం.588-ఏలో టీటీడీకి చెందిన 35 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏకు కేటాయించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాయాలని నిర్ణయించారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జనజయ సిందూరం!

'భారత్, పాకిస్థాన్‌లు శాంతి సామరస్యాలతో మనలేవు. పెద్ద ఎత్తున విదేశీ సహాయం లేకుండా, చిన్న యుద్ధం కూడా చెయ్య లేవు' అని 1960ల్లో స్వీడిష్ ఆర్థికవేత్త, సామాజిక శాస్త్రవేత్త గనర్ మిర్డాల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలోని తొలి భాగం ఇప్పటికీ ఒక దురదృష్టకర వాస్తవంగా ఉన్నది. రెండో భాగంలోని యథార్థతను మనం అధిగమించాం.

పహల్గామ్‌లో ఉగ్రవాద ఘాతుకంపై భారత్ ప్రతీకార దాడి— ఆపరేషన్ సిందూర్— ని జయప్రదంగా నిర్వహించింది. భారతీయులలో సహజంగానే భావోద్విగ్నత నెలకొన్నది. పాకిస్థాన్ ఎప్పుడు, ఎలా ప్రతిస్పందిస్తుందో తెలియదు. దేశవ్యాప్తంగా కంటోన్మెంట్, చమురు శుద్ధి కర్మాగారం, అణు విద్యుదుత్పత్తి కేంద్రం మొదలైనవి ఉండే ప్రాంతాలలో యుద్ధ సన్నద్ధతకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శత్రు విమాన దాడుల గురించి హెచ్చరించేందుకు సైరన్ మోగించడం పరిపాటి. ఇలా సైరన్లు మోగింది చివరిసారి 1971 బంగ్లాదేశ్ విముక్తి సమర సందర్భంలోనని నేటి వృద్ధతరంలోని చాలా మందికి ఇంకా గుర్తు ఉండి ఉంటుంది. సంప్రదాయ యుద్ధాల కాలం (ఇది రెండో ప్రపంచ యుద్ధంతోనే ముగిసిపోయింది)లోనే ఎటువంటి విపత్కర పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు ప్రజలను సంసిద్ధపరచడం ఆనవాయితీగా ఉండేది. అణ్వస్త్రాలు, బాలిస్టిక్ మిసైల్స్ తదితర అత్యాధునిక యుద్ధ పరికరాలు, నవీన సాంకేతికతల ఆలంబనతో జరుగుతున్న ప్రస్తుత యుద్ధాల కాలంలోనూ ప్రజలను ఎటువంటి ముప్పు నెదుర్కోవడానికైనా సదా సర్వసన్నద్ధంగా ఉంచేందుకు ప్రభుత్వాలు సహజంగానే ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నాలు ఏ మాత్రం ఉపేక్షించదగినవి కావు. దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంత జాగరూకతతో ఉంటారో ప్రజలు సైతం అంతే జాగరూకతతో ఉండాలి.

యుద్ధ కాలంలో దేశభక్తి ఉప్పొంగడం సహజం. అందులోనూ మనం యుద్ధం చేస్తున్న శత్రు దేశం మతతత్వ రాజకీయాలతో, ఉన్మాదంతో మనపై అమానుష హింసాకాండకు పాల్పడి యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనేందుకు కారణం అయినప్పుడు సామాన్య ప్రజల్లో అంతులేని ఆగ్రహావేశాలు పెల్లుబికడం అసహజమేమీ కాదు. ఇప్పుడు మన సమాజంలో అదే జరుగుతోంది. దీంతో వ్యక్తులుగా ప్రజల అంతరంగంలో కొన్నిసార్లు సహజ మానవత అంతరించిపోతోంది. పసుపు పారాణి ఆరకుండానే పహల్గాంలో కళ్లెదుట భర్తను కోల్పోయిన హిమాన్షి నర్వాల్ మానవతా గీతాన్నే ఎలుగెత్తటాన్ని ఈ సందర్భంగా స్మరించుకోవాలి. విద్వేషాన్ని వీడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కొంత మంది సామాజిక మాధ్యమాలలో ఆమెపై జుగుప్సాకర వ్యాఖ్యలు చేయడం గర్హనీయం. అలాగే పహల్గాంలో తండ్రిని కోల్పోయిన విషాద సమయంలో తనకు తోబుట్టువుల వలే బాసటగా నిలబడ్డ ఇద్దరు కశ్మీరీ యువకుల గురించి ఆరతీ శేఖర్ అనే కేరళ యువతి చెప్పిన ప్రేమాస్పద మాటలు మనలో సౌభ్రాతృత్వ భావాన్ని పరిపూర్ణం చేస్తాయి. పహల్గాం దురాగతాన్ని సాకుగా తీసుకుని మత దృష్టితో అమాయకులను వేధించవద్దని హిమాన్షి, ఆరతి, ఇంకా ఇతర బాధితుల ఆప్తులు విజ్ఞప్తి చేశారు. యుద్ధ ఉద్రిక్తతలు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో మానవత్వంతో ప్రదీప్తమైన వారి మాటలను భారతీయ సమాజం విస్మరించకూడదు.

యుద్ధం వాంఛనీయమా? అదే పరిష్కార మార్గమా? అన్న ప్రశ్నలకు సమాధానాలు సందర్భాలను బట్టి ఉంటాయి. మన ప్రస్తుత సందర్భమూ అందుకు భిన్నమేమీ కాదు. యుద్ధాలు మానవత్వాన్ని హరించివేయడంతో పాటు ఆర్థిక జీవనాన్నీ ధ్వంసం చేస్తాయి. ఆర్థిక జీవనం సవ్యంగా లేనప్పుడు సామాజిక జీవనం సజావుగా సాగదు. రాజకీయ గమనంలో ఒడిదుడుకులు జాతి జీవనాన్ని సంక్షుభితపరుస్తాయి. చరిత్ర పునరావృతం అవటం ఎవరికీ క్షేమం కాదు. ఇరుగు పొరుగు దేశాలు, అందునా సహస్రాబ్దాల పాటు ఒకటిగా ఉండి నిన్న మొన్న విడిపోయిన దేశాల మధ్య సమస్యలు సహజమే కాకుండా అనివార్యం కూడా. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుని వివేకాన్ని కోల్పోకుండా ఉండడమే అసలైన జయపతాక. టెర్రరిస్టు కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత్ చేసిన దాడులతో ఆ వివేకం ప్రదర్శితమైందనే అనుకోవాలి.

నేరస్తులెవరు, బాధితులెవరు?

రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్ళు ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాటలు వింటూంటే త్వరలోనే యుద్ధం ఆగుతుందని ఒకసారి, మరింత సాగుతుందని మరోసారి అనిపిస్తూ ఉంటుంది. ఈ విషాద నాటకంలో పాత్రధారులు తక్కువేం లేరు. అమెరికా, మిగతా నాటో దేశాలు, రష్యా–ఉక్రెయిన్ దేశాల పాలకులు ప్రధానం. ఈ యుద్ధంలో ఇరు దేశాల ప్రజలూ, సైనికులూ బాధితులు. మరి, నేరగాళ్లెవరు? వీరిలో ఎవరెక్కువ నేరగాళ్లో చూద్దాం. 1991లో సోవియట్ యూనియన్ కుప్పకూలింది. అమెరికా ఏకచత్రాధిపత్యానికి మార్గం సుగమమైంది. అది రెండు జర్మనీలూ కలిసిపోతున్న సందర్భం. ఒక జర్మనీ వార్సా (సోవియట్) కూటమిలోనూ, రెండోది, నాటో (అమెరికా) కూటమిలోనూ ఉన్నాయి. ఆ రెండూ కలిసిపోయి నాటో కూటమికి వచ్చేస్తే నాటో ఇక తూర్పు వైపుకి "ఒక్క అంగుళం కూడా విస్తరించదు" అని ఆనాటి అమెరికా అధ్యక్షుడు బుష్(పెద్ద)... గర్బచోవ్‌కి హామీ ఇచ్చాడు. ఆయన ఒప్పుకున్నాడు. తర్వాత నాలుగేళ్లకి వార్సా కూటమి రద్దయింది. కనుక నాటో కూటమిని కూడా రద్దు చేయండన్న డిమాండ్ రష్యా నుంచే కాక, పశ్చిమ ప్రపంచంలో ప్రముఖుల నుంచి కూడా వచ్చింది.

నాటో— ఒక సైనిక కూటమి. అందులోని ఒక దేశం మరో బయటి దేశంతో కయ్యానికి దిగితే, మొత్తం నాటో దేశాలన్నీ ఆ బయటి దేశం మీద దాడికి పాల్పడవచ్చు. అటువంటప్పుడు నాటోలో చేరాలనుకోవడం సింపుల్‌గా ఎవరిష్టం వాళ్లది అనవచ్చా? గత ఎనభై ఏళ్ల చరిత్రలో జరిగిన వందలాది యుద్ధాలలో 90 శాతం యుద్ధాలు అమెరికా ప్రమేయంతో జరిగినవే. అమెరికా ఉందంటే, దానితోపాటు తోకల్లా నాటో దేశాలూ ఉంటాయి. అమెరికా అన్ని యుద్ధాలూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే చేస్తున్నా అంటుంది. అది ప్రజాతంత్రయుతంగానో లేదా విప్లవం ద్వారానో ఏర్పడిన ప్రభుత్వాల్ని కూల్చి, నియంతల్ని నిలిపిన ఘటనలు కొల్లలు. అయినా తాను గొప్ప ప్రజాతంత్రవాదినే అని బుకాయిస్తుంది అమెరికా.



ఉక్రెయిన్ యుద్ధానికి ప్రధాన కారకులు– 1. అమెరికా పాలకులు, 2. మిగతా నాటో దేశాల పాలకులు, 3. ఈ ఇద్దరి దన్ను చూసుకొని రష్యాని రెచ్చగొట్టిన ఉక్రెయిన్ నేతలు. వీరితో రష్యా నేత పుతిన్‌ని చేర్చక తప్పదు అంటే, అతన్ని సగం నేరగానిగానూ, సగం బాధితునిగానూ పరిగణించాలి.

తూర్పు వైపు ఒక్క అంగుళం కూడా జరగం, అన్న హామీ 1999లోనే గాలిలో కలిసిపోయింది. ఆ ఏడాది... పోలెండు, హంగరీ, చెక్ రిపబ్లిక్‌నీ నాటోలో చేర్చుకొన్నారు. రష్యా గోల చేసింది. నాటో లెక్క చేయలేదు. నాటో విస్తరణ తప్పని పశ్చిమ దేశాల ప్రముఖులూ చెప్పారు. ఇది 'విషాదకరమైన పొరబాటు' అని పశ్చిమ దేశాలకి చెందిన 50 మంది విదేశాంగ విధాన నిపుణులు బిల్ క్లింటన్‌కి చేసిన విజ్ఞప్తిలో హెచ్చరించారు. నాటో ఖాతరు చేయలేదు. తర్వాత 2004–09 మధ్య, బల్గేరియా, రుమేనియా, లాత్వియా, ఇస్తోనియా, స్లొవేనియా, లిథువేనియా, క్రోవేషియానీ నాటో చేర్చుకొంది. ఇదంతా రష్యాపై ఒత్తిడి పెంచడానికి తప్ప, వేరే కారణమే కనిపించదు. మళ్లీ రష్యా మొత్తుకుంది. నాటో ఖాతరు చెయ్యలేదు. 2017–20లలో మాంటెనెగ్రో, నార్త్ మాసిడోనియా దేశాలనీ అది చేర్చుకొంది. ఆ రెండూ కూడా రష్యాకి అతి సమీపంగా ఉన్న దేశాలే. ఇదంతా రష్యా చుట్టూ కమ్ముకురావడమే.

యూరపు దేశాలనిగానీ, అమెరికానిగానీ రష్యా రెచ్చగొట్టిన దాఖలాలేమీ లేవు... నాటో విస్తరణకి నిరసన చెప్పడం తప్ప. అయినా 2021లో మరో అరడజను దేశాలను నాటోలో చేర్చుకోవచ్చన్న వార్తలు వచ్చాయి. అవి— బోస్నియా, హెర్జెగోవ్నా, జార్జియా, ఉక్రెయిన్, ఫిన్లాండు, స్వీడన్, సెర్బియా. ఈ దశలో యూరప్, అమెరికాలకి చెందిన ప్రముఖులు మరోసారి నాటో విస్తరణని తప్పుబట్టారు. ఇక్కడ స్పష్టంగా రష్యా బాధితురాలు. అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సు జర్మనీ లాంటి దేశాలన్నీ అకారణంగా రష్యాని నాశనం చెయ్యాలనుకుంటున్నాయి. బైడన్ అధ్యక్షుడిగా ఉన్నంతవరకూ అమెరికా వైఖరి కొంతవరకు మనకి అర్థమవుతుంది. ప్రపంచంలో తన రౌడీయిజాన్ని అడ్డుకోగలిగిన సైనిక శక్తి ఇప్పటికీ రష్యాకి ఉంది. అందుకే రష్యా అంటే, అమెరికాకు అంతులేని చికాకు. మరి యూరప్ దేశాలకి రష్యా పట్ల అంత ద్వేషం ఎందుకుండాలో మాత్రం మనకి అర్థంకాదు. మొత్తం మీద బైడన్, స్టార్మర్ లాంటివాళ్లు బైటికి చెప్పిన కారణం ఏమంటే, పుతిన్ ఒక నియంత, దుర్మార్గుడు. కాబట్టి అతను పోవాలి. అక్కడికేదో అమెరికాకీ, దాని ఉపగ్రహాలకీ నియంతలంటే ద్వేషం అన్నట్టుగా. రష్యాలో పుతిన్‌ని వ్యతిరేకిస్తున్న ప్రధాన పార్టీ కమ్యూనిస్టు పార్టీ. అమెరికా పాలకుల సాకులను చూస్తే వారు కొంపదీసి రష్యాలో పుతిన్‌ని కూలదోసి కమ్యూనిస్టుల్ని గద్దెనెక్కిస్తారేమో అనిపిస్తుంది.

రష్యా వైపు నుంచి చూద్దాం. 2021 వరకూ రష్యా చుట్టూ నాటో ఎలా కమ్ముకొస్తోందో చూశాం. అంతిమంగా, తాను నాటోకి దాసోహం అనే దాకా దాని విస్తరణ ఆగదు అని రష్యాకి అర్థం కాదా? ఇక ఇప్పుడు కూడా యుద్ధాన్ని వాయిదా వెయ్యడమంటే, భవిష్యత్తులో తాను కాళ్లూ చేతులూ కదపలేని స్థితిలో యుద్ధాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అర్థం కాదా? అందుకే, రష్యా 2022 ఫిబ్రవరిలో యుద్ధభేరి మోగించింది. పుతిన్ స్థానంలో ఎవరున్నా ఈ నిర్ణయం తీసుకోక తప్పదు. యుద్ధం మొదలుకాగానే, విదేశీ బ్యాంకుల్లో ఉన్న రష్యా డబ్బుల్ని స్తంభింపజేశారు. అది మూడు వందల బిలియన్ డాలర్లు. దానిపై వచ్చే వడ్డీని నాటో దేశాలు వాడేసుకుంటున్నాయి. ఇది ఏ రకమైన వాణిజ్య నీతో తెలియదు. అంతులేనన్ని ఆర్థిక ఆంక్షల్ని రష్యాపై వారు రుద్దారు.

ఆనాడు అమెరికా నాయకత్వాన యూరపు దేశాలు ఉక్రెయిన్‌లో పన్నిన కుట్రలన్నీ, ఇప్పుడు ఒక్కొక్కటీ బయట పడుతున్నాయి. అక్కడ 2009లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో యెనుకోవిచ్ గెలిచాడు. అతని మొగ్గు రష్యా వైపు ఉన్నా, విధానాల పరంగా తటస్థ వైఖరి అనుసరించాడు. 2014లో వేలాదిగా ప్రజలు అతని పాలనపై తిరగబడ్డారు. యెనుకోవిచ్ రష్యా పారిపోయాడు. ఆ తర్వాత పరొషెంకో అనే నాటో అనుకూలుడు అధ్యక్షుడయ్యాడు. ఇక్కడే ఒక మతలబు ఉంది. ఆనాటి ఉక్రెయిన్ ప్రజలు వారంతటవారే స్వచ్ఛందంగా తిరగబడలేదని ఇటీవల తెలిసింది. మచ్చుకి... జెఫ్రీ సాక్స్ అనే అమెరికా ఆర్థిక నిపుణుడు సరిగ్గా ఆ సమయానికి ఉక్రెయిన్‌కి ఆర్థిక సలహాదారుగా వచ్చాడు. వేల సంఖ్యలో జనం పోటెత్తిన 'మైదాన్'కి వెళ్లాడు. అమెరికా అధికారులు ఆ తిరుగుబాటుని ఆర్గనైజ్ చేసిన ముఠాలకి డబ్బులు పంచడం స్వయంగా చూశాడు. వారిలో నియో నాజీలు కొల్లలుగా ఉన్నారు. వారే అల్లర్లు సృష్టించి, జనాన్ని విచ్చలవిడిగా చంపారు. అదే ఇటీవల జెఫ్రీ సాక్స్ బయటపెట్టాడు. ఆ సంగతినే అప్పుడు రష్యా మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల ట్రంప్ దూత విట్కాఫ్... రష్యాకి వ్యతిరేకంగా ప్రచారం కోసమూ, రష్యాను రెచ్చగొట్టడానికీ 2014లో, అమెరికా ఐదు బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టింది అంటున్నాడు. పరొషెంకో అధ్యక్షుడయ్యాక ఉక్రెయిన్ తూర్పున డాన్‌బాస్ ప్రాంతంలో జనాన్ని టెర్రరిస్టులు అని ముద్రవేసి ఊచకోత కోశారు. అక్కడ ఎక్కువమంది సోవియట్ కాలంలో ఉక్రెయిన్‌లో స్థిరపడిన రష్యన్లు. 2019లో అధికారానికి వచ్చాక, జెలెన్‌స్కీ కూడా ఆ పనే చేశాడు. అక్కడ రష్యన్ భాషపై ఆంక్షలు పెట్టాడు.


ఉక్రెయిన్ యుద్ధానికి ప్రధాన కారకులు— 1. అమెరికా పాలకులు, 2. మిగతా నాటో దేశాల పాలకులు, 3. ఈ ఇద్దరి దన్ను చూసుకొని రష్యాని రెచ్చగొట్టిన ఉక్రెయిన్ నేతలు. వీరితో రష్యా నేత పుతిన్‌ని చేర్చక తప్పదు అంటే, అతన్ని సగం నేరగానిగానూ, సగం బాధితునిగానూ పరిగణించాలి.

◆ ఎ. గాంధీ
సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్

'సుప్రీం' అంతిమ అస్త్రం ఆర్టికల్ '142'

సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 అనే మూడో కన్నును తరచూ తెరవవలసి వస్తున్నది. ముఖ్యంగా పాలకుల, రాజకీయ నాయకుల స్వార్థ క్రీడ నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం దాని వినియోగించక తప్పడం లేదు. 2024 ఫిబ్రవరిలో చండీగఢ్ మేయర్ ఎన్నిక ఫలితాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఫలితంలో ఓడిపోయినట్టు ప్రకటించిన ఆప్ అభ్యర్థిని మేయర్ పదవికి ఎన్నికైనట్టు నిర్ధారించింది. అప్పుడు సుప్రీంకోర్టు ఇదే రాజ్యాంగ అధికరణను ప్రయోగించింది. మేయర్ ఎన్నికల నిర్వహణాధికారి అయిన బీజేపీ నాయకుడు అనిల్ మాసి తమ పార్టీకి అనుకూల పరిస్థితులు వచ్చేవరకు పోలింగ్ తేదీని వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి కోర్టు జోక్యంతో 2024 జనవరి 30న జరిగిన ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి ఒకవైపు, బీజేపీ అభ్యర్థి మరోవైపు బరిలో మిగిలారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లలో 20 మంది ఆప్ అభ్యర్థికి, 16 మంది బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. కానీ నిర్వహణాధికారి అనిల్ మాసి బీజేపీ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించారు. ఆప్ అభ్యర్థికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ అతనికి పడిన ఓట్లలో ఎనిమిదింటిని చెల్లనివిగా చేసి బీజేపీ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించారు. ఇందుకోసం ఆ ఎనిమిది బ్యాలెట్ పత్రాలను తానే స్వయంగా పాడుచేసి వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించారు. ఆ విధంగా మెజారిటీ ఓటర్ల అభీష్టాన్ని కాలరాశారు. ఈ మోసాన్ని గమనించిన సుప్రీం కోర్టు ఆర్టికల్ 142 ద్వారా తనకు సంక్రమించిన విశేష అధికారాలను వినియోగించి బీజేపీ అభ్యర్థి ఎన్నికను రద్దు చేసింది. ఆప్ అభ్యర్థి గెలిచినట్టు తానే ప్రకటించింది.

తమిళనాడు గవర్నర్ దీర్ఘ కాలంగా తన వద్ద ఉంచుకొని బూజు పట్టించిన బిల్లులకు పచ్చ జెండా ఊపిన తాజా తీర్పును కూడా సుప్రీంకోర్టు 142వ అధికరణ నుంచి తనకు సంక్రమించిన ఎదురులేని అధికారాలతోనే ఇచ్చింది. పెండింగ్‌లోని 10 తమిళనాడు బిల్లులూ ఆమోదం పొందినట్టు తానే ప్రకటించింది. న్యాయమూర్తులు జె.బి.పార్దివాలా, ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ తీర్పును ప్రకటించింది. రాష్ట్రపతిని సైతం నియమబద్ధం చేయడం ఈ తీర్పులోని విశేషం. తిప్పి పంపిన బిల్లులను శాసనసభ మళ్ళీ ఆమోదించి పంపితే చెప్పుకోదగిన మార్పులుంటే తప్ప వాటిపై గవర్నర్ ఆమోద ముద్ర వేసి తీరవలసిందే అని ధర్మాసనం స్పష్టం చేసింది. గవర్నర్లు తన పరిశీలనకు పంపిన బిల్లులను రాష్ట్రపతి మూడు మాసాలకు మించి తన వద్ద ఉంచుకోరాదనీ చెప్పింది. గవర్నర్లు తనకు పంపే బిల్లులను ముఖ్యంగా వాటి రాజ్యాంగబద్ధత మీద వారు ఆందోళన వ్యక్తం చేసినప్పుడు రాష్ట్రపతి వాటిని సుప్రీంకోర్టు అభిప్రాయానికి పంపవచ్చునని మహోన్నత న్యాయ స్థానం సూచించింది.



ప్రభుత్వాలు గాని, సంస్థలు గాని రాజ్యాంగాన్ని కాదని ఇష్టానుసారంగా వ్యవహరించడానికి సాహసించినప్పుడు ఆర్టికల్ 142కి పని చెప్పక తప్పని పరిస్థితి సుప్రీంకోర్టుకు కలుగుతున్నది. అమల్లో గల చట్టాలు మౌనంగా ఉన్నచోట తగిన న్యాయం జరిగేలా చూడ్డానికి ఈ ఆర్టికల్ రూపుదాల్చింది.

రాష్ట్రపతికే గీత గీసిన ఈ తీర్పు సహజంగానే పాలక బీజేపీ అసంతృప్తికి, ఆగ్రహానికి కారణమైంది. ఆర్టికల్ 142 ప్రజాస్వామ్య శక్తుల మీద ప్రయోగానికి సుప్రీంకోర్టు చేతిలో 24 గంటలూ అమరిన అణు క్షిపణి అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ విరుచుకుపడ్డారు. ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం రాష్ట్రపతినే ఆదేశించడమేమిటని హూంకరించారు. తమిళనాడు బిల్లులపై తీర్పు సందర్భంగా, వక్ఫ్ చట్టంలోని కొన్ని అంశాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసి, వాటిని నిలిపివేస్తామని చెప్పిన విషయంలోనూ బీజేపీ నేతలు అసహనాన్ని వెళ్ళగక్కుతున్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల పరిధుల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటున్నదనే నింద దూసుకొచ్చింది.

సుప్రీంకోర్టు తన ముందుకు వచ్చిన కేసులో పరిపూర్ణమైన న్యాయం చేయడం కోసం 142 ఆర్టికల్ దానికి విశేష అధికారాలను కట్టబెట్టింది. అమలులో ఉన్న ఎటువంటి నియమాలను, పద్ధతులనైనా పక్కనబెట్టి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను ఇచ్చింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో సుప్రీంకోర్టు 142 ద్వారా బలంగా కాలు మోపి ఉండకపోతే ప్రజాస్వామ్యానికి ఎంత అన్యాయం జరిగి ఉండేదో! ఆ వ్యవహారంలో బీజేపీ పరీక్షల్లో కాపీ కొట్టి దొరికిపోయిన బడుద్దాయి విద్యార్థిలా వ్యవహరించింది. ప్రజాస్వామ్య మూల స్తంభాన్ని పెరికివేసింది. ఆర్టికల్ 142 సకాలంలో కలుగజేసుకొని దానిని సరిజేసింది.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో ప్రజల తీర్పును అమలు కానీయకుండా సైంధవ పాత్ర పోషిస్తున్నారు. అక్కడి ప్రజల సంస్కృతులను విశ్వాసాలను అవహేళన చేస్తున్నారు. బిల్లులను సంవత్సరాల తరబడి ఆపి ఉంచడం ద్వారా రాజ్‌భవన్ పాలనను నడిపిస్తున్నారు. వాటిని అకారణంగా రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ద్వారా దీర్ఘనిద్రలోకి నెట్టివేస్తున్నారు. ప్రజాస్వామ్యం గురించి దిక్కులు పిక్కటిల్లే స్వరంతో గొంతు చించుకునే కేంద్ర పాలకులు ఉపరాష్ట్రపతిని, తమ ఎంపీలను ప్రజాస్వామ్యం మీదికి ఉసిగొల్పుతున్నారే గాని గవర్నర్లను దారిలో పెట్టడం లేదు. అందుచేతనే సుప్రీంకోర్టు తరచూ 142 కత్తిని ఒరలోంచి తీసి ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసి వస్తున్నది. ఈ ఆర్టికల్‌ను అణు క్షిపణితో పోల్చాడంటే ఉపరాష్ట్రపతి ఎంత ప్రజాస్వామ్య వ్యతిరేకో అర్థం చేసుకోవచ్చు.

ఆర్టికల్ 142 మొదట్లో 118 అధికరణగా అవతరించింది. దీనిని 1949 మే 27న రాజ్యాంగ సభ ఆమోదించింది. వాస్తవానికి ఈ అధికరణను ఆ రోజున రాజ్యాంగ సభలో చర్చకు పెట్టారు. కానీ ఆ సభ దానిపై చర్చ చేపట్టకుండా నేరుగా ఆమోద ముద్ర వేసింది. పరిపూర్ణ న్యాయం చేయడం కోసం సుప్రీంకోర్టుకు ఈ ఆర్టికల్ ద్వారా తిరుగులేని అధికారాలు కట్టబెట్టడం అవసరమేనని భావించి రాజ్యాంగ సభ ఎటువంటి చర్చ చేపట్టకుండా దానిని ఆమోదించిందని స్పష్టపడుతున్నది. అమల్లో గల చట్టాలు మౌనంగా ఉన్నచోట తగిన న్యాయం జరిగేలా చూడ్డానికి ఈ ఆర్టికల్ రూపుదాల్చింది. ప్రత్యేక సందర్భాల్లో ఎటువంటి నియమపాలనతో నిమిత్తం లేకుండా నేరుగా విడాకులు మంజూరు చేసే అధికారాన్ని ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు కట్టబెడుతుంది. ఆ దంపతులను తిరిగి కలిపి ఉంచడం ఎంతమాత్రం సాధ్యం కాని పని అని సుప్రీంకోర్టు సంతృప్తి చెందితే 6–18 నెలల కాలం వేచి చూడవలసిన అవసరం కూడా లేకుండా ఈ అధికరణ కింద నేరుగా విడాకుల ఉత్తర్వులు జారీ చేయవచ్చు. సకాలంలో ఫీజు కట్టలేక ప్రవేశ అర్హత కోల్పోయిన ఒక దళిత విద్యార్థిని ధన్బాద్ ఐఐటీలో చేర్పిస్తూ 2024 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ఆర్టికల్ 142ని ఉపయోగించింది. గతంలో భోపాల్ గ్యాస్ లీకేజీ ఘోర విషాదం కేసు అమలులో గల చట్ట పరిధి దాటి బాధితులకు అధిక పరిహారం చెల్లించేలా యూనియన్ కార్బైడ్ యాజమాన్యాన్ని ఆదేశించడానికి సుప్రీంకోర్టు 142నే ప్రయోగించింది. అయోధ్య వివాదం పరిష్కారంలోనూ, జాతీయ రహదారులకు 500 మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఉండరాదని ఇచ్చిన తీర్పులోనూ, పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి మార్గదర్శకాలు రూపొందించిన సందర్భంలోనూ... ఇంకా అనేక కేసుల్లో ఈ ఆర్టికల్ ఉపయోగపడింది. ప్రభుత్వాలు గాని, సంస్థలు గాని రాజ్యాంగాన్ని కాదని ఇష్టానుసారంగా వ్యవహరించడానికి సాహసించినప్పుడు ఆర్టికల్ 142కి పని చెప్పక తప్పని పరిస్థితి సుప్రీంకోర్టుకు కలుగుతున్నది. అంతేకాదు, రాజ్యాంగ మౌలిక నిర్మాణం సిద్ధాంతం పార్లమెంటు కంటే సుప్రీంకోర్టును ఉన్నతమైనది చేస్తున్నది.

కేశవానంద భారతి, కేరళ ప్రభుత్వం కేసులో 7:6 మెజారిటీ తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగ మౌలికత సిద్ధాంతాన్ని స్థిరపరచింది. కొన్ని రాజ్యాంగ మౌలిక లక్షణాలను రాజ్యాంగ సవరణల ద్వారానైనా మార్చే హక్కు ఉండదని స్పష్టం చేసింది. పార్లమెంటు చేసిన అటువంటి రాజ్యాంగ సవరణలను సుప్రీంకోర్టు రద్దు చేసిన సందర్భాలు ఉన్నాయి. రాజ్యాంగానికి గల సర్వోత్కృష్టత, చట్టబద్ధ పాలన, ఫెడరలిజం, సెక్యులరిజం, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం, ప్రాథమిక హక్కులు వంటివి కొన్ని రాజ్యాంగ మౌలిక లక్షణాల కిందికి వస్తాయి. అందుచేత న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటే గొప్పది, ఆర్టికల్ 142 అక్రమమైనది అనే వాదనలతో ఎంతమంది ధన్‌ఖడ్‌లు గింజుకున్నా ప్రయోజనం ఉండదు. అయితే అధికార పార్టీకి చెందిన ఇటువంటి ఉత్సవ విగ్రహాలు చీటికి మాటికి న్యాయ వ్యవస్థపై దాడికి సమకట్టడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఉల్లంఘనలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి ముప్పునే సూచిస్తున్నాయి.

• గార శ్రీరామమూర్తి

రాజ్యాంగంపై మావోయిస్ట్ అవగాహన స్పష్టమే!

ఏప్రిల్ 15న ఆంధ్రజ్యోతిలో డానీ రాసిన 'పాలకులు— మావోయిస్టులు, మధ్య రాజ్యాంగం' అనే వ్యాసంలోని రెండు విషయాలపై చర్చను పొడిగించాల్సి ఉంది. ఒకటి: మావోయిస్టులు—రాజ్యాంగం, రెండు: మావోయిస్టుల రాజకీయ కార్యక్రమం.

మధ్య భారతదేశంలో జరుగుతున్న అంతర్యుద్ధం ఆగడానికి ప్రభుత్వానికి—మావోయిస్టులకు మధ్య శాంతి చర్చలకు రాజ్యాంగం ప్రాతిపదిక అవుతుందా? అనే ముఖ్యమైన ప్రశ్నను డానీ లేవదీశారు. "పెట్టుబడిదారీ ప్రయోజనాలు నెరవేర్చేందుకు రాజ్యాంగం పుట్టిందని" మావోయిస్టులు విమర్శిస్తుంటారని రాశారు. ఈ మాట సరైనదే. దీనితోపాటు చెప్పుకోవాల్సింది ఇంకా ఉంది. ప్రముఖ పౌరహక్కుల నాయకుడు ప్రొ. శేషయ్య "రాజ్యాంగం అనేక వైరుధ్యాల పుట్ట" అన్నారు. ఈ వ్యవస్థలో చిన్నచిన్న మార్పులు ఎన్ని జరిగినా, మౌలికంగా మారకుండా, దాన్ని యథాతథంగా పట్టి ఉంచేందుకు పాలకవర్గాలకు రాజ్యాంగం సాధనంగా ఉపయోగపడుతుందని విప్లవకారులు విమర్శిస్తారు. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో జరిగిన అనేక పీడిత సమూహాల, వర్గాల పోరాటాల ఫలితంగా రాజ్యాంగంలోకి కొన్ని సానుకూల అంశాలు వచ్చి చేరినా, దానికి ఈ మౌలిక స్వభావం ఉన్నదని చెబుతారు.

రాజ్యాంగంలోని సానుకూల అంశాలు కూడా వాటంతట అవి అమలు కావడం లేదు. ఈ సానుకూల అంశాలను ప్రభుత్వాలు అనుక్షణం బాహాటంగా ఉల్లంఘిస్తున్నాయి. దీనికి తోడు సామాజిక వివక్షల వల్ల కూడా రాజ్యాంగం అమలులోకి రావడం లేదు. అందువల్ల పోరాటాల వల్లనే రాజ్యాంగంలోని సానుకూల విషయాలు ప్రజల అనుభవంలోకి ఎంతో కొంత వస్తున్నాయి. అయినప్పటికీ పౌరహక్కులు, చట్టబద్ధ పాలన, ఆదేశిక సూత్రాలు అనేవి రాజ్యాంగంలో భాగం కావడం చారిత్రకంగా ప్రగతిశీలమైన విషయం. మన సామాజిక, సాంస్కృతిక వికాసంలో, పీడిత సమూహాల రక్షణలో రాజ్యాంగం ఎంతో కొంత సానుకూల పాత్ర పోషిస్తోంది. విప్లవోద్యమానికి ఈ అవగాహన ఆరంభం నుంచీ ఉంది. అందువల్ల విస్తృతస్థాయిలో పౌర ప్రజాస్వామిక హక్కుల కోసం, చట్టబద్ధ పాలన కోసం, పీడిత సమూహాల రక్షణ కోసం పోరాడుతున్నది.

ఈ వైఖరి నుంచే అంతర్గత భద్రత పేరుతో ప్రజల మీద సైన్యాన్ని ప్రయోగించడం రాజ్యాంగ వ్యతిరేకం అని మావోయిస్టులు తమ ప్రకటనలో అన్నారు. రాజ్యాంగంలోని సమానత్వ భావనకు వ్యతిరేకంగా ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి విధానాల వల్ల తలెత్తిన సమస్యలు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సైనిక రంగాల్లో వ్యవస్థీకృతం అయ్యాయి. దోపిడీ, పీడనలను తీవ్రం చేశాయి. దీనికి రాజ్యాంగంలోనే అవకాశాలు ఉన్నాయి. ఈ స్థితిలోంచి విప్లవోద్యమం పుట్టుకొచ్చింది. దాన్ని అణచివేయడానికి ప్రభుత్వం హింసకు పాల్పడుతున్నది కాబట్టి ఇప్పుడు ఇరుపక్షాల మధ్య శాంతి చర్చలు జరగాలంటే మొదట ప్రభుత్వం రాజ్యాంగానికి కట్టుబడి ప్రజల మీద యుద్ధాన్ని ఆపాలి. ఆ పని చేయకుండా మావోయిస్టులు ఆయుధాలు దించితేనే శాంతి చర్చలని ప్రభుత్వం కండీషన్ పెట్టడానికి లేదు. ఆ మాట అనడమంటే తన రాజ్యాంగ ఉల్లంఘనను సమర్థించుకోవడమే. శాంతి చర్చల సంగతి అటుంచి రాజ్యాంగ ఆదర్శాలకే ఈ వైఖరి అతి పెద్ద సవాల్.

ఈ పరిస్థితిలో రాజ్యాంగ పరిధిలోని అంశాలన్నీ శాంతి చర్చలకు ప్రాతిపదిక కావాలి. విప్లవోద్యమ సిద్ధాంతం, వ్యూహం, లక్ష్యం రాజ్యాంగ పరిధిలోని అంశాలు కావు. అయితే తాము తుపాకులు వినియోగిస్తే రాజ్యాంగం ప్రాతిపదికగా జరగాల్సిన శాంతి చర్చలకు ఆటంకం అవుతుందని విప్లవకారులకు తెలుసు. అందుకే వాళ్లు కాల్పుల విరమణకు సిద్ధం అన్నారు. ఈ పని జరగాలంటే ముందు ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడం నేర్చుకోవాలి. తక్షణంగా అంతర్యుద్ధాన్ని ఆపివేయాలి. ఈ స్పష్టత వల్లనే మావోయిస్టుల ప్రకటనలో రెండుసార్లు రాజ్యాంగం ప్రస్తావన వచ్చింది.

విప్లవోద్యమ సిద్ధాంతం, వ్యూహం, లక్ష్యం రాజ్యాంగ పరిధిలోని అంశాలు కావు. అయితే తాము తుపాకులు వినియోగిస్తే రాజ్యాంగం ప్రాతిపదికగా జరగాల్సిన శాంతి చర్చలకు ఆటంకం అవుతుందని విప్లవకారులకు తెలుసు. అందుకే వాళ్లు కాల్పుల విరమణకు సిద్ధం అన్నారు. ఈ పని జరగాలంటే ముందు ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడం నేర్చుకోవాలి. తక్షణంగా అంతర్యుద్ధాన్ని ఆపివేయాలి. ఈ స్పష్టత వల్లనే మావోయిస్టుల ప్రకటనలో రెండుసార్లు రాజ్యాంగం ప్రస్తావన వచ్చింది.



ఇక రెండో అంశం— మావోయిస్టుల రాజకీయ విధానం గురించి. బస్తర్‌లో మావోయిస్టులు ప్రవేశించాక అక్కడ సమసమాజం ఏర్పడిందని ప్రచారం జరుగుతోందని డానీ రాశారు. ఇది పూర్తిగా తప్పు. అంతర్జాతీయ స్థాయిలోనూ, తెలుగులోనూ తటస్థులు, అభిమానులు రాసిన క్షేత్ర పరిశీలనలు, విశ్లేషణలు కనీసం డజన్‌కు పైగా పుస్తకాల్లో కనిపిస్తాయి. వాటిలో డానీ చెప్పిన మాట లేదు. స్వయంగా మావోయిస్టులే దండకారణ్యంలోని ప్రత్యామ్నాయ అభివృద్ధి, ప్రజా పాలన బీజరూపం నుంచి ప్రాథమిక దశకు చేరుకున్నాయని మాత్రమే రాశారు. సమ సమాజమని ఎక్కడా అనలేదు. తొలి రోజుల్లో మైదాన ప్రాంత విప్లవకారులు 'బయటి వాళ్లు'గా అక్కడికి వెళ్లిన మాట నిజమే. ఆ తర్వాత అసంఖ్యాకంగా ఆదివాసులే మావోయిస్టులుగా మారారు. వాళ్లే తమ స్థలకాలాలకు, సంస్కృతికి, జీవితావసరాలకు తగినపద్ధతిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు రాజకీయాలను మార్గదర్శకంగా తీసుకున్నారు. ఇదంతా వర్గపోరాటంలో భాగంగా జరుగుతున్నది. దండకారణ్యంలో వర్గాలు, వర్గపోరాటం మీద మావోయిస్టులు, వాళ్ల అభిమానులు రాసిన రచనలు చదివి ఎంతైనా చర్చించవచ్చు.

బస్తర్‌లో మావోయిస్టులు చేస్తున్న ఈ పనికీ, వాళ్ల ప్రకటిత కార్యక్రమానికీ పొంతన ఉందా? అనే సిద్ధాంత సందేహాన్ని కూడా డానీ లేవదీశారు. విప్లవకారులు 1980లో దండకారణ్యంలోకి తమ ప్రకటిత కార్యక్రమంలో భాగంగానే వెళ్లారు. నూతన ప్రజాస్వామిక విప్లవమంటే భూములు పంచడమే కాదు. అర్ధ భూస్వామ్యానికి, కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే విస్తృత పోరాటం. రాజ్యానికి, సామాజిక అసమానతలకు, అన్ని రకాల పీడనలకు వ్యతిరేకంగా సాగే కొత్త తరహా ప్రజాస్వామిక పోరాటం. ఇప్పుడైతే అది కార్పొరేట్ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పీడిత సమూహాలు, వర్గాల నాయకత్వంలో జరిగే పోరాటం. ఇలాంటి సమగ్ర పోరాట వ్యూహం మావోయిస్టులకు ఉన్నది. అందులో భాగమే దండకారణ్యం తరహా ఆదివాసీ ప్రాంతాల్లో పోరాటాలను, ప్రత్యామ్నాయాలను నిర్మించారు. 'ఆయుధాలతో మాత్రమే ప్రజా వ్యతిరేక వ్యవస్థను నిర్మూలించగలమనేది నక్సలైట్ల సిద్ధాంతం' అని డానీ అన్నారు. సాయుధ పోరాట ప్రాధాన్యతను నొక్కి చెప్పినప్పటికీ ప్రజా చైతన్యంతో, క్రియాశీల ఆచరణతో అనేక పోరాట రూపాలతో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకపోవాలనేది వాళ్ల అవగాహన. గత నలభై ఏళ్ల చరిత్ర ఇదే చెబుతోంది. కాబట్టి ఇందులో ఎలాంటి సిద్ధాంత గందరగోళం లేదు.

ప్రజలపై ప్రభుత్వం అమలు చేస్తున్న హింస రాజకీయార్థిక యుద్ధంగా మారింది. ప్రభుత్వం రాజ్యాంగానికి కట్టుబడి ఉంటే ఈ యుద్ధం ముంచుకొచ్చేదీ కాదు. దానికి కారణమైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సంక్షోభాలూ వచ్చేవి కావు. రాజ్యాంగం ప్రాతిపదిక మీద చర్చలు జరగాలంటే ప్రభుత్వం ముందు ఈ అభివృద్ధి నమూనాను, యుద్ధాన్ని వెనక్కి తీసుకోవాలి. దాని కోసం ప్రజాస్వామిక వాదులు ఒత్తిడి తీసుకురావాలి. మావోయిస్టులు కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించారు కాబట్టి రాజ్యాంగ పరిధిలోని అంశాలన్నిటినీ శాంతి చర్చల్లో భాగంగా కూచొని మాట్లాడుకోవచ్చు.

■ పాణి

బలమైన సందేశం

భారతదేశం తలపెట్టి, ముప్పావు గంటలోనే ముగించిన, సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ అభినందనీయం. రెండు వారాల క్రితం కాశ్మీరులోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై దాడికి తెగబడ్డ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మూలాల్ని అంతం చేసే తలంపుతో తలపెట్టిన ఈ సైనిక చర్య భారత్ శక్తియుక్తులను తెలిపేది. తీవ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు తాజా హెచ్చరిక లాంటిది.

భారతదేశానికి వ్యతిరేకంగా తీవ్రవాదాన్ని ప్రోత్సహించడం పాకిస్థాన్‌కు కొత్త కాదు. 1947 నుంచి ఇప్పటికి నాలుగుసార్లు యుద్ధానికి తెగబడినా, లెక్కకు మిక్కిలిసార్లు భారత్ పైకి ఉగ్రవాదుల్ని ఉసిగొల్పినా భారత్ సంయమనం కోల్పోలేదు. ఆయా యుద్ధాల్లో విజయం సాధించినా, పాకిస్థాన్‌ని కట్టడి చెయ్యడం వరకే పరిమితమైంది. అంతర్జాతీయ నియమాల్ని, నీతిని తప్పి ప్రవర్తించలేదు. పహల్గాంలో జరిగిన దాడి మామూలుది కాదు. కాశ్మీరులో సాధారణ స్థితి నెలకొన్న వేళ, పర్యాటకులపై విరుచుకుపడి 26 మంది ప్రాణాలు తీయడం, అప్పటికప్పుడు జరిగిన ఉగ్రవాద చర్య మాత్రమే కాదు. దేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడి. తద్వారా అటు స్థానిక, దేశీయ ఆర్థికంపై తక్షణ దాడి చెయ్యడమే కాకుండా, మారిన ప్రపంచ వాణిజ్య చిత్రం నేపథ్యంలో భారత్ వైపు చూస్తున్న పరిశ్రమలు రాకుండా చెయ్యడం, సురక్షితం కాదని నిరూపించి భారత్ ఎదుగుదలకి అడ్డం పడడం ఆ ఉగ్రవాదులకు, వెనుక నుంచి నడిపిస్తున్న పాకిస్థాన్‌కున్న ఏకైక వ్యూహం. అందుకే ఈసారి భారత్ గట్టిగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది.

1971 తర్వాత తొలిసారిగా మూడు సైనిక దళాలు కలిసి నిర్వహించిన ఆపరేషన్ ఇది. పాకిస్థాన్‌లో, పాక్ ఆక్రమిత కాశ్మీరులో తొమ్మిది చోట్ల ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపు దాడి చేసి గంటలోపే పదుల సంఖ్యలో ఆ ముష్కరుల్ని మట్టుబెట్టాయి. వారి స్థావరాలను, పరికరాలని ధ్వంసం చేసి విజయవంతంగా తిరిగి వచ్చాయి. టార్గెట్ ఛేదించడం, పౌరులకు నష్టం కలిగించక పోవడం భారత్ నీతికి, సామర్థ్యానికి నిదర్శనం. అందుకనే ప్రపంచ దేశాలు కూడా మద్దతుగా ఉన్నాయి. పాకిస్థాన్ సైనిక, పౌర పాలకులు ఇకనైనా తమ తీరు మార్చుకోకపోతే, మరింత తీవ్ర పరిణామాలు చూడాల్సి వస్తుందన్న హెచ్చరిక ఈ సైనిక చర్యలో ఉంది. ఆ సందేశం అర్థం చేసుకుని ఉగ్రవాదుల్ని వదులుకోవడమా, లేదా భారత్‌తో తలపడి సర్వనాశనాన్ని కొనితెచ్చుకోవడమా అన్నది ఆ దేశపు విజ్ఞతపై ఆధారపడి ఉంది.

— డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ



● తీరంలో పోలీస్ నిఘా

పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైనికులు దాడులు జరిపిన నేపథ్యంలో కృష్ణాజిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉగ్రవాదుల అక్రమ చొరబాట్లను నియంత్రించేందుకు ఎస్పీ గంగాధరరావు ఆధ్వర్యంలో మచిలీపట్నం తీరంలో బుధవారం పోలీస్ నిఘా పెంచారు.



● జైహింద్





దాయాది పాక్ ఉగ్రస్థావరాలపై భారత్ సైనికుల 'ఆపరేషన్ సిందూర్' విజయం నేపథ్యంలో బుధవారం జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. జాతీయ జెండాలు చేతబూని, జైహింద్.. నినాదాలతో పౌరులు వేడుకలు చేసుకున్నారు. భారత సైన్యానికి జేజేలు పలికారు.

సైనికులకు మద్దతుగా నందిగామలో జాతీయ జెండా ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు (ఇన్‌సెట్‌లో) బీఆర్‌టీఎస్ రోడ్డులో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

నేడు కరెంట్ కట్

- నగరంలోని దాదాపు 90 శాతం ప్రాంతాల్లో బంద్
- గుణదల విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగానే..

మొగల్రాజపురం, మే 7 (ఆంధ్రజ్యోతి) : గుణదల 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో సాంకేతిక మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈఏపీఎం ఎం.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. గుణదల ఉపకేంద్రం పరిధిలోని సబ్‌స్టేషన్ల ఏరియాల్లో.. వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ నుంచి ఏలూరురోడ్డు, బస్టాండ్ నుంచి బందరు రోడ్డు, సిరీస్ కంపెనీ వరకూ నగరంలోని దాదాపు 90 శాతం ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. అత్యవసరం అనుకుంటే ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

గ్యారేజీల్లో డొల్లతనం!

తనిఖీలకు నోచుకోని ఆర్టీసీ బస్సులు

షెడ్యూల్స్ 1, 2, 3, 4, 5 అమలులో తీవ్ర నిర్లక్ష్యం



ఆర్టీసీ బస్సు నుంచి వెలువడుతున్న పొగ

- డిపోల్లో వేధిస్తున్న స్పేర్ పార్ట్స్ కొరత!
- మొక్కుబడిగా సీఎంఈ చెకింగ్
- కండీషన్‌లో లేని బస్సులతో ప్రయాణికుల అవస్థలు

ఆర్టీసీ ఎన్టీఆర్, కృష్ణా రీజియన్ల పరిధిలోని గ్యారేజీల పనితీరుపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్సుల కండీషన్‌ను మెరుగుపర్చేందుకు అమలు చేయాల్సిన షెడ్యూల్స్ 1, 2, 3, 4, 5ను ఉద్యోగులు గాలికి వదిలేస్తున్నారు. దీంతో తనిఖీలకు నోచుకోని బస్సులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మొరాయిస్తున్నాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, బ్యాటరీలు పనిచేయకపోవటం, ప్రమాదాలకు గురికావటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి జిల్లాలో విజయవాడ, జగ్గయ్యపేట, తిరువూరు, ఇబ్రహీంపట్నం, గవర్నర్ పేట-1, గవర్నర్‌పేట-2, విద్యాధరపురం, ఆటోనగర్, గన్నవరం, ఉయ్యూరు, గుడివాడ, అవనిగడ్డ, మచిలీపట్నం బస్ డిపోల పరిధిలోని గ్యారేజీ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్యారేజీ నుంచి రోడ్డు మీదకు వెళ్లి తిరిగి గ్యారేజీలకు వచ్చిన బస్సులను పరీక్షించటానికి ఐదు షెడ్యూల్స్‌ను గ్యారేజీ విభాగం నిర్వహించాల్సి ఉంటుంది. షెడ్యూల్ - 1, 2, 3, 4, 5 అనేవి క్రమం తప్పకుండా నిర్వహిస్తేనే ఆ బస్సు కండీషన్ బాగుంటుంది. బయట ఎక్కడ పడితే అక్కడ ఆగిపోవటం, మొరాయించటం, అంతర్గత ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్స్, బ్యాటరీలు దిగిపోవటం వంటివి జరగవు. కానీ ఇప్పుడు ఆర్టీసీ బస్సులను చూస్తుంటే ఎక్కడ ఆగిపోతాయో ఎవరికీ తెలియదు. దూరప్రాంతాలకు వెళ్లే హై ఎండ్ బస్సులైన సూపర్ లగ్జరీ, ఇంద్ర, అమరావతి, వెన్నెల, స్లీపర్ వంటి బస్సులు కూడా ఆగిపోతుండటం, మొరాయించటం చూస్తే షెడ్యూల్స్ మాల్‌ప్రాక్టీస్ ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

ఐదు షెడ్యూల్స్ అమలు ఇలా..

● గ్యారేజీల్లో ఐదు షెడ్యూల్స్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలి.

షెడ్యూల్-1 : బస్సు గ్యారేజీ నుంచి బయటకు వెళ్లి తిరిగి గ్యారేజీకి వచ్చిన వెంటనే దానిని పిట్ మీదకు ఎక్కించి ప్రతి మిగతా 6లో..

దారి తప్పింది..!

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో మారిన అలైన్‌మెంట్

వైసీపీ హయాంలో వెంకటపాలెంలో జరిగిన తప్పిదం

- ● ఎన్-6లో అలైన్‌మెంట్ మారడం వల్ల రూ.100 కోట్ల భారం
- ● ఏడు కిలోమీటర్ల మేర భూగర్భ పైల్స్, పిల్లర్ల పనులు
- ● ఆ తర్వాత తెలుసుకుని యథాతథ స్థితికి మళ్లీ మార్పు
- ● కూటమి ప్రభుత్వంపై అదనపు భారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4లో 7 కిలో మీటర్ల మేర అలైన్‌మెంట్ మారటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై రూ.100 కోట్ల మేర భారం పడింది. ఎన్-6 మార్గంలో వెళ్లాల్సిన అలైన్‌మెంట్ కాస్త ఎగువకు వెళ్లడంతో ఈ నష్టం జరిగింది. ఏడు కిలోమీటర్ల మేర 15 శాతం పనులు చేశాక మళ్లీ ఎన్-6 మార్గంలో రోడ్డును అభివృద్ధి చేశారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అలైన్‌మెంట్ మార్చినందుకు కూటమి ప్రభుత్వంపై రూ.100 కోట్ల భారం పడే పరిస్థితి ఏర్పడింది.

తప్పు జరిగింది ఇలా..

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4లో ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి ఎన్-6 రోడ్డు మీదుగానే అలైన్‌మెంట్‌ను నిర్దేశించారు. దాదాపు మిగతా 6లో..



వెంకటపాలెం వద్ద వెస్ట్ బైపాస్ పరిస్థితి ఇది. పసుపు రంగు గీత మారిన అలైన్‌మెంట్, ఎరుపు రంగు గీత అసలు అలైన్‌మెంట్ (ఇన్‌సెట్‌లో) మధ్యలోనే వదిలేసిన పిల్లర్లు

ఆర్టీసీ ఎండీ చెంతకు.. లీజు పంచాయితీ!

- అధికారులను పిలిపించి వివరణ కోరిన ఎండీ
- పీఎన్‌బీఎస్ ల్యాండ్ లీజుపై గందరగోళం
- స్థలం కొలిచి ఇవ్వకపోవటంతో సమస్య
- పోటీ నుంచి తప్పుకున్న ఎల్-1 సంస్థ
- టెండర్లు రద్దు చేస్తే అసలుకే మోసం

6లో

11 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్

● మంత్రి వాసంశెట్టి సుభాష్

గేటు పడితే అంతే..!

గుణదల రైల్వేగేట్ వద్ద వాహనదారుల అవస్థలు

- దారి చిన్నది.. పైగా వరుస రైళ్ల రాకపోకలు
- గేటు పడటంతో గంటలకొద్దీ నిలిచిపోతున్న ట్రాఫిక్
- గుణదల ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని మరిచారు
- ఆర్వోబీ కూడా లేకపోవడంతో నిత్య నరకమే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుణదల మినీ ఫ్లై ఓవర్ విషయంలో రైల్వేశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల నున్న-గుణదలకు రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కొత్త వంతెన దగ్గర వాహనదారులకు నరకం కనిపిస్తోంది. గేటు పడితే కిలోమీటరు దూరాన ట్రాఫిక్ ఆగిపోతోంది. మెయిన్ లైన్‌లో వందేభారత్ రైళ్లకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో సొంత ఖర్చుతో ఆర్వోబీలు నిర్మిస్తున్న రైల్వేశాఖ అధికారులు బ్రాంచ్ లైన్లకు వచ్చేసరికి నిర్లక్ష్యం చూపుతున్నారు. గుణదల వద్ద రైల్వే బ్రాంచ్ లైన్ ఉండటంతో ఈ మార్గంలో అధిక సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. ఫలితంగా గేట్లు ఎక్కువ సేపు పడుతుంటాయి. దీంతో కొత్త వంతెనపై రాకపోకలు సాగించే వారికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పైగా రెండు, మూడు రైళ్లు ఒకదాని తర్వాత ఒకటి వస్తుండటంతో అరగంటకు పైగా గేట్లు వేసే ఉంచుతున్నారు. ఇటీవల ఈ మార్గంలో ఓ రైలు ఆగిపోయింది. గేటు దాటిన తర్వాత మిగతా 6లో..





కృష్ణా తీరాన డబుల్ ధమాకా!

» వీకెండ్స్‌లో పర్యాటకులకు వినోదం.. ఉల్లాసం
» బోధిసిరి క్రూయిజర్ వేదికగా ప్రత్యేక ప్యాకేజీ
» ఆటా.. పాటా, మ్యూజిక్.. మ్యాజిక్, మస్తు మజా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వారాంతాల్లో.. సాయం సంధ్య వేళ.. బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్‌పై కృష్ణాతీరంలో ఆనందంగా గడిపేందుకు సరికొత్త టూర్ ప్యాకేజీకి రంగం సిద్ధమౌతోంది. త్వరలో టూర్ ప్యాకేజీ అమలుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉన్నతాధికారులు సన్నద్ధమౌతున్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఏపీటీడీసీ ఎండీ ఆమరపాలి, చైర్మన్ నూకసాని బాలాజీల ఆదేశాల మేరకు ఈడీ పద్మావతి నేతృత్వంలో సరికొత్త ఆలోచనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా రాజధాని చెంతనే ఉన్న కృష్ణానది కేంద్రంగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. 'క్రూయిజ్ ఫన్' రూపంలో విజయవాడ డివిజన్ అధికారులు ప్యాకేజీకి రూపకల్పన చేస్తున్నారు. బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ వేదికగా ఫన్ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. బోధిసిరిపై భాగంలో ఓపెన్ స్టేజీపై మ్యూజికల్‌నైట్, డ్యాన్సులు, మ్యాజిక్ షోలతో పాటు అనేక ఫన్ గేమ్స్‌ను చేర్చనున్నారు. యాంకర్లతో ఫన్ ఈవెంట్ నిర్వహిస్తారు. సాయంత్రం మంచి స్నాక్స్‌తో పాటు అరకు కాఫీని పర్యాటకులకు అందించేందుకు ప్లాన్ చేశారు. ప్యాకేజీ ధర ఒకరికి రూ.250 నుంచి రూ.300 ఉంటుంది.



హరిత బెర్మ్‌పార్క్ వద్ద బోటింగ్ పాయింట్‌లో 'ఫన్ క్రూయిజ్' టిక్కెట్ తీసుకుంటే బోధిసిరిలోకి ఎక్కవచ్చు. సుమారు రెండు గంటల పాటు నదీ విహారం ఉంటుంది. భవానీఘాట్ నుంచి ప్రారంభమయ్యే క్రూయిజర్ ప్రకాశం బ్యారేజీ, భవానీ ఐల్యాండ్ వెంబడి సాగుతూ ఎగువకు వెళ్లి మళ్లీ తిరిగి భవానీ ఐలాండ్ ఘాట్‌కు వస్తుంది. సుమారు గంట నుంచి రెండు గంటల పాటు క్రూయిజర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

సోషల్ మీడియాలో కాదు..
నేరుగానే బదులిస్తా!

» ఎంపీ కేశినేని శివనాథ్



నందిగామ, మే 7(ఆంధ్రజ్యోతి) : అజ్ఞాతంలో ఉండి సోషల్‌మీడియాలో విమర్శలు చేయడం తనకు రాదని, నేరుగానే మాట్లాడతానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుధవారం నందిగామలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ, భారత సైన్యం వీరోచిత పోరాటం చేస్తున్న వేళ తాను ఎవరినీ విమర్శించనని, తనపై కామెంట్లు చేసేవారికి త్వరలోనే సరైన సమాధానం చెబుతానన్నారు. పాకిస్తాన్‌పై పోరాడుతున్న వేళ భారత సైన్యానికి ప్రజలంతా ఐక్యంగా మద్దతు తెలపాలన్నారు. దేశభద్రత కోసం ప్రధాని మోదీ తీసుకొనే ఏ నిర్ణయానికైనా ప్రజలు అండగా ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణం నెలకొన్న తరువాత అందరి జాతకాలు ఆవిష్కరిస్తానని చెప్పారు.

సీసీఎస్ ఆఫీస్ తరలిస్తే
రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

» ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరిక

బస్‌స్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌ఆర్టీసీ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) కార్యాలయాన్ని తరలించాలని చూస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు హెచ్చరించారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్యలు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన సమయంలో సీసీఎస్ కార్యాలయం ఆర్టీసీ హౌస్‌లోనే ఉద్యోగులకు అందుబాటులో ఉండేవిధంగా కేటాయించారన్నారు. ప్రస్తుత పాలక మండలిలో ఉన్న కొత్త నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్టీసీ హౌస్ నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఒక అపార్టుమెంట్‌లో 6వ ఫ్లోర్‌ను కొనుగోలు చేసి అక్కడ ఆఫీసును ఏర్పాటు చేస్తున్నారనే సమాచారం ఉందన్నారు. పాలకమండలి సమావేశంలో రిజిస్ట్రేషన్ చేసినట్లుగా వెల్లడించారన్నారు. ఆఫీసును తరలించినట్లయితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు సీసీఎస్ ఆఫీసుకు ఉద్యోగుల నుంచి ఎ ఒక్క రూపాయి కూడా వ్యయం కాలేదని ఇప్పుడు కొత్త ఆఫీసులో విద్యుత్ బిల్లుల ఛార్జీలు, కార్యాయలయం నిర్వహణ, తదితరాలకు నెలకు రూ.2లక్షలు వ్యయం అవుతుందన్నారు. ఆర్టీసీ కార్మికుల సొమ్ము దుర్వినియోగం చేసే హక్కు పాలకమండలికి లేదన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం.. వ్యక్తిపై కేసు

విద్యాధరపురం, మే 7 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై బుధవారం భవానీపురం స్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపూడికి చెందిన కంగొట్ల హిమదుర్గ స్నేహితుడు బొర్రా గోపినాథ్ 2024 సెప్టెంబరు నెలలో ఆమె ఇంటికి వెళ్లి ఎన్‌టీటీపీఎస్‌లో తాత్కాలిక ఉద్యోగాలు ఇప్పిస్తానని, రూ.50 వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. హిమదుర్గ అతనికి రూ.50వేలు ఇచ్చింది. గోపినాథ్ ఏపీ జెన్‌కో పేరు మీద ఐడీ కార్డు, ఆర్డర్ తయారు చేసి ఆమెకు ఇచ్చారు. ఆ సమయంలో వర్క్ ఫ్రం హోం చేయమని చెప్పాడు. రెండునెలల జీతం ఆమెకు బ్యాంకు ఖాతాలో పడింది. ఆ తరువాత ఉద్యోగం పర్మినెంట్ చేస్తానని చెప్పి ఆమె వద్ద రూ.2లక్షలు తీసుకున్నాడు. అతడి మాటలు నమ్మి సుమారు 80 మందిని అతనికి పరిచయం చేసింది. గోపినాథ్ రూ.80లక్షలు తీసుకుని వారికి ఏపీ జెన్‌కో అప్పాయింట్‌మెంట్ కాపీలు ఇచ్చాడు. ఆ తరువాత జనవరిలో భవానీపురం హెచ్‌బి కాలనీలో ఎన్‌డిహెచ్‌ఆర్ ప్రాజెక్టు పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించాడు. ఆ ప్రాజెక్టు ఎండీగా బొర్రా గోపినాథ్, డైరెక్టర్లుగా ధర్మతేజ, హిమదుర్గను నియమించాడు. ఆ తరువాత సుమారు 40 మంది దగ్గర ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2వేలు తీసుకుని వారికి హిమదుర్గ సంతకం చేసిన అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చాడు. ఉద్యోగంలో చేర్చుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసి కనిపించకుండా తిరుగుతున్నాడని, బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు బొర్రా గోపినాథ్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండ్లి కుమారుడిగా
లక్ష్మీనారసింహుడు

» వైభవంగా వేదాద్రి లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు



జగ్గయ్యపేట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల్లో పంచ నారసింహ క్షేత్రంగా పేరొందిన వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తిరుక్కల్యాణ బ్రహ్మోత్సవాలకు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు వేదాంతం వంశీకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబు, వంశపారంపర్య ధర్మకర్త తరఫున సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాలను బాలాత్రిపుర సుందరీ ట్రస్ట్, కేసీపీ సంస్థ సమన్వయంతో నిర్వహిస్తున్నారు. వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ స్వీయ పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో సురేష్‌బాబు తెలిపారు. కళ్యాణోత్సవాల్లో గురువారం అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, శుక్రవారం శేషవాహన సేవ, శనివారం హనుమంతు సేవ, ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవారికల్యాణోత్సవం నిర్వహిస్తారు. 12న గరుడోత్సవం, చక్రతీర్థం, పూర్ణాహుతి, ధ్వజారోహణ, 13, 14న పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయని ఈవో తెలిపారు.



ఐనంపూడిలో పరిశ్రమలశాఖకు భూముల బదాలయింపులో పాల్గొన్న మంత్రులు సుభాష్, రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల, జేసీ

11 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసం శెట్టి సుభాష్
» ఐనంపూడిలో శంకుస్థాపన

పామర్రు, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగా కృష్ణా జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని ఐనంపూడి వద్ద 11 ఎకరాల ప్రభుత్వ భూమిలో నూతనంగా నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమానికి బుధవారం మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, రూ.11.2 కోట్ల నిధులతో నిర్మితమయ్యే ఎంఎస్ఎంఈ పార్క్‌కు తన చేతుల మీదుగా శ్రీకారం చుట్టడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమల స్థాపనకు నిధులు కేటాయించామన్నారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, ఉద్యోగాలిచ్చే స్థాయికి యువతను తీర్చిదిద్దే విజన్‌లో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పారిశ్రామిక రంగం పురోభివృద్ధికి అడుగులు పడ్డాయన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ, జిల్లాలోనే తొలిసారిగా పామర్రు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమల హబ్‌ను ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. జేసీ గీతాంజలిశర్మ, సర్పంచ్ బట్టు పరంజ్యోతి, ఎపీఐఐసీ జోనల్ మేనేజర్ పి.బాబ్జి తహసీల్దార్ జి.రవికాంత్, ఎంపీడీవో కె.జ్యోతి, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండలాధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఐనంపూడి మాజీ సర్పంచ్ బొప్పన భరత్, మృదుల కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాస్ పాల్గొన్నారు.

గేటు పడితే అంతే..!

(5వ పేజీ తరువాయి)

ఆగాల్సిన రైళ్లు గేటు వద్ద ఉండగానే ఆగిపోయింది. దీంతో అవి కదిలే వరకు వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. ఫలితంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏలూరు రోడ్డు వరకు వాహనాలు ఆగిపోయాయి. అన్నిరోజుల్లో ఉదయం, సాయంత్రం ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

గుణదల ఫ్లై ఓవర్‌ను పట్టించుకునే వారేరీ?

వ్యక్తిగత పనులు, ఉద్యోగాలు, చిరు వ్యాపారాల కోసం నున్న నుంచి నగరానికి ఎక్కువమంది వస్తుంటారు. వీరందరికీ ఇది దగ్గరి దారి. దీంతో ఇక్కడి రోడ్లు నిత్యం కళకళలాడుతూ ఉంటాయి. ట్రాఫిక్ కూడా అలాగే ఉంటుంది. ఈ బాధలు పోవడానికి దశాబ్దంన్నర కిందట గుణదల మినీ ఫ్లై ఓవర్‌కు శ్రీకారం చుట్టారు. కానీ, అప్పట్లో ఓ ప్రజాప్రతినిధి డిజైన్ మార్చడం వల్ల తనకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. ఆ తర్వాత గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులు ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అంచనాలు వేసి, భూసేకరణ జరిపిన తర్వాత ఎన్నికలు రావడంతో బంతి రైల్వేకోర్టులోకి వెళ్లింది. రైల్వే అధికారులు దీనిని పట్టించుకోలేదు. ఇప్పటికీ ఆ ఫ్లైఓవర్ మొండిగోడలతో కనిపిస్తోంది. పైగా ప్రస్తుతమున్న అంతర్గత మార్గం ఇరుకు. దీంతో ఎదురెదురు వాహనాలను తప్పించుకుంటూ ముందుకెళ్లడం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. వాహనాలు ముందుకు కదల్లేక ట్రాక్‌పై ఆగిపోయిన పరిస్థితి కూడా ఉంది. ఇటీవల కలెక్టర్, కమిషనర్, ఎంపీ స్థాయిలో రైల్వే అధికారులతో జరిగిన సమావేశంలో కూడా గుణదల మినీ ఫ్లై ఓవర్‌కు సంబంధించి త్వరగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ అయినా పట్టించుకునే నాథుడు లేడు.

గిరిజన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు అవార్డుల ప్రదానంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

మచిలీపట్నం/వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. తుమ్మలపల్లిక్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ, గిరిజన, గురుకులాలు వసతి గృహాల విద్యార్థులు పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందచేత బుధవారం జరిగింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి మంత్రి బాల వీరాంజనేయస్వామి విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సాంఘిక సంక్షేమ గిరిజన గురుకులాలు, వసతి గృహాలు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించటం ఇదే తొలిసారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా



విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ ఫలితాలు రావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. పేద విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. సంధ్యారాణి మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు వర్ధంతి రోజున గిరిజన విద్యార్థులకు అవార్డులివ్వటం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 315 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, 34 మంది మెరిట్ విద్యార్థులు నగదు పురస్కారాలు అందజేసినట్టు తెలిపారు. మొదటి బహుమతి రూ.20వేలు, 2వ బహుమతి రూ.15వేలు, 3వ బహుమతి రూ.10వేలు నగదు రూపంలో అందించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన ఫలితాలు, గణాంకాలను ఆమె వివరించారు. అనంతరం 36 మంది ఉద్యోగులు, టీచర్లను సత్కరించారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శి ఎన్.ఎం.నాయక్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయాలు భవిష్యత్తుతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. సాంఘిక సంక్షేమ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్, డైరెక్టర్ లావణ్య వేణి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి జి.గౌతమి, డైరెక్టర్ ఎస్.భార్గవి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, వార్డెన్లు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్‌బోర్డులకు దరఖాస్తులు

» నోటిఫికేషన్ విడుదల చేసిన కమిషనర్

ఇంద్రకీలాద్రి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని పలు దేవాలయాలకు ట్రస్ట్‌బోర్డుల నియామకానికి దేవదాయశాఖ కమిషనర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీ చారిటబుల్, హిందూ రెలిజియస్ సంస్థలు, ఎండోమెంట్స్ యాక్ట్ 30/87లోని సెక్షన్ 15 ప్రకారం బోర్డుల నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసినట్టు తెలిపారు. నోటిఫికేషన్ అందిన 20 రోజుల్లో ఆసక్తి గల వ్యక్తులు ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా నియామకానికి నిర్ణీత దరఖాస్తు, ఫారం-11లో ఎన్టీఆర్ జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌కు అందజేయాలని కమిషనర్ కె.రామచంద్రమోహన్ (ఎఫ్ఏసి) తెలిపారు. ట్రస్ట్‌బోర్డుల నియామకానికి నోటిఫికేషన్ వెలువరించిన ఆలయాలు, సత్రాలు, చారిటీస్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

జగ్గయ్యపేట చంద్రమౌళీశ్వరస్వామి, వరదరాజస్వామి, సీతారామస్వామి, రంగనాయక స్వామి (స్పెసిఫిక్), శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు, విజయవాడ రూరల్, నున్నలోని కాశీ విశ్వేశ్వర స్వామి, సూరాయపాలెంలోని వీరాంజనేయస్వామి, కొత్తూరు తాడేపల్లిలోని పాండురంగ విఠలేశ్వర, భవానీ శంకరస్వామి ఆలయాలు, నందిగామ మండలంలోని మాగల్లులోగల మదనగోపాల స్వామి, లింగాలపాడులోని లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారు, నందిగామలోని సీతారామాంజనేయస్వామి, దామలూరులోని సంగమేశ్వరస్వామి, తిరువూరు మండలం, పాత తిరువూరులో గల వెంకటాచల స్వామి, రామలింగేశ్వరస్వామి, విస్సన్నపేటలోని చంద్రశేఖరస్వామి ఆలయాలు, జి.కొండూరు మండలం వెలగలేరులో వేణుగోపాల, ఆంజనేయస్వామి ఆలయాలు, మైలవరం మండలంలోని చంద్రగూడెంలో తిరుపతమ్మవారి, విజయవాడ గవర్నరుపేటలో గల కాంచనపల్లి కనకాంబ ట్రస్ట్ ఆలయం, కాజ సుబ్బారావు, మాణిక్యాంబ ధర్మసత్రం, హనుమాన్‌పేటలోని గుంటూరు సీతారామ అన్నసత్రం, గవర్నరుపేటలోని ఎదురుపర్తి వెంకటరత్న చారిటీస్, గాంధీనగర్‌లోని గుండా సుబ్బారాయుడు ముత్యమాంబ అన్నసత్రం, గవర్నరుపేటలోని వెంకట జానకిరామ సత్రం, సత్యనారాయణపురంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, కృష్ణలంకలోని కోదండ రామాలయం, పటమటలంకలోని అవధూత తపోవనం ఆలయం, వన్‌టౌన్‌లోని శేషయ్య వీధిలో గల నిడుముక్కల రంగవల్లి, తాయారమ్మ చారిటీస్, వన్‌టౌన్‌లో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి (పాత శివాలయం) విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, సీతమ్మవారి పాదాలు వద్ద ప్రత్యేక శనైచ్చర స్వామి ఆలయం, సామారంగం చౌక్‌లోని చల్లంరాజు వెంకట శేషయ్య సత్రం, గరినే సత్యనారాయణ సత్రం, బ్రాహ్మణవీధిలో వసంత మల్లికార్జున స్వామి ఆలయం, ఎండూరి సుబ్బారావు వైశ్య హాస్టల్‌లకు నోటిఫికేషన్ ఇచ్చారు.

దారి తప్పింది!

(5వ పేజీ తరువాయి)

7 కిలోమీటర్ల మేర ఈ మార్పు జరిగింది. 7 వేల మీటర్ల పొడవు, 70 మీటర్ల వెడల్పు అంటే.. 130 ఎకరాల ప్రభుత్వ భూమిలో పనులు చేపట్టారు. ఏకంగా 7 కిలోమీటర్ల పాటు అలైన్‌మెంట్ మారినా ఎవరికీ తెలియలేదు. ఎందుకంటే.. రాజధాని కోసం ఈ ప్రాంతంలో రైతులు అంతకు ముందు టీడీపీ ప్రభుత్వానికి భూములిచ్చి ఉన్నారు. అలైన్‌మెంట్ మారిన భూమి కూడా భూసమీకరణలోనే ఉంది. దీంతో ఎవరికీ తెలియలేదు. అయితే, ఈ మారిన అలైన్‌మెంట్ ఎన్-6 మార్గంలో కాకుండా కాస్త ఎగువన ఎందుకు చూపించారన్నది అర్థంకాని విషయంగా ఉంది. అలైన్‌మెంట్‌ను నిర్దేశించే విషయంలో ఎన్‌హెచ్ అధికారులు అక్షాంశ, రేఖాంశాలను గుర్తించలేకపోయారని తెలుస్తోంది. విద్యుత్ శాఖ టవర్ల కోసం వేసిన పెగ్ మార్కింగ్‌ను బేస్ చేసుకోవడం వల్లే అలైన్‌మెంట్ తప్పిందనే విమర్శలు వస్తున్నాయి. దీంతో 7 కిలోమీటర్ల పరిధిలో ఈ-11, ఎన్-6 జంక్షన్లలో ఆర్వోబీల కోసం పనులు పిల్లర్ల వరకూ వెళ్లాయి. నాలుగు కిలోమీటర్ల మేర డ్రెయిన్ల నిర్మాణ పనులు కూడా చేపట్టారు. ఈ పనుల విలువ దాదాపు రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. అయితే, ఈ తప్పిదాన్ని ఎన్‌హెచ్ అధికారులు నాటి వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. తిరిగి ఎన్-6 రోడ్డులోనే పనులు చేసుకోవాలని నాటి ప్రభుత్వం నిర్దేశించటంతో మళ్లీ ఆ మార్గంలో పనులు చేపట్టారు. అమరావతిలోని వెంకటపాలెంలో కృష్ణానది బ్రిడ్జికి అనుసంధానంగా సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి తిరిగి కొత్తగా పనులు చేపట్టాల్సి వచ్చింది. అప్పటికే చేసిన పనికి జరిగిన నష్టాన్ని తామే చెల్లిస్తామని నాటి వైసీపీ ప్రభుత్వం అంగీకరించిందని జాతీయ రహదారుల సంస్థ అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ఈ భారం పడనుంది. అయితే, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సన్నిహిత సంబంధాలు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షం కావటంతో రూ.100 కోట్ల భారానికి మినహాయింపు ఇవ్వాల్సిందిగా కోరే అవకాశం ఉంది.

ఉపగ్రహ ఛాయాచిత్రాల్లో స్పష్టత

క్షేత్రస్థాయిలో అలైన్‌మెంట్ మారిన విషయం వెంకటపాలెం వాసులకు మినహా ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. అలైన్‌మెంట్ ఏ విధంగా మారిందన్నది ఉపగ్రహ ఛాయాచిత్రాల్లో స్పష్టంగా తెలుస్తోంది. 2021లో అలైన్‌మెంట్ మారగా, 2023, మే 23 నాటికి అసలు అలైన్‌మెంట్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం రాజధాని పనుల నేపథ్యంలో భూములను చదును చేస్తున్నారు. ఆర్వోబీలు, అండర్ పాస్‌లకు వేసిన పిల్లర్లను పెకిలిస్తున్నారు. ఈ పిల్లర్లు ఉన్నచోట నీరుకొండ రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ కోసం భూమిలో వేసిన పైల్స్‌తో సహా తొలగిస్తుండటంతో విషయం బయటకు వచ్చింది.

డొల్లతనం!

(5వ పేజీ తరువాయి)

అంశాన్ని చెక్ చేసి ఏమైనా సమస్యలు గుర్తిస్తే వాటిని సరిచేయాల్సి ఉంటుంది.

షెడ్యూల్-2 : ప్రతి వారం బస్సుల ఎయిర్ క్లీనర్ చెక్ చేసి మార్చాలి. ఆయిల్స్ చెక్ చేసి కొరత ఉంటే నింపాలి. గ్రీజు పెట్టాలి. వీటితో పాటు షెడ్యూల్ - 3లో చేసే పనులు కూడా చేయాల్సి ఉంటుంది.

షెడ్యూల్ - 3 : ప్రతి 3 నెలలకు లేదా 20 వేల కిలోమీటర్లు తిరిగిన ప్రతి బస్సును కూడా పూర్తిగా తనిఖీ చేయాలి. ఇంజిన్‌ను పరీక్షించాలి. ఇంజిన్ వాల్వ్స్ పనితీరును గుర్తించాలి. బ్రేకులను పరీక్షించాలి. క్లచ్ ప్లేట్ల మందాన్ని అంచనా వేసి మార్చాలి.

షెడ్యూల్-4: బస్సు 60 వేల కిలోమీటర్లు తిరిగిన ప్రతిసారీ కూడా ఇంజిన్ టెస్ట్ నిర్వహించాలి. గేర్ బాక్స్ సిస్టమ్‌ను పరిశీలించి అవసరమైతే కొత్తది ఏర్పాటు చేయాలి. క్లచ్ ప్లేట్స్ ఖచ్చితంగా మార్చాలి. ఇంజిన్ వాల్వ్స్ ఇతర అన్నింటినీ పరిశీలించాల్సి ఉంటుంది.

చేయకపోయినా.. చేసినట్టుగా చూపి..

బస్సులకు విధిగా నిర్వహించాల్సిన షెడ్యూల్స్‌ను చేయకుండానే చేసినట్టుగా చూపిస్తున్నారు. షెడ్యూల్స్ చెకింగ్ రిజిస్టర్స్, ఇతర రికార్డుల్లో జరిగిపోయినట్టుగా చూపిస్తున్నారు. బస్సులను చెక్ చేయకుండానే షెడ్యూల్స్ జరిగినట్టుగా చూపటం వల్ల మాల్ ప్రాక్టీస్ జరుగుతోంది. ఈ మాల్ ప్రాక్టీసు వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆర్టీసీకి కూడా నష్టం జరుగుతోంది.

అందుబాటులో లేని స్పేర్ పార్ట్స్

గ్యారేజీల్లో స్పేర్ పార్ట్స్ కొరత వేధిస్తోంది. తగిన విధంగా ఆయిల్ అందుబాటులో లేదు. టూల్స్ లేవు. బస్సుల కనీస మెయింట్‌నెన్స్‌కు సంబంధించి స్పేర్ పార్ట్స్ కూడా లేకపోవడంతో దీన్ని సాకుగా తీసుకుని గ్యారేజీల ఉద్యోగులు షెడ్యూల్స్‌ను సక్రమంగా నిర్వహించటం లేదు. ఆర్టీసీ బస్సులకు నిర్ణీత సమయంలో షెడ్యూల్స్ నిర్వహిస్తున్నారా లేదా అన్నది పరిశీలించటానికి వీలుగా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (సీఎంఈ) క్రమం తప్పకుండా డిపోలకు వచ్చి తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. వీరు గ్యారేజీలకు వచ్చినా స్పేర్ పార్ట్స్ కొరతను దృష్టిలో పెట్టుకుని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సీఎంఈ స్థాయి అధికారులు కూడా పట్టించుకోక పోవటం వల్ల షెడ్యూల్స్ మాల్ ప్రాక్టీస్ మరింతగా పెరిగిపోతోంది.

డిజైన్లు లేకుండా పనులు చేపట్టవద్దు

» ఎస్ఏబీసీఏ అధ్యక్షుడు విజయకుమార్

విజయవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : సరైన డిజైన్లు, డ్రాయింగ్‌లు లేకుండా పనులు చేపట్టవద్దని సబ్కా (స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కంట్రాక్టర్స్ అసోసియేషన్) అధ్యక్షుడు ఎస్.విజయకుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మాణ విషయాల్లో ఒత్తిడి ఎదురైతే సభ్యులు వెంటనే సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కాంట్రాక్టర్లకు ధరల విషయంలో చేసుకున్న ఒప్పందాల రద్దుపై తీసుకున్న నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదని చెప్పారు. దీనికి సంబంధించి సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్టీసీ ఎండీ చెంతకు..
లీజు పంచాయితీ!



» అధికారులను పిలిపించి వివరణ కోరిన ఎండీ
» పీఎన్‌బీఎస్ ప్రైమ్ లోకాలిటీ ల్యాండ్ లీజుపై గందరగోళం
» స్థలం కొలిచి ఇవ్వకపోవటంతో సమస్య
» పోటీ నుంచి తప్పుకున్న ఎల్-1 సంస్థ
» టెండర్లు రద్దు చేస్తే అసలుకే మోసం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్) ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం లీజు వివాదం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు వద్దకు చేరింది. దీనిపై నివేదిక ఇవ్వాల్సిందిగా ఆయన ఎన్టీఆర్ జిల్లా రీజియన్ అధికారులను కోరారు. ఖాళీ స్థలం లీజు టెండర్లలో ఎల్ 1గా నిలిచిన సంస్థ వెనుదిరగటం.. రంగంలో ఉన్న ఇతర సంస్థలు ధరను పెంచటానికి ఇష్టపడకపోవటంతో వివాదం నెలకొంది. చివరికి టెండర్లను రద్దు చేసే పరిస్థితి వచ్చింది. ఈ స్థలాన్ని కారుచౌకగా గతంలో ఓ సంస్థకు కట్టబెట్టారు. సుదీర్ఘకాలం అతి తక్కువ లీజు మొత్తాన్ని ఆర్టీసీ పొందగా.. గడువు ముగుస్తున్న నేపథ్యంలో, భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్న స్థలాన్ని కారుచౌకగా కట్టబెట్టవద్దని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ఈ కథనాలకు స్పందించిన ఆర్టీసీ అధికారులు టెండర్లు పిలిచారు. రికార్డు స్థాయిలో రూ.54 లక్షలకు పాట పెరిగినా అందిపుచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఎల్ 1 కాంట్రాక్టు సంస్థ వైదొలగటం, ఎల్-2 ధరను పెంచే పరిస్థితి లేకపోవటం, ఎల్-3 ఏ విషయం స్పష్టత ఇవ్వకపోవటంతో ఈ వ్యవహారం టెండర్ల రద్దుకు దారితీసే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఈ విషయంపై ఆర్టీసీ ఎండీ అధికారులను ఆరా తీశారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా రీజియన్ అధికారులను పిలిచి ఆరా తీశారు. టెండర్ల ద్వారా రూ.54 లక్షలకు లీజు పాట పెరిగిందని రీజనల్ మేనేజర్ ఎంవై దానం ఎండీ దృష్టికి తెచ్చారు. ఎల్-2 సంస్థ ధరను పెంచటం లేదని, ఎల్-3 సంస్థ సానుకూలతను వ్యక్తం చేస్తోందని చెప్పారు. ఎల్-3 సంస్థతో మాట్లాడి ధరను పెంచేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎండీ ఆదేశించారు.

అసలేం జరిగిందంటే..

ఆర్టీసీ అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల సంస్థ ఆదాయాన్ని కాలదన్నుకోవాల్సి వస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. జాతీయ రహదారి వెంబడి, పీఎన్ బీఎస్‌కు అభిముఖంగా ఉండే ప్రైమ్‌ల్యాండ్ లీజుకు తీసుకున్న వారు గతంలో లాభపడ్డారు. వ్యాపారపరంగా స్థలాన్ని లీజుకు తీసుకునేందుకు సంస్థలు ముందుకు వచ్చి మంచి ధర ఆఫర్ చేసినా అందిపుచ్చుకోలేని పరిస్థితి. టెండర్లలో గరిష్ఠంగా రూ.54 లక్షల పైచిలుకు ధర వచ్చింది. ఆర్టీసీ అప్పగించే స్థలం విస్తీర్ణంలో ఎల్-1గా ఉన్న కాంట్రాక్టు సంస్థ స్థలాన్ని కొలిచి ఇవ్వాల్సిందిగా అభ్యర్థించింది. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో కాంట్రాక్టర్ స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదు. దీనిపై నోటీసు ఇవ్వడంతో ఎల్-1 సంస్థ టెండర్ల నుంచి తప్పుకుంది. దీంతో ఎల్-2 సంస్థతో అధికారులు సంప్రదింపులు చేశారు. ఎల్-2 సంస్థ మరో ఆరు నెలలు పొడిగించాలని కోర్టుకు వెళ్లింది. కోర్టుకు ఆర్టీసీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచామని నివేదించారు. ఈ సమస్య తేలిందనుకుంటే.. ఇప్పుడు మూడో సంస్థ కూడా ముందుకు రాకపోతే టెండర్లను రద్దుచేయాల్సి ఉంటుంది. టెండర్లను రద్దు చేస్తే ఆర్టీసీ నష్టపోయే పరిస్థితి వస్తుంది. అధికారులు ఎల్-1 సంస్థతో సరిగా వ్యవహరించకపోవటం వల్లే ఆదాయం వచ్చే అవకాశాన్ని పోగొట్టుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ఎల్-3 సంస్థతో సంప్రదింపులు చేస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

విజయవాడ తూర్పు

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజేతలకు అభినందనలు

విజయవాడ స్పోర్ట్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సెపక్‌తక్రాలో ఏపీ మహిళా జట్టు బ్రాంజ్ మెడల్, స్విమ్మింగ్‌లో జి.సంపత్ కుమార్ యాదవ్ గోల్డ్‌మెడల్, బ్రాంజ్‌మెడల్, ఎం.థిరుడు సామ్‌దేవ్ బ్రాంజ్ మెడల్, ఆర్చరీ మిక్స్‌డ్ విభాగంలో బ్రాంజ్‌మెడల్ సాధించిన వైష్ణవి, తృణీష్‌లను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశఖ్యాతిని ఇనుమడింప జేయాలని ఆయన కోరారు.


అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధనశేఖర్, తదితరులు

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్థంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ధైర్యం, త్యాగం, దేశభక్తి మనకు ఎప్పటికీ పాఠాలుగా ఉంటాయన్నారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈలు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, అకౌంట్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పటమట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్థంతి సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ గోగినేని ధనశేఖర్ ఆధ్వర్యంలో 12వ డివిజన్‌లో సీతారామరాజు చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అల్లూరి చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె చంద్రశేఖర్, కోగంటి ప్రసాద్, కాకాని శ్రీనివాస్ పాల్గొన్నారు.



క్రైస్తవుల అభివృద్ధి కూటమిలోనే సాధ్యం

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు

వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు తెలిపారు సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని పాస్టర్లకు ఈస్టర్ సందర్భంగా ఏడు నెలల గౌరవ వేతనం విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జూలై నుంచి నవంబరు వరకు పాస్టర్లకు 7 నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ వేతనం పొందాలనుకునే పాస్టర్లకు త్వరలోనే నూతన ఎన్‌రోల్‌మెంట్ నోటిఫికేషన్ వస్తుం దని దానికి సంబంధించి డాక్యుమెంట్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో క్రిస్టియన్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రెసిడెంట్ పుష్ప రాజ్, చార్లెస్, రాజశేఖర్, నూజివీడు ప్రభాకర్, బిషప్ జీవరత్నం, పాస్టర్స్ జయరాజ్, రాజారావు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం

భారతీనగర్, మే 7 (ఆంధ్ర జ్యోతి): అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి గాయత్రినగర్‌లో ఉన్న వీఎస్ఎస్ షాపింగ్‌మాల్, వాల్ట్ బ్రేవరీ(పబ్), మ్యాక్స్ షోరూమ్, ఇంగ్లాండ్ షోరూమ్‌లో వీఎంసీ సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాల్‌లోని అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అనంతరం మాల్ సిబ్బందికి అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలో, పరికరాలను ఎలా ఉపయోగించాలో తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.


మంటలను ఎలా ఆర్పాలో చూపిస్తున్న ఫైర్ అధికారులు

ఆటో డ్రైవర్‌కు కృష్ణలంక పోలీసుల సత్కారం

నిజాయితీగా నగల బ్యాగ్ అప్పగించిన డ్రైవర్

బస్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికురాలు వదిలేసిన బంగారు ఆభరణాల బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ కృష్ణలంక పోలీసులకు అప్పగించాడు. నిజాయితీగా బ్యాగ్‌ను అప్పగించినందుకు బుధవారం కృష్ణలంక పోలీసులు ఆటో డ్రైవర్‌ను సన్మానించారు. పూర్ణానందంపేటలో బుధవారం జరిగిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు చల్లపలికి చెందిన నాగేండ్ల ఇందిర దంపతులు మంగళవారం రాత్రి చల్లపల్లి నుంచి ఆర్టీసీ బస్సులో విజయవాడ బస్టేషన్‌కు వచ్చారు. భార్యాభర్తలు బస్‌స్టేషన్ వద్ద ఆటోస్టాండ్‌లో ఓ ఆటో మాట్లాడుకుని పూర్ణానందంపేటలో దిగారు. ఇందిర తన వెంట తెచ్చుకున్న సుమారు 250 గ్రాముల బంగారు ఆభరణాల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. ఆటోడ్రైవర్ కాళ్ల పైడి నాయుడు కొద్ది సేపటి తరువాత ఆటోలో చూడగా బంగారు ఆభరణాల బ్యాగ్ కనిపించింది. ఆయన ఆ బ్యాగ్‌ను నేరుగా తీసుకువెళ్లి కృష్ణలంక పోలీసులకు అప్పగించాడు. పోలీసులు వివరాలు తెలుసుకుని బాధితురాలికి బంగారు బ్యాగ్‌ను అప్పగించారు. నిజాయితీగా బ్యాగ్‌ను అప్పగించిన ఆటో డ్రైవర్ పైడి నాయుడును పోలీసులు ఘనంగా సత్కరించి అభినందించారు.


ఆటో డ్రైవర్‌ను సన్మానించిన కృష్ణలంక పోలీసులు

సైనిక చర్యలకు అండగా ఉందాం : ఎమ్మెల్యే గద్దె

పటమట, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ఉగ్రవాదులకు సహాయం చేసే పనులకు స్వస్తి పలకాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హితవు పలికారు. అశోక్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉగ్ర దాడికి ప్రతికారంగా ప్రధాని మోదీ చేపట్టిన సైనిక చర్యలకు అందరం అండగా ఉంటూ ఉగ్రవాదాన్ని తరిమి కొడదామన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొం దించేందుకు మోదీ చేపట్టే ఏ చర్యకైనా అండగా ఉంటామన్నారు. పాక్‌పై తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రధానికి అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ చెప్పారన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆయన స్వాగతించినట్లు చెప్పారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం


దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి, మే 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మాచవరంకు చెందిన మారోజు దేవీ మల్లేశ్వరి బుధవారం తమ కుటుంబ సభ్యులతో అమ్మవారి ఆలయానికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,00,000లను చెక్కు రూపంలో అందచేశారు. ఈ సందర్భంగా అధికారులు దాతకు, కుటుంబీకులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం అధికారులు వారికి లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.





సమాచార వ్యవస్థలో హిందీ కీలకం

డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

రైల్వేస్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): అధికారిక సమాచార వ్యవహారాల్లో హిందీ కీలక పాత్ర పోషిస్తుందని విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. విజయవాడ రైల్వే డివిజన్ ఆడిటోరియంలో పట్టణ అధికార భాష అమలు కమిటీ (టోలిక్) బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హిందీని అమలు చేయటంలో విజయవాడ డివిజన్‌లోని రాజభాష విభాగం పూర్తిగా అంకితమై పనిచేస్తుందని ప్రశంసించారు. హిందీ మాట్లాడటం, రాయటం రోజువారీ కార్యకలాపాల్లో సులభతరంగా ఉంటుందన్నారు. హిందీ భాష ప్రాశస్త్యతపై పోటీలు నిర్వహించటం, అధికారిక కార్యక్రమాల్లో హిందీని ప్రోత్సహించటంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. ఆపరేషన్స్ ఏడీఆర్ఎం కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందీ భాషకు సంబంధించి సాంకేతిక సెమినార్‌లు, తదితరాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. ఎస్.కె.నాగరాజు టోలిక్ నివేదికను పవర్ పాయింట్ నివేదిక ద్వారా వివరించారు. టోలిక్ విజయవాడ ఆధ్వర్యంలో మొత్తం 42 మంది సభ్యులు 2024లో హిందీ అమలులో చేసిన ప్రయత్నాలను ప్రశంసిస్తూ రాజభాష సీడీని అందచేశారు. సర్వశ్రేష్ట పురస్కారాన్ని 20 కార్యాలయాలకు, ఉత్తమ పురస్కారాన్ని 22 కార్యాలయాలకు అందించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఉత్తమ మొదటి బహుమతిని పొందింది. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఏపీ, ప్రిన్సిపల్ ఆడిట్ ఏపీలు సంయుక్తంగా 2వ బహుమతిని సాధించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో 42 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన 125 మంది ఉద్యోగులు, అధికారులు పోటీ పడ్డారు. వీరిలో 51 మంది విజేతలకు డీఆర్ఎం బహుమతులు అందచేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 18 వరకు పోటీలు నిర్వహించారు. బెంగుళూరులోని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార భాషా విభాగం డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ విశ్వస్ మరో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ విభాగాల అధికారులు ఎస్.శ్రీనివాస్, ఎం.లక్ష్మీకాంతరెడ్డి, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, విజయకుమార్ యాదవ్, శివ హర్ష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం: గద్దె


కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె

రాణిగారితోట, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన సదు పాయాలు కల్పించడంలో టీడీపీ మొదటి నుంచి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధ వారం రాణిగారితోట 18వ డివి జన్‌లో రూ.3కోట్లతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు, అనంతరం కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్లు కూడా అందించి వారి జీవనోపాధిని మెరుగుపరిచామని, ఈ సందర్భంలోనే ఈ డివిజన్ లో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు, బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య యాదవ్, గండ్ర రాజు, ఈఈ సామ్రాజ్యం, కార్పొరేషన్ ఏఈ నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

108 కార్యాలయం సందర్శన

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం రాణిగారితోటలో పర్యటించిన సందర్భంలో 108 కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో ఉద్యోగులు తమకు కార్యాలయం ఉన్నా వాష్‌రూమ్స్ లేక ఇబ్బందులు పడుతున్నామని ముఖ్యంగా మహిళా ఉద్యోగినులు మరింత ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన వాష్ రూమ్స్ కట్టిస్తానని హామీ ఇవ్వడంతో 108ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



జవాన్లను అభినందిస్తున్న న్యాయవాదులు

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత్ జవాన్లకు అభినందనలు

విజయవాడ లీగల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని పాకిస్థాన్ ఉగ్రవాదులపై అపూర్వ వీరత్వాన్ని ప్రదర్శించిన భారత జవాన్లను అభినందిస్తూ దీనికి నాయకత్వం వహించిన వీర మహిళా మణులకు బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం బెజవాడ బార్ అసోసియేషన్ ముందు న్యాయవాదులంతా భారత్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు బాషా, కేవీ రంగారావు, న్యాయవాదులు వి.రాంప్రసాద్, అబ్దుల్ మతీన్, కండెల వరప్రసాద్, పిళ్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌నకు కృష్ణా జేసీకి ఆహ్వానం



చిట్టినగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని జిల్లా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మానవతా స్వచ్ఛంద సంస్థ జనరల్ సెక్రటరీ డాక్టర్ హసీమ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మకు ఆహ్వానపత్రిక అందజేసి సమ్మర్ క్యాంప్‌కు ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరారు. మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కిషోర్ పాల్గొన్నారు.

పూడికతీత కష్టాలు

మదర్ థెరెసా జంక్షన్‌లో పూర్తిగా వ్యర్థాలు తొలగించని వైనం

మొగల్రాజపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం మదర్ థెరెసా విగ్రహం వద్ద కల్వర్టులో బుధవారం పూడిక తీత పనులు జరిగాయి. కల్వర్టులో పూడికతీత తలకు మించిన భారంగా మారింది. మొగల్రాజపురం ఏరియాలో వర్షం కురిస్తే కొండ ప్రాంతం నుంచి వచ్చే నీరు మొత్తం జమ్మిచెట్టు సెంటర్ మీదుగా ఆర్ఆర్ దర్బార్, వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, మదర్ థెరెసా జంక్షన్ కల్వర్టు నుంచి డీవీ మానర్ , బందర్‌రోడ్డు దాటి అధికార్ హోటల్ రోడ్డు, బందర్ కాల్వకు వెళ్లాలి. ఈ మార్గంలో మదర్ థెరెసా విగ్రహం వద్ద రోడ్డు మధ్య ఉన్న కల్వర్టు ప్రధానం. నాలుగేళ్ల క్రితం ఈ కల్వర్టును పెద్ద సైజులో నిర్మించారు. దీనికి ఒక పక్క ఇనుప ఫ్రేమ్ పైన ప్లేటు పెట్టారు. ఇంత వరకు బాగానే ఉంది. పై ప్రాంతాల సైడు కాల్వల నుంచి ప్రతి రోజు మురుగు నీటితోపాటు వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు ఈ కల్వర్టు కింద నిలిచిపోతున్నాయి. ఈ వ్యర్థాలను మూత తెరిచి జేసీబీతో తీస్తున్నా ఫలితం లేదు. దాదాపు 40 అడుగుల పొడవున్న కల్వర్టులో నాలుగైదు అడుగుల మూత వద్ద మాత్రం కాకుండా మొత్తం కల్వర్టు కింద కూడా తొలగించాలంటే జేసీబీతో అయ్యే పని కాదు. కనీసం ఇంకో రెండు చోట్ల మూతలు పెడితే తప్ప వ్యర్థాలు తొలగించడం సాధ్యం కాదు.


కల్వర్టులో పూడిక తీస్తున్న జేసీబీ





ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ఇండియన్ ఆర్మీకి సెల్యూట్

- ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన గవర్నర్, సీఎం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తి చేసినందుకు ఇండియన్ ఆర్మీకి ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సెల్యూట్ చేశారు. ఎక్స్ వేదికగా భారత్ బలగాలకు అభినందనలు తెలిపారు. కాగా, బుధవారం తెల్లవారుజామున 3 గంటలకే సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచానికి మన బలాన్ని.. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలన్న కృతనిశ్చయాన్ని చాటి చెప్పామని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'మన నేలపై మొలిచిన మొక్క కూడా పీకలేరు. వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే మిస్సైల్ పేరు మోదీ' అని పేర్కొన్నారు. పహల్గాం దాడికి భారత సైన్యం సరైన రీతిలో సమాధానం చెప్పిందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. 'పాకిస్థాన్‌తో ఏ క్షణంలోనైనా యుద్ధం రావచ్చు. భారతదేశం వైపు కన్నెత్తి చూస్తే పాతేస్తామన్న సంకేతం ఇవ్వాల్సిన అవసరం ఉంది' అని అయ్యన్న అన్నారు. భారత ప్రభుత్వం 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. వందేమాతరం, భారత్ మాతాకి జై అన్న నినాదాలతో కార్యాలయ ప్రాంగణం హోరెత్తింది. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఉగ్రవాదులపై జరిగిన దాడికి యావత్ దేశం గర్విస్తుందన్నారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ ఓ ప్రకటన చేస్తూ... 140 కోట్ల మంది భారతీయుల ప్రతీకారం తీర్చుకున్న ఇండియన్ ఆర్మీకి ధన్యవాదాలు, బిగ్ సెల్యూట్ అని అన్నారు. మన సైన్యం, పాకిస్థాన్‌కు దీటైన సమాధానం ఇచ్చిందని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు.

మేమంతా మీతోనే ఉన్నాం: జగన్

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ని చేపట్టాయని మాజీ సీఎం జగన్ అన్నారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇలాంటి సమయాల్లో, తప్పనిసరి పరిస్థితుల్లో చేపట్టిన ఇలాంటి చర్యలు చెక్కుచెదరని జాతి ఐకమత్యాన్ని ప్రతిఫలిస్తాయి. మేమంతా మీతోనే ఉన్నాం. జై హింద్' అని జగన్ పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ హర్షణీయం: షర్మిల

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాద స్థావరాలపై సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేయడం హర్షణీయమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. పాక్‌పై భారత సైన్యం చేస్తున్న ప్రతి దాడులను ఆమె బుధవారం ఆమె ఎక్స్ వేదికగా స్వాగతించారు. ఇది భారత సైన్యానికి గర్వకారణమన్నారు. జై హింద్ జై భారత్ అన్నారు.

ఇది ధర్మయుద్ధం: వీహెచ్‌పీ

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): 'పహల్గాం తీవ్రవాద దాడుల తర్వాత దేశమంతటా ఎలాంటి విషాదం అలుముకుందో చూస్తున్నాం. దాన్ని దూరం చేసేలా పాకిస్థాన్ తీవ్రవాదులకు సరైన జవాబు ఇవ్వటానికి వేచి చూస్తున్నాం' అని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జనరల్ సెక్రటరీ రాఘవులుతో కలిసి బుధవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్నది ధర్మ యుద్ధమన్నారు.

ప్రధానికి.. సైన్యానికి అండగా నిలుద్దాం: లోకేశ్

తిరుపతి, మే 7(ఆంధ్రజ్యోతి): దేశంలో క్లిష్ట పరిస్థితులు నెలకొన్న ఈ సమయంలో అందరం ప్రధాని మోదీకి, సైన్యానికి అండగా నిలుద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఆయన తిరుపతి జిల్లా సత్యవేడులో నియోజకవర్గ టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఉగ్రమూకలపై ఆపరేషన్ సిందూర్ పేరిట ప్రధాని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. అందరం తొలుత భారతీయులమని, సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న సైనికులకు సంఘీభావం తెలపాలని కోరారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఆశించేవారు తప్పనిసరిగా కుటుంబ సాధికార సారథులు(కేఎస్ఎస్)గా పని చేయాల్సిందేనని లోకేశ్ కుండబద్దలు కొట్టారు. సమావేశం అనంతరం లోకేశ్ రాత్రికి సత్యవేడులోనే బస చేశారు. గురువారం ఉదయం శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన చేసి అనంతరం హైదరాబాద్ వెళ్లనున్నారు.

కృష్ణా ప్రాజెక్టుల నోటిఫికేషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్లపై విచారణను సుప్రీంకోర్టు జూలై 28కి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ జేఎల్స్ కొనసాగింపు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల సర్వీసును పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 3,572 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు, 379 మంది పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల సర్వీసును ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. జూన్ 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది. 60 ఏళ్లు నిండిన 47 మంది కాంట్రాక్టు జేఎల్స్ సర్వీసు పొడిగించలేదు.

సంక్షేమ గురుకులాల ప్రొవిజన్లకు సెంట్రలైజ్డ్ టెండర్లు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ, దివ్యాంగ, జువైనల్, ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన ప్రొవిజన్లు, నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం టెండర్ల కమిటీ/ టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీలను సవరిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో జిల్లా కమిటీల ద్వారా ప్రొవిజన్లు కొనుగోలు చేసేవారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు పిలిచే ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకే గతంలో ఉన్న టెండర్లు ఎవాల్యుయేషన్ కమిటీని మారుస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఏపీ భవన్‌లో ప్రభుత్వ సలహాదారుగా అశోక్‌కుమార్ జైన్

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అశోక్‌కుమార్ జైన్ రాష్ట్ర ప్రభుత్వానికి సలహాదారుడిగా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రెండేళ్లపాటు ఈ పోస్టులో కొనసాగుతారని, న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ ప్రభావం..
బెంగళూరు నుంచి విమాన సర్వీసులు రద్దు

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పీవోకే, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ వైమానిక దాడులు చేసిన నేపథ్యంలో బెంగళూరు నుంచి ఐదు రాష్ట్రాలకు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ విషయాన్ని కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ బుధవారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. బెంగళూరు నుంచి జమ్ముకశ్మీర్, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, లఖ్‌నవూ, ఫజియాబాద్‌లకు వెళ్లాల్సిన విమాన సర్వీసులను బుధవారం రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రయాణికులు విమాన సర్వీసుల షెడ్యూల్‌ను ముందుగానే పరిశీలించుకుని ఎయిర్‌పోర్ట్‌కు రావాలని కోరారు. దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు విమానాశ్రయం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే విమాన సర్వీసుల్లోనూ మార్పులను గమనించాలని సూచించారు.

మీ కుటుంబాన్ని బాంబులేసి లేపేస్తాం..!

- పాకిస్థాన్ నుంచి తిరుమల వ్యాపారికి బెదిరింపు కాల్
- మేమే 9 చోట్ల బాంబులేశామంటూ వ్యాపారి దీటైన జవాబు

తిరుపతి (నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశమంతా సంబరాలు జరుపుకొంటున్న వేళ.. తిరుమలకు చెందిన వ్యాపారి, జనసేన కార్యకర్త త్రిలోక్ కుమార్‌కు పాకిస్థాన్ నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. తాను పాక్‌కు చెందిన అధికారినంటూ చెప్పుకొన్న ఓ ఆగంతకుడు.. వ్యాపారి కుటుంబాన్ని బాంబులేసి లేపేస్తానని బెదిరించాడు. దీనిపై ఆ వ్యాపారి బుధవారం అలిపిరి పోలీసులకు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. తిరుపతిలోని ఎన్జీవో కాలనీకి చెందిన త్రిలోక్‌కుమార్.. తిరుమలలో గాజుల వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు బుధవారం ఉదయం 10.30 గంటలకు +923292527504 నంబరు నుంచి ఫోన్ వచ్చింది. 'నీ పేరు త్రిలోక్‌కుమార్ కదా..? మీ అబ్బాయి పేరు ఇదేనా..' అంటూ ఆ వ్యక్తి హిందీలో అడిగాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల అందరి పేర్లు చెప్పి.. 'మీరేం చేస్తున్నారనేది మాకంతా తెలుసు. జాగ్రత్తగా ఉండండి. మీపైన.. మీ ఇంటిపైనా బాంబులు వేసి హతమారుస్తాం. నేను పాకిస్థాన్‌కు చెందిన అధికారిని' అంటూ బెదిరించాడు. హిందీ తెలిసిన త్రిలోక్ కుమార్.. ఏమాత్రం భయపడకుండా అతడికి అదేస్థాయిలో బదులిచ్చారు. 'ఇప్పటికే మా భారత్ తొమ్మిది చోట్ల బాంబులు వేసి మిమ్మల్ని హతమార్చింది. మీ పాకిస్థాన్ వాళ్లు మా భారతీయులను 28 మందిని చంపితే.. మా సైన్యం ఇప్పటికే 300 మందిని లేపేసింది. అది గుర్తుపెట్టుకుని ప్రవర్తించండి. మమ్మల్ని అంత తేలిగ్గా తీసుకోవద్దు..' అంటూ హెచ్చరించారు. ఆ వెంటనే 100కు ఫోన్ చేసి బెదిరింపు కాల్ సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే వారు కంట్రోల్ రూమ్ నుంచి అలిపిరి పోలీసులను అప్రమత్తం చేశారు. వివరాలు రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



త్రిలోక్‌కుమార్ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆలోగా ప్రాథమిక పనులకు ఓకే

- భూకంప తీవ్రతపైనా అధ్యయనం చేస్తాం
- ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టండి
- వారం రోజుల్లోగా డిజైన్లను ఆమోదిస్తాం
- పోలవరంపై అంతర్జాతీయ నిపుణుల బృందం



పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన సమీక్షలో పాల్గొన్న విదేశీ నిపుణుల బృందం, అధికారులు

అమరావతి, పోలవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రంవాల్.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2, జీ-హిల్స్ డి-హిల్స్ పనుల డిజైన్లు ఆమోదం పొందేలోగా.. ప్రాథమిక పనులు ప్రారంభించవచ్చని ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలకు అంతర్జాతీయ నిపుణుల బృందం సలహా ఇచ్చింది. గ్యాప్-2 ప్రాంతంలో చేపట్టే నిర్మాణ పనులకు సంబంధించి భూకంప తీవ్రతపైనా అధ్యయన నివేదిక ఇస్తామని, తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామని పేర్కొంది. ఈ నెల 5వ తేదీ నుంచి పోలవరం ప్రాంతంలో అమెరికా, కెనడాలకు చెందిన నలుగురు అంతర్జాతీయ నిపుణుల బృందం పర్యటిస్తోంది. వారితోపాటు సీడబ్ల్యూసీ, సీఎస్ఎంఆర్ఎస్, వాప్కోస్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం. వెంకటేశ్వరరావు, సీఈ నరసింహమూర్తి తదితరులు మూడు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ప్రధాన డ్యామ్ పనులను పరిశీలిస్తున్నారు. ఈ మూడు రోజుల పరిశీలనపై గురువారం ఉదయం సమీక్షించిన తర్వాత.. పనులు ముందుకు సాగడంపై నిపుణుల బృందం సలహాలు, సూచనలు ఇస్తుంది. గురువారం మధ్యాహ్నం బృంద సభ్యులు వారి స్వదేశాలకు పయనమవుతారు. కాగా, బుధవారం నాటి పర్యటనలో అంతర్జాతీయ నిపుణుల బృంద సభ్యులు ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతంలో బంకమట్టిని పటిష్ట పరచడం, ఇసుకను తవ్వడం, నేలను పటిష్ట పరచడం వంటి వాటిని పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు కంపెనీలతో సమీక్ష నిర్వహించారు. డయాఫ్రంవాల్, బట్రస్ డ్యాంల నిర్మాణం విషయంలో అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో విదేశీ నిపుణులు డేవిడ్ బి.పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో, సీన్ హెంచ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ, సీఈ నరసింహమూర్తి, పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జల సంఘం అధికారులు సరబ్ జిత్ సింగ్ భక్షి, అశ్వనీ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎండ మంటలే!

- కొనసాగుతున్న వాతావరణ అనిశ్చితి
- ఓవైపు వర్షాలు.. మరోవైపు ఎండ

అమరావతి, విశాఖపట్నం, మే 7(ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితితో రాయలసీమ, కోస్తాల్లో ఎండ తీవ్రత, వర్షాలు కొనసాగుతున్నాయి. కోస్తా, రాయలసీమల్లో బుధవారం పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 86.25మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం అంతకంటే ఒకటి నుంచి రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి కోస్తా, రాయలసీమల్లో ఎండలు పెరుగుతాయని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. కాగా, గురువారం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకానుండగా, శుక్రవారం నుంచి ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని, ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం 15 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 28 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు ఉంటాయని పేర్కొంది. బుధవారం కడప జిల్లా సింహాద్రిపురంలో 40.7, నంద్యాల జిల్లా గుల్లదుర్తి, కర్నూలు జిల్లా నేమకల్లులో 40.6, పల్నాడు జిల్లా కాకానిలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజల న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

- ఆయన సేవలు చరిత్రలో నిలిచిపోతాయి: జస్టిస్ గవాయ్
- ప్రజల విశ్వాసమే న్యాయవ్యవస్థకు ఊపిరి: జస్టిస్ రమణ



పుస్తకావిష్కరణలో జస్టిస్ గవాయ్, జస్టిస్ ఎన్‌వీ రమణ తదితరులు

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): 'జస్టిస్ ఎన్వీ రమణ ప్రజల న్యాయమూర్తి. న్యాయమూర్తిగా ప్రజలకు దూరం కాకుండా.. వారితో కలిసిపోయి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేశారు' అని కాబోయే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎన్వీ రమణ చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. జస్టిస్ ఎన్వీ రమణ ప్రసంగాల సంకలనం 'నెరేటివ్స్ ఆఫ్ ద బెంచ్ ఏ జడ్జ్ స్పీక్స్' పుస్తకాన్ని బుధవారం గవాయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను, జస్టిస్ రమణ మరి కొందరు న్యాయమూర్తులం.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చామని అందుకే ప్రజల సమస్యలు తమకు తెలుసన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది మంది మహిళ న్యాయమూర్తులను సుప్రీంకోర్టుకు నియమించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. జస్టిస్ ఎన్వీ రమణ నిత్యం సమాజం గురించే ఆలోచించేవారని సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశంసించారు. జస్టిస్ రమణను ప్రజా స్నేహితుడిగా విక్రమ్‌నాథ్ అభివర్ణించారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ అంటే వివాదాలను పరిష్కరించే సంస్థ కాదని, అది రాజ్యాంగ నైతికతకు చిహ్నమని అన్నారు. న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకు స్థానం కల్పించడం, భారతీయ భాషలను కోర్టు విచారణలో భాగం చేయడం, ప్రజలకు న్యాయసహాయం అందేలా చూడడం వంటి వాటిపై తాను దృష్టి కేంద్రీకరించానని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు.



సీఎం చంద్రబాబుతో రక్షణ, స్పేస్ రంగాల సలహాదారులు సోమనాథ్, సతీశ్ రెడ్డి

సీఎం చంద్రబాబుతో సతీశ్‌రెడ్డి, సోమనాథ్ భేటీ

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): రక్షణ, అంతరిక్ష రంగాల్లో ఏపీని అగ్రగామిగా తీర్చిదిద్దేలా డిఫెన్స్-ఏరోస్పేస్ పాలసీని రూపొందిచాలని ప్రస్తుత రాష్ట్ర డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్ సలహాదారులు, డీఆర్డీవో మాజీ చైర్మన్ జి సతీశ్‌రెడ్డి, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వారు.. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా స్పేస్-డిఫెన్స్ పాలసీల రూపకల్పనతోపాటు ఈ రెండు రంగాలకు సంబంధించి రాష్ట్రానికి వచ్చే ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలా చురుకైన పాత్ర పోషించాలని సీఎం సూచించారు. అనంతరం సీఎం చంద్రబాబు వారిద్దరినీ సత్కరించారు.

రేపు అనంతలో చంద్రబాబు పర్యటన

- హంద్రీనీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనుల పరిశీలన

అనంతపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను సీఎం పరిశీలిస్తారు. ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం అధికారికంగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఉదయం విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురానికి.. ఆ తర్వాత రోడ్డు మార్గాన ఆ గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకుంటారు. అనంతరం జలవనరుల శాఖ అధికారులతో సమావేశమవుతారు. ఛాయాపురం ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. ఆ తర్వాత బెంగళూరుకు పయనమవుతారు.

ఎంబీబీఎస్ మెరిట్ విద్యార్థులకు స్వర్ణ పతకాలు

- ఏపీఎంసీ చైర్మన్‌గా డాక్టర్ దగ్గుమాటి బాధ్యతల స్వీకారం

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వర్ణ పతకాలు, ప్రశంసాపత్రాలు ఇవ్వడాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, దానిని వచ్చే విద్యాసంవత్సరం నుంచి పునరుద్ధరిస్తామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నూతన చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి అన్నారు. బుధవారం ఉదయం ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలోని ఏపీ మెడికల్ కౌన్సిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బాండ్ల జారీ ప్రక్రియను నిలువరించట్లేదు : హైకోర్టు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): మైనింగ్ ప్రాజెక్టుల విస్తరణ, అభివృద్ధి, కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా బాండ్ల రూపంలో రూ.9వేల కోట్లు సమీకరించేందుకు ఏపీఎండీసీకి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ గురువారం బాండ్లు అప్‌లోడ్ చేస్తున్నామని తెలపగా, తాము ప్రక్రియను నిలువరించడం లేదని చీఫ్‌జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. విచారణను వేసవి సెలవుల తర్వాతికి వాయిదావేసింది. పిటిషనర్, వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపించారు.

రూ.5లక్షలు జమ చేయండి

- కేఏ పాల్‌కు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై దర్యాప్తును సీబీఐకి అప్పగించేలా ఆదేశించాలంటూ వేసిన పిల్ విషయంలో హైకోర్టు రిజిస్ట్రీ వద్ద రూ.5లక్షలు జమ చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ తరువాతే పిల్‌పై విచారణ చేపడతామని స్పష్టంచేసింది. విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్‌జస్టిస్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిల బెంచ్ ఉత్తర్వులు ఇచ్చింది. పాస్టర్ మరణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ కేఏపాల్ పిల్ దాఖలు చేశారు. పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ వాదనలు వినిపించారు. సీబీఐ విచారణకు వెంటనే ఆదేశించకుంటే సీసీ టీవీ ఫుటేజీ భద్రపరిచేలా పోలీసులకు సూచించాలని కోరారు. సీసీటీవీ ఫుటేజీ 3నెలల్లో డిలీట్ అవుతుందని తెలిపారు. అలాగని మీకుఎవరు చెప్పారని, వాస్తవాలు తెలియకుండా వాదనలు చేయొద్దని బెంచ్ హెచ్చరించింది. పిల్‌ను సదుద్దేశంతో వేశారని నిరూపించుకొనేందుకు 5లక్షలు జమ చేయాలని కేఏ పాల్‌ను ఆదేశించింది.

లులూ సంస్థకు భూకేటాయింపుపై నిర్ణయాన్ని మా ముందు ఉంచండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): విశాఖలో లులూ సంస్థకు భూ కేటాయింపు విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిల్‌పై విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖలో షాపింగ్ మాల్ ఏర్పాటుకు సంబంధించి లులూ గ్రూపునకు తక్కువ ధరకు 13.5 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించబోతుందంటూ పాకా సత్యనారాయణ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపించారు. బిడ్లు ఆహ్వానించకుండా, సంస్థ చైర్మన్ ప్రతిపాదనల మేరకు భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, రెవెన్యూశాఖ ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... భూమి కేటాయింపు ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు.

కార్పొరేట్‌కు దీటుగా సంక్షేమ విద్యాసంస్థలు

- నీట్ ఉచిత కోచింగ్ సెంటర్లను 10కి పెంచుతాం: డోలా, సంధ్యారాణి

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమశాఖ గురుకులాలు, హాస్టళ్లు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు, టీచర్లకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నగదు బహుమతులు, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. తొలిసారిగా ఇలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. నీట్‌లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది నుంచి 10కి పెంచుతామన్నారు. గిరిజన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించడం గర్వకారణమన్నారు. టీచర్స్‌ను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

'రేషన్ బియ్యం'పై సిట్ పునర్వ్యవస్థీకరణ

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులపై కాకినాడ జిల్లాలో నమోదైన కేసులు, సంబంధిత ఇతర నేరాల దర్యాప్తును కొనసాగించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఇప్పటివరకు ఈ బృందానికి అధిపతిగా ఉన్న ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ ఢిల్లీలోని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. దీంతో ఆయన స్థానంలో మరో ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణను 'సిట్' నూతన అధిపతిగా నియమించింది. అదేవిధంగా గతంలో నియమించిన డీఎస్పీల స్థానంలో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను, సివిల్ సప్లయిస్‌కు చెందిన ఒక డీఎస్‌వో, ఒక డీఎంలను సభ్యులుగా నియమిస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులిచ్చారు.

సెకీ విద్యుత్ చౌక కాదు

- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు వెల్లడి

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో చేసుకున్న ఏడు వేల మెగావాట్ల ఒప్పందం మేరకు రాష్ట్రానికి చౌకగా విద్యుత్ రాదని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తేల్చి చెప్పారు. ఆ కరెంటు సరఫరాకు ట్రాన్స్‌మిషన్ చార్జీలు వర్తిస్తాయని, ఇందులో ఎలాంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. సెకీ నుంచి కొనుగోలు చేసిన సోలార్ కరెంటుకు సరఫరా చార్జీలు వర్తించబోవంటూ జగన్ పత్రిక రాసిన కథనం పూర్తి నిరాధారమైనదని బుధవారం వెల్లడించారు. అది అవాస్తవాలతో కూడిన కథనం అని కొట్టిపాడేశారు. సెకీ కరెంటుకు సరఫరా చార్జీల మినహాయింపు ఉంటుందంటూ ఇప్పటిదాకా కేంద్ర ఇంధన శాఖ ఉత్తర్వులేవీ జారీ చేయలేదన్నారు. సెకీ విద్యుత్ రాష్ట్రానికి వచ్చే సరికి రూ. 4.79కు పైగానే అవుతుందని పేర్కొన్నారు. సెకీ సౌర విద్యుత్తు రాష్ట్రానికి వచ్చేందుకు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు (ఐఎస్‌టీసీ) పడతాయని చెప్పారు. పీక్ సమయం నాలుగు గంటలూ సెకీ నుంచి విద్యుత్తు సరఫరా ఉండదని, అందువల్ల డిమాండ్‌ను తట్టుకునేందుకు బహిరంగ మార్కెట్లో యూనిట్‌కు రూ. 10కి పైగా పెట్టి కొనుగోలు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. దీనివల్ల వినియోగదారులపై ఇంధన సర్దుబాటు చార్జీలు భారీగా పడతాయని చెప్పారు. యాక్సిస్‌తో ఒప్పందాన్ని సెకీతో పోల్చేందుకే లేదన్నారు. యాక్సిస్ విద్యుత్తు కొనుగోలు వల్ల పీక్ అవర్‌లోనూ విద్యుత్తు సరఫరాకు వీలుంటుందని చెప్పారు.

వైసీపీ హయాంలోని పీపీఏలు రద్దు చేయాలి

విజయవాడ(గుణదల), మే 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విద్యుత్‌శాఖ చేసుకున్న రహస్య ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ విజయవాడలోని గుణదల విద్యుత్‌సౌధ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు.

టీడీపీ పోరాట ఫలితమే 'గాలి'కి శిక్ష: పయ్యావుల

గుంతకల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో గాలి జనార్దన్‌రెడ్డికి శిక్ష పడటం టీడీపీ పోరాట ఫలితమేనని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం చాయపురంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని చంద్రబాబు నాడు అసెంబ్లీలో గళమెత్తారని గుర్తు చేశారు. కేసు దర్యాప్తు, విచారణ ఆలస్యమైనా న్యాయమే గెలిచిందన్నారు.

జగన్.. త్వరలో నీకూ 'గాలి' గతే!: మంత్రి సవిత

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నాడని, రాష్ట్రంపై, కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మంత్రి సవిత విమర్శించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆమె మాట్లాడారు. జగన్‌కు త్వరలోనే గాలి జనార్దనరెడ్డి గతే పడుతుందన్నారు. మహిళలు ఉచిత కుట్టు శిక్షణ పథకంపై వైసీపీ నేతలు చర్చకు రావాలని మంత్రి సవాల్ విసిరారు.

నానో ఎరువులను ప్రోత్సహించండి: ఢిల్లీరావు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు రైతులకు సూచించారు. బుధవారం విజయవాడలో ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో 'నానో సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయంలో వాటి వినియోగం' అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జరిగింది. దీనిలో పాల్గొన్న ఢిల్లీరావు నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లాల వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

'ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ'కి మార్గదర్శకాలు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ (2024-29) మార్గదర్శకాలను విడుదల చేస్తూ ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు. రూ.50కోట్ల నుంచి రూ.200కోట్ల దాకా పెట్టుబడి ఉండే సంస్థలను సబ్‌లార్జ్‌గా, రూ.1000కోట్ల దాకా ఉంటే లార్జ్‌గాను, రూ.5 వేల కోట్లదాకా మెగా కంపెనీలుగా, రూ.5000 కోట్లపైబడిన సంస్థలను అల్ట్రా మెగా కంపెనీలుగా గుర్తిస్తారు.



14 రోజుల్లో తిరుగులేని ప్రతీకారం

- నాడు ఉరి దాడికి 10 రోజుల్లో జవాబు
- పుల్వామా దాడి..12రోజుల్లో ప్రతిచర్య
- మెరుపు దాడులతో దెబ్బకొట్టిన భారత్

న్యూఢిల్లీ, మే 7: కశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకొని.. పాకిస్థాన్‌లో సేదతీరుతున్న ఉగ్రవాదులకు అర్ధరాత్రి పూట క్షిపణి దాడులతో కాళరాత్రిని చూపించిన భారత్.. తమ ప్రతీకారం ఎలా ఉంటుందో మరోసారి రుచి చూపించింది. పహల్గాం ఉగ్రదాడి జరిగిన 14 రోజుల తరువాత శత్రువు ఊహించని విధంగా దెబ్బకొట్టింది. పాక్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో, దేశ పౌరులను కూడా అందుకు మానసికంగా సిద్ధం చేసేలా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తూ దృష్టి మరల్చింది. అందరూ అదే ఆలోచనలో ఉండగా.. నియంత్రణ రేఖ దాటకుండానే కేవలం 24 నిమిషాల వ్యవధిలో పాక్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసింది. గతంలో ఉరిలోని సైనిక స్థావరంపై ఉగ్రదాడి, పుల్వామాలో సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలపై ఆత్మాహుతి దాడి జరిగినప్పుడు కూడా భారత్ ఇలాంటి వ్యూహంతోనే ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేసి ముష్కరులను మట్టుబెట్టింది. 2016 సెప్టెంబరు 18న తెల్లవారుజామున ఉరిలోని సైనిక స్థావరంపై జైషే మహ్మద్ ఉగ్రవాదులు గ్రనేడ్ దాడులకు పాల్పడి 17 మంది సైనికులను పొట్టనబెట్టుకున్నారు. కాగా, ఈ ఘటన జరిగిన పది రోజుల తరువాత సెప్టెంబరు 28న భారత్ పక్కా వ్యూహంతో ఉగ్రవాదుల పని పట్టింది. భారత కమెండోలు నియంత్రణ రేఖను దాటి వెళ్లి మరీ.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై సర్జికల్ స్ట్రయిక్స్ జరిపారు. పెద్దసంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టారు. అనంతరం పుల్వామా ఉగ్రదాడి విషయంలోనూ ఇదే వ్యూహంతో దెబ్బకొట్టారు. 2019 ఫిబ్రవరి 14న జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఆత్మాహుతి దళ సభ్యుడు శ్రీనగర్-జమ్మూ హైవేపై ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ల వాహనశ్రేణిపైకి దూసుకెళ్లి తనను తాను పేల్చుకోవడంతో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన తరువాత భారత్ కేవలం 12 రోజుల్లోనే జైషే ముష్కరులకు బుద్ధి చెప్పింది. 2019 ఫిబ్రవరి 26న పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో జైషే నిర్వహిస్తున్న ఉగ్రవాద శిక్షణ శిబిరంపై భారత వాయుసేన మెరుపు దాడులు చేసింది. శిక్షణ శిబిరాన్ని నామరూపాల్లేకుండా చేయడంతోపాటు పెద్ద ఎత్తున ఉగ్రవాదులను మట్టుబెట్టింది.



భారత్ దాడి నేపథ్యంలో మురిద్‌కేలో కుప్పకూలిన భవనం

ఆ ఆడబిడ్డల కన్నీటికి ప్రతీకారమే ఆపరేషన్ సిందూర్

ప్రధాని సూచించిన పేరుతో సైనిక చర్య!

న్యూఢిల్లీ, మే 7: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై చేసిన దాడికి 'ఆపరేషన్ సిందూర్' అనే పేరును ప్రధాని నరేంద్ర మోదీ పెట్టారు. ఈ పేరు ఎంపిక వెనుక చాలా అర్థం ఉంది. అదేంటంటే... పహల్గాంలో పర్యాటకులను తుపాకులతో చుట్టిముట్టిన ఉగ్రమూక... పురుషులనే లక్ష్యంగా చేసుకుని దాడి చేసింది. పేర్లు, మతం అడగటంతోపాటు కలిమా చదివించి మరీ ప్రాణాలు తీసింది. పిల్లల కళ్ల ముందే తండ్రిని, భార్య చూస్తుండగానే భర్తను చంపి మారణహోమం సృష్టించింది. ఓ నవవధువు సహా చాలామంది ఆడబిడ్డలను వితంతవులను చేసింది. హిందూ సంప్రదాయం ప్రకారం వివాహిత మహిళలు తమ నుదుటి మీద పెట్టుకునే బొట్టు(సిందూరం)ను ఎంతో పవిత్రంగా, వివాహానికి గుర్తుగా భావిస్తుంటారు. అంతటి విలువైన బొట్టును కోల్పోయిన మహిళల కన్నీటికి కారణమైన వారిపై ప్రతీకారం తీర్చుకుంటున్నామనే ఉద్దేశంతోనే సైనిక చర్యకు "ఆపరేషన్ సిందూర్" అనే పేరు పెట్టారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రకటన చేస్తూ భారత ఆర్మీ సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఫొటోలో కూడా ఈ ఉద్దేశం స్పష్టమవుతోంది. ఆ చిత్రంలో సిందూర్ అనే పదం ఆంగ్లంలో రాసి ఉండగా.. అందులోని రెండు 'ఓ'ల్లో ఒకదాని స్థానంలో సిందూరంతో నిండిన ఓ గిన్నెను ఉంచారు. ఆ గిన్నె నుంచి కొంత సిందూరం చెల్లాచెదురుగా పడి ఉన్నట్టు డిజైన్ చేశారు. మహిళలు తమ సిందూరాన్ని కోల్పోయారనే అర్థం వచ్చేలా అది ఉంది. ఇక, ఆ ఫొటోకు "జస్టిస్ సర్వ్‌డ్.. జైహింద్" అనే శీర్షిక ఇవ్వడంతో ఆ పేరు వెనుక ఉద్దేశం మరింత స్పష్టమైంది.

సిందూరమే.. సంహారమై!



(మొదటిపేజీ తరువాయి)

పది మంది సహా అతని అనుంగు అనుచరులు మరో నలుగురు ఉండడం గమనార్హం. 'ఆపరేషన్ సిందూర్' పేరిట మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాడులకు భారత సైన్యం శ్రీకారం చుట్టింది. దాదాపు 1.05 గంటల నుంచి 1.30 గంటల వరకూ అంటే.. 25 నిమిషాలపాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. లష్కరే తాయిబా ఆత్మాహుతి బాంబర్ల కీలక శిక్షణ శిబిరమైన కోట్లీలోని అబ్బాస్ టెర్రరిస్టు క్యాంపుపై రాత్రి 1.04 గంటలకు తొలుత క్షిపణి దాడి చేసింది. ఏ సమయంలోనైనా ఇక్కడ 50 మందికిపైగా ఉగ్రవాదులు ఉంటారని చెబుతారు. ఆ వెంటనే, లష్కరే తాయిబా ప్రధాన కార్యాలయం, అతి పెద్ద ఉగ్రవాద శిక్షణ శిబిరమైన మురుడ్కేలోని స్థావరంపై 1.06 గంటల నుంచి 1.10 గంటల వరకూ వరుస దాడులు చేసి పూర్తిస్థాయిలో ధ్వంసం చేశారు. ఆ తర్వాత.. ఉగ్ర ప్రణాళికలు, శిక్షణకు కీలకమైన బహవల్పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయాన్ని; సరిహద్దు ఉగ్రవాద చొరబాట్లకు శిక్షణ, సహకారం అందించే సియాల్ కోట్‌లోని ఉగ్రవాద స్థావరాన్ని నేలమట్టం చేసింది. అనంతరం, ఉగ్ర శిక్షణ, ఆయుధ నిల్వ, చొరబాట్లకు కీలకమైన ముజఫరాబాద్, భింబర్; చాక్ అమ్రు, గుల్పూర్‌లోని స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. చివరిగా.. సమీప భవిష్యత్తులోనూ ఉగ్రవాద దాడులు చేయకుండా నిలువరించడమే ధ్యేయంగా మురుడ్కేలోని లష్కరే తాయిబా ప్రత్యామ్నాయ స్థావరాన్ని ధ్వంసం చేసింది. సర్జాల్ జిల్లా తెహ్రా కలాన్‌లోని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జైషే మహ్మద్ తన కమ్యూనికేషన్ కేంద్రాన్ని రహస్యంగా నిర్వహిస్తోంది. అత్యంత కచ్చితత్వంతో దాడి చేసి దానిని నేలమట్టం చేసింది. జమ్ము కశ్మీరులోకి చొరబడే ఉగ్ర వాదులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసే హై ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఇక్కడ ఉంటుంది. దాడుల్లో దానిని మొత్తాన్ని ధ్వంసం చేసింది. మిలటరీ గ్రేడ్ కమ్యూనికేషన్ పరికరాలు, లాంగ్ రేంజ్ అల్ట్రా సెట్లు, డిజిటల్ మొబైల్ రేడియోలు తదితరాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.



కచ్చితంగా.. గురి తప్పకుండా

ఎక్కడా గురి తప్పకుండా పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపైనే మన సైన్యం దాడులు చేసింది. మిలటరీ స్థావరాలు, పౌరులపై ప్రభావం చూపకుండా అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసింది. దాడులు చేసిన అరగంటకే సైన్యం ఈ మేరకు ప్రకటన చేసింది. అనంతరం బుధవారం మధ్యాహ్నం ఆర్మీ కార్ప్స్ సిగ్నల్స్‌కు చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌ను అమలు చేసిన తీరును వివరించారు. తొమ్మిది లక్ష్యాలపై తాము ఎందుకు గురి పెట్టాల్సి వచ్చిందో కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. సియాల్‌కోట్‌లోని సర్జల్, మెహమూనా జోయా స్థావరం (హిజ్బుల్), మురుడ్కేలోని మర్కజ్ తాయిబా (లష్కరే), బహవల్పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా (జైషే మహ్మద్), పీవోకేలోని సవాయి నాలా, ముజఫరాబాద్‌లో సైద్నా బిలాల్, కోట్లీలోని గుల్పూర్, అబ్బాస్, భింభర్‌లోని బర్నాలా శిబిరాలను ధ్వంసం చేశామని ఆమె మ్యాప్‌ల ఆధారంగా వివరించారు. సంబంధిత ప్రదేశాల చిత్రాలను విడుదల చేశారు. ఉగ్రవాద శిబిరాల్లోని ఒక శిబిరంలో ముంబై దాడులకు పాల్పడిన అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ శిక్షణ పొందారని తెలిపారు. భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న జైషే, లష్కర్, హిజ్బుల్ ఉగ్రవాదులను నిర్మూలించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఉగ్ర దాడులను నిలువరించడం, భవిష్యత్తులో జరగకుండా అడ్డుకోవడం అనివార్యంగా మారిందని, అందుకే, బాధ్యతాయుతంగా, తదుపరి ఉద్రిక్తతలకు తావు లేకుండా, దెబ్బకు దెబ్బ అన్న తీరులో దాడులు చేశామని విక్రమ్ మిస్రి వివరించారు. తమ భూభాగంపై ఉగ్రవాదాన్ని నియంత్రించేందుకు, ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మూలించేందుకు పాకిస్థాన్ నిర్దిష్టంగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, భారత్‌లో మరిన్ని దాడులు జరిగే అవకాశమూ ఉందని మన నిఘా వర్గాలు సంకేతాలు ఇచ్చాయని, ఈ నేపథ్యంలో పహల్గాం ఉగ్ర దాడి సూత్రధారులు, పాత్రధారులకు తగిన బుద్ధి చెప్పడం అనివార్యంగా మారిందని వివరించారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నేలమట్టం చేయడం, ఉగ్రవాదులు చొరబడకుండా అడ్డుకోవడమే ధ్యేయంగా ఈ దాడులు జరిగాయన్నారు. "పహల్గాం ఉగ్ర దాడి దారుణం. అనాగరికం. 26 మంది పర్యాటకులను అత్యంత దారుణంగా చంపేశారు. ఎక్కువమందిని అతి తక్కువ దూరం నుంచి తలపై కాల్చి చంపేశారు. అది కూడా వాళ్ల కుటుంబ సభ్యుల కళ్లముందే. వాళ్లు చంపిన తీరు చూసి కుటుంబ సభ్యులంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే జమ్ము, కశ్మీర్‌లో మళ్లీ సాధారణ పరిస్థితులను తీసుకు రావాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంది. మత విద్వేషాన్ని రెచ్చగొట్టడమూ ఆ ఉగ్ర దాడి మరో లక్ష్యం" అని వివరించారు. ఈ కుట్రలను నిర్వీర్యం చేసిన ఘనత ప్రభుత్వం, ప్రజలదేనని అన్నారు. ఆ దాడులకు తమదే బాధ్యత అని 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) ప్రకటించుకుందని, ఇది లష్కరే తాయిబా అనుబంధ సంస్థ అని తెలిపారు.



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సంబరాలు

ఉగ్రవాద అంతానికి ఇది ఆరంభం కావాలి

లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి



దేశంలో ఉగ్రవాదం అంతానికి ఇది ప్రారంభం కావాలని లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్ అభిప్రాయపడ్డారు. పెళ్లైన మూడు వారాలకే భార్య హిమాన్షితో కలిసి హనీమూన్ నిమిత్తం లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ పహల్గాంకు వెళ్లి ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించారు. 'శాంతిని, అమాయక ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నా భర్త సైనిక దళాల్లో చేరారు. దేశంలో ఉగ్రవాదం, విద్వేషం ఉండకూడదని ఆయన కోరుకున్నారు. ఉగ్రవాదం అంతమయ్యే వరకు ఆపరేషన్‌ను ముగించొద్దని ప్రధాని మోదీని కోరుతున్నా' అని హిమాన్షి అన్నారు.

నా కొడుకు త్యాగం వృథా కాలేదు

మృతుడు మంజునాథ్ రావ్ తల్లి సుమతి

తన కుమారుడి త్యాగం వృథా కాలేదని కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన మంజునాథ్ రావ్ తల్లి సుమతి సంతృప్తి వ్యక్తం చేశారు. మధుసూదన్ రావ్ తన భార్య పల్లవి, కుమారుడు అభిజేయతో కలిసి పహల్గాంకు వెళ్లి ఉగ్రదాడిలో మరణించారు. 'అమాయకులకు హాని జరుగకూడదు. అయితే, మాకు హాని కలిగించిన ముష్కరులను వదిలిపెట్టకూడదు. నా కుమారుడి త్యాగం వృథా కాకూడదు. సరైన నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నా' అని అన్నారు.

సైన్యం చర్య భేష్

మృతుడు భరత్ తండ్రి చిన్నవీరప్ప

సైన్యం చర్యను మరో మృతుడు భరత్ భూషణ్ తండ్రి చిన్నవీరప్ప ప్రశంసించారు. బెంగళూరుకు చెందిన భరత్‌భూషన్ తన భార్య, మూడేళ్ల కుమారుడితో పహల్గాం పర్యటనకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. 'ఆపరేషన్ సిందూర్ అనేది సరైన పేరు. ఎందుకంటే అనేక మంది మహిళల తిలకాన్ని ఉగ్రవాదులు చెరిపేశారు. ప్రభుత్వం మంచిపని చేసింది' అని చిన్నవీరప్ప పేర్కొన్నారు.

ఆ నలుగురినీ చంపేయాలి

సుశీల్ నతానియేల్ భార్య జెన్నీఫర్

పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదులనూ అంతం చేయాలని ఇండోర్‌కు చెందిన సుశీల్ నతానియేల్ భార్య జెన్నీఫర్ డిమాండ్ చేశారు. భార్యతో కలిసి పహల్గాంకు వెళ్లిన సుశీల్ నతానియేల్ కూడా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయారు. 'ఇప్పుడు జరిపిన క్షిపణి దాడి సరైనదే. కానీ, ఆ నలుగురు ఉగ్రవాదులనూ అంతమొందించాలి. ఎందుకంటే ఆ నలుగురూ జంతువుల కంటే దారుణంగా ప్రవర్తించారు. వారికీ ఇలాంటి శిక్షే పడాలి. ఆ నలుగురూ చావాల్సిందే' అని జెన్నీఫర్ పేర్కొన్నారు.

ఇంతకు మించిన జవాబుండదు

ఎస్.రామచంద్రన్ కుమార్తె ఆర్తి

మృతుల కుటుంబాలకు ఈ ఆపరేషన్‌తో కొంత ఉపశమనం కలిగిందని కేరళలోని కోచికి చెందిన ఎస్.రామచంద్రన్ కుమార్తె ఆర్తి పేర్కొన్నారు. ఆర్తి ఎదురుగానే ఆమె తండ్రిని ఉగ్రవాదులు హతమార్చారు. 'ఉగ్రవాదానికి ఇంతకు మించిన సమాధానం మరొకటి ఉండదు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సైనికులందరికీ నా సెల్యూట్, ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని ఆర్తి పేర్కొన్నారు.

4 డ్రోన్లు.. అన్నింటినీ ధ్వంసం చేశాయి

- మురీద్‌కేకు చెందిన ప్రత్యక్ష సాక్షి

ఇస్లామాబాద్, మే 7: 'అర్ధరాత్రి నాలుగు డ్రోన్లు చుట్టుముట్టాయి. చూస్తుండగానే అన్నింటినీ ధ్వంసం చేశాయి' అని పాకిస్థాన్‌లోని మురీద్‌కేకు చెందిన ప్రత్యక్ష సాక్షి వెల్లడించాడు. భారత్ మెరుపు దాడుల నేపథ్యంలో వార్తా సంస్థ 'రాయిటర్స్'తో బుధవారం అతడు మాట్లాడాడు. 'అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో ఓ డ్రోన్ వచ్చింది. ఆ తర్వాత మరో మూడు డ్రోన్లు వచ్చాయి. మసీదులపై దాడులు ప్రారంభించాయి. క్షణాల్లోనే ధ్వంసం చేశాయి' అని వివరించాడు.

'సిందూర్'తో మనసు కుదుటపడింది

- పహల్గాం మృతుడు మధుసూదనరావు భార్య ప్రసన్న కామాక్షి




కావలి, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద స్థావరాలపై సైన్యం దాడి జరపడంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తమకు నమ్మకం ఏర్పడిందని పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన నెల్లూరు జిల్లా కావలివాసి మధుసూదనరావు భార్య ప్రసన్న కామాక్షి వెల్లడించారు. బుధవారం కావలిలోని తన నివాసం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నీటితో ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తన భర్త పెద్దఖర్మలోపే ఉగ్రవాదులపై దాడులు చేయడంతో తన మనసు కొంత కుదుటపడిందన్నా రు. ఇలాంటి ఘటనలు ఇక జరగవని ప్రజలకు ప్రధాని నమ్మకం కలిగించారని కొనియాడారు. తనకు, తన పిల్లలకు వచ్చిన ఈ కష్టం ఏ కుటుంబానికీ రాకూడదన్నారు. తాము అనుభవించిన నరకాన్ని మాటల్లో చెప్పలేనన్నారు.

సంతోషంగా ఉంది: ప్రగతి, సంగీత

పహల్గాం మృతులకు ఆపరేషన్ సిందూర్ తగిన నివాళి అని పుణేకు చెందిన సంతోష్ జగ్దాలే, కౌస్తుభ్ గన్బోటేల కుటుంబాల సభ్యులు పేర్కొన్నారు. చిన్ననాటి స్నేహితులైన వీరిద్దరు కూడా పహల్గాం పర్యటనకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. 'ఆపరేషన్ సిందూర్ చేపట్టిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. మా భావాలను అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞులం. మా సిందూరాలను ఉగ్రవాదులు చెరిపేశారు. కానీ, ఈరోజు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను మన సైన్యం ధ్వంసం చేసినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది' అని సంతోష్ జగ్దాలే భార్య ప్రగతి పేర్కొన్నారు. ఉగ్రదాడికి భారత సైన్యం తగిన సమాధానం ఇచ్చినందుకు సంతోషంగా ఉందని కౌస్తుభ్ గన్బోటే భార్య సంగీత పేర్కొన్నారు.

ఉగ్రమూకలు దాగి ఉన్న ప్రాంతాలు



బర్నాలా



మురీద్‌కే



సియాల్ కోట్



కోట్లీ



ఆపరేషన్ సిందూర్



పాక్ సైన్యాధిపతి మునీర్ ఎక్కడ?

(సెంట్రల్ డెస్క్)

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ సయ్యద్ అసిమ్ మునీర్ అహ్మద్ షా కనిపించడం లేదు! పహల్గాం ఉగ్రదాడికి ముందు హిందువులు, ముస్లింలు వేరంటూ వ్యాఖ్యలు చేసిన ఆయన.. దాడి జరిగిన తర్వాత నుంచి ఎవరికీ కనిపించకుండా పోయారు. కనీసం మీడియా సమావేశాల్లోనూ పాల్గొనలేదు. ఆ దాడికి ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట క్షిపణి దాడులతో విరుచుకుపడిన తర్వాత కూడా ఆయన జాడ లేకపోవడం గమనార్హం. మునీర్ 'దేశం వదిలి పారిపోయారు' అంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు వెల్లువెత్తాయి. పాక్ ఆర్మీ చీఫ్ తన కుటుంబంతో సహా దేశం విడిచి పారిపోయారని లేదా రావల్పిండిలోని బంకర్‌లో దాక్కున్నారని వార్తలొచ్చాయి. ఈ ప్రచారం ఊపందుకోవడంతో పాకిస్థాన్ ప్రధానమంత్రి కార్యాలయం నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఏప్రిల్ 26న ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో కలిసి జనరల్ మునీర్ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారంటూ ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'అబోటాబాద్‌లోని పీఎంఏ కాకుల్‌లో 151వ లాంగ్ కోర్సు గ్రాడ్యుయేటింగ్ అధికారులతో గ్రూప్ ఫొటోలో ప్రధాని షెహబాజ్ షరీఫ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ సయ్యద్ అసిమ్ మునీర్, పీఎంఏ కాకుల్ అధికారులు. ఏప్రిల్ 26, 2025' అని ఫొటోకు శీర్షిక కూడా పెట్టింది. అయితే ఆర్మీ చీఫ్ కనిపించడం లేదన్న వార్తలను కప్పిపుచ్చడానికే ఏఐతో సృష్టించిన తప్పుడు ఫొటోను పోస్ట్ చేశారని సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి.

విఫలదేశం పాక్

అన్ని రంగాల్లోనూ ఫెయిల్ ..

రాజకీయ అస్థిరత్వం.. సైన్యం నియంత్రణ

నిరంకుశత్వం.. హక్కుల హననం.. మతపెద్దల బహిరంగ విమర్శలు

పతనం అంచున ఆర్థిక వ్యవస్థ.. ఐఎంఎఫ్ అప్పుతో నెట్టుకొస్తున్న వైనం

పహల్గాం తర్వాత అంతర్జాతీయంగా ఒంటరి.. ఐరాసలో అవమానం

(సెంట్రల్ డెస్క్)

1947లో పంతంతో మన కన్నా ఒక రోజు ముందు (ఆగస్టు 14) స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది పాకిస్థాన్. కానీ, ఈ 8 దశాబ్దాల్లో ఒక విఫలదేశంగా ప్రపంచం ముందు నిలబడింది. రాజకీయ, ఆర్థిక, అంతర్గత భద్రత తదితర అంశాలతోపాటు పొరుగుదేశాలతో సంబంధాలు, అంతర్జాతీయ వ్యవహారాల్లోనూ పూర్తిగా విఫలమై బాహ్య, అంతర్గత సమస్యలు, సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రధాని షాబాజ్ షరీఫ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం బలహీనంగా ఉంది. సాధారణంగానే పాకిస్థాన్‌లో ప్రభుత్వాలను ఆ దేశ సైన్యం నియంత్రిస్తుంది.. ఇప్పుడిది మరింత అధికంగా కనిపిస్తోంది. జైళ్లో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు జనంలో మద్దతు పెరుగుతోంది. ఆయన పార్టీ (పీటీఐ) నేతృత్వంలో భారీ ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి. దేశంలో కరడుగట్టిన నియంతృత్వం నెలకొందని, ప్రశ్నించే జర్నలిస్టులను, పౌరులను, ఇస్లామిక్ మత గురువులను కిడ్నాప్ చేసి హత్య చేస్తున్నారని పలువురు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. ఇస్లామాబాద్‌లోని ప్రఖ్యాత లాల్‌మసీదు ఇమాం అబ్దుల్ అజీజ్ ఘాజీ.. ఇటీవలి శుక్రవారం ప్రార్థనల సందర్భంగా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. భారత్‌తో యుద్ధానికి సై అంటున్న నేతలు.. తమ స్వప్రయోజనాల కోసమే ఆ పని చేస్తున్నారని, అది ఇస్లామిక్ యుద్ధం కాదని పేర్కొన్నారు. మరోవైపు, పాకిస్థాన్ ఆర్థిక రంగం కుప్పకూలటానికి సిద్ధంగా ఉంది. పాక్ రూపాయి దారుణంగా పతనమైంది. ఒక అమెరికా డాలర్‌కు 281 పాక్ రూపాయలు. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి పాకిస్థాన్ రుణం తీసుకుంటోంది. ఇప్పటికి రికార్డు స్థాయిలో 25 సార్లు అప్పు తీసుకుంది.





బలూచిస్థాన్ స్వాతంత్రోద్యమం

విస్తీర్ణం పరంగా పాకిస్థాన్‌లో అతిపెద్ద రాష్ట్రం బలూచిస్థాన్. అక్కడి ప్రాంతాల్లో అపారమైన సహజ వనరులున్నాయి. కానీ, తలసరి ఆదాయం ప్రకారం బలూచిస్థాన్ పాక్‌లో అత్యంత వెనుకబడిన రాష్ట్రం. ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రంలో 70 ఏళ్లుగా స్వాతంత్రోద్యమం నడుస్తోంది. తమ వద్ద ఉన్న సహజ వనరులను పాక్ ప్రభుత్వం వాడుకుంటున్నప్పటికీ.. తమకు ఎటువంటి లబ్ధి చేకూరటం లేదని, తమను దోపిడీ చేస్తోందని.. పాక్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించటమే ఏకైక మార్గమని బలూచ్ ప్రజలు భావిస్తున్నారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ, బలూచ్ లిబరేషన్ ఫ్రంట్, మాజిద్ బ్రిగేడ్ వంటి సంస్థలు పాక్ సైన్యంతోపాటు ఇతరత్రా లక్ష్యాల మీద తరచూ దాడులు జరుపుతున్నాయి. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రంలోనూ పరిస్థితులు శాంతియుతంగా లేవు. ఆ రాష్ట్రంలోని వజీరిస్థాన్ తదితర ప్రాంతాల్లో తెహ్రీక్ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతోంది. అనేక గ్రామాలను ఆక్రమించింది.

సొంత గడ్డపై తాలిబన్లను పెంచి పోషించిన పాక్.. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ల రాజ్యం వచ్చిన తర్వాత ఆ దేశంతో సంబంధాలు మెరుగుపడతాయని భావించింది. కానీ, దానికి విరుద్ధంగా ఇప్పుడు పాక్ తాలిబన్లు ఏకుమేకయ్యారు. అటు అఫ్ఘాన్‌తోనూ సంబంధాలు క్షీణించాయి. మరో పొరుగుదేశం ఇరాన్‌తోనూ పాకిస్థాన్‌కు స్నేహం లేదు. ఇరాన్‌లోనూ బలూచిస్థాన్ పేరుతో ఓ

పొరుగు దేశాలతోనూ పొట్లాటలే

రాష్ట్రం ఉంది. అక్కడి బలూచ్ మిలిటెంట్లు పోలీసుల మీద దాడి చేసి 11 మందిని చంపటంతో.. పాక్‌లోని బలూచిస్థాన్ మీద ఇరాన్ గత ఏడాది జనవరిలో క్షిపణి, డ్రోన్ దాడులు జరిపింది. దీనికి ప్రతిగా పాక్.. ఇరాన్‌లోని బలూచిస్థాన్‌లో మిలిటెంట్ల స్థావరాల మీద వైమానిక దాడి జరిపింది. తాజాగా, పహల్గాం ఉగ్రదాడి అనంతరం అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఒంటరైంది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలోనే పాక్ ప్రతినిధి.. సభ్యదేశాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఈ విధంగా పాకిస్థాన్ ఓ విఫలదేశంగా తయారైంది.



'యుద్ధం'పై అప్రమత్తం!

విశాఖ, ఒంగోలు, బాపట్లలో మాక్ డ్రిల్

విశాఖపట్నం/బాపట్ల/ఒంగోలు క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో ప్రస్తుత యుద్ధ వాతావరణం సమయంలో ఊహించని విధంగా దాడులు జరిగితే ఎలా తప్పించుకోవాలి..? ప్రాణాలు కాపాడుకోవడానికి ఏం చేయాలి..? అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుంది..? అన్నదానిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం విశాఖపట్నం, ఒంగోలు, బాపట్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. విశాఖపట్నంలో ఐదు వేర్వేరు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షణలో వన్‌టౌన్ ఏరియాలోని రెండుచోట్ల మాక్ డ్రిల్ నిర్వహించారు. రాణీబొమ్మ సెంటర్‌లో జేఎం బక్షి సంస్థకు చెందిన భవనాలపై ఉగ్రవాదులు పొగ బాంబులతో దాడులు చేసిన సన్నివేశాన్ని సృష్టించారు. అగ్నిమాపక దళం మంటలను అదుపు చేయగా, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది మాస్కులు ధరించి నిచ్చెన సాయంతో భవనంలోకి వెళ్లి అక్కడున్న ఉద్యోగులను కిందికి తీసుకువచ్చారు. అక్కడికి సమీపంలోని క్వీన్ మేరీ పాఠశాలలోనూ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు పాఠశాలలోకి వస్తే ఏమి చేయాలనే దానిపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఎన్‌సీసీ బృందాలు, ఎన్‌డీఆర్ఎఫ్ కలిసి మాక్ డ్రిల్ నిర్వహించాయి. వాల్తేరు రైల్వే డీఆర్ఎం కార్యాలయం, విశాఖపట్నం పోర్టులతో కేంద్ర ప్రభుత్వ బలగాలు మాక్ డ్రిల్ చేపట్టాయి. ఒంగోలులో రైల్వే స్టేషన్, బస్టాండ్‌తో పాటు ముఖ్యమైన ప్రాంతాలలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో పోలీసులు మాక్‌డ్రిల్ చేపట్టారు.



ఏమార్చి... విరుచుకుపడి!

బాలాకోట్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకూ...

దాయాది దృష్టి మరల్చి చావుదెబ్బ కొట్టిన భారత్

మోదీ వ్యూహాలకు పాక్ తల్లకిందులు

న్యూఢిల్లీ, మే 7: శత్రువును ఏమార్చి కోలుకోలేని విధంగా దెబ్బ తీయడంలో ప్రధాని నరేంద్ర మోదీ స్టైలే వేరు. ఆయన వ్యూహాలను పసిగట్టడంలో దారుణంగా విఫలమైన పాకిస్థాన్‌కు ప్రతిసారీ భారత్ చేతిలో శృంగభంగం తప్పడం లేదు. 2019లో బాలాకోట్ దాడులతో పాటు తాజాగా ఆపరేషన్ సిందూర్ విషయంలోనూ ఈ విషయం నిరూపితమైంది. పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారంగా 2019 ఫిబ్రవరి 26న బాలాకోట్‌పై భారత్ దాడికి దిగింది. దీనికి 48 గంటల ముందు ప్రధాని మోదీ ఎంతో ప్రశాంతంగా కనిపించారు. 25న ఢిల్లీలో నేషనల్ వార్ మెమోరియల్‌ను జాతికి అంకితం చేశారు. ఆ సమయంలో భారత సాయుధ దళాల పరాక్రమం గురించి ఆయన ప్రసంగించారు. 26 రాత్రి 9 గంటలకు వాయుసేన దాడులకు సిద్ధమవుతున్న సమయంలో కూడా ఢిల్లీలో మీడియా సదస్సులో మోదీ ప్రసంగించారు. ఆ సమయంలోనూ ఆయన ముఖంలో ఎలాంటి ఆందోళన కనిపించలేదు. చివరకు మన బలగాలు విజయవంతంగా ఆపరేషన్‌ను ముగించాయి.

ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి ముందు కూడా ప్రధాని ప్రశాంతంగా ఉన్నారు. అప్పటిలాగానే దాడులకు ముందు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. 2047 నాటికి ఆర్థిక దిగ్గజంగా ఎదగాలన్న దేశ ఆకాంక్షల గురించి మాట్లాడారు. ఆయన ముఖంలో ఎక్కడా ఒత్తిడి, ఆందోళన ఛాయామాత్రంగా కూడా కనిపించలేదు. పైగా నవ్వుతూ, జోకులు వేస్తూ మాట్లాడారు. ఇంకోవైపు దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్స్ ప్రకటించడం ద్వారా దేశ ప్రజలను సైనిక చర్యకు,

ఆపరేషన్ సిందూర్ వేళా అదే తీరు

దాని పర్యవసానాలకు సన్నద్ధం చేస్తున్నారని ప్రత్యర్థి దేశంతో సహా అందరూ భావించారు. అయితే ఇదంతా తమను ఏమార్చడానికి పన్నిన వ్యూహం అని పాక్‌కు అర్థమయ్యే సరికి మన బలగాలు తమ పనిని విజయవంతంగా పూర్తి చేశాయి. బాలాకోట్ దాడికి ముందు మోదీ ప్రవర్తనను విశ్లేషించి ఉంటే.. పాకిస్థాన్‌కు ఈ దుస్థితి వచ్చేది కాదని నిపుణులు పేర్కొంటున్నారు.

బూచి... తూచ్!

అణు బెదిరింపుల్ని లెక్కచేయని భారత్

"పాకిస్థాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయి. భారత్ మాపై దాడి చేసినా, మా ఉనికికి ముప్పు కలిగించినా భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగించేస్తాం" అని పాక్ నేతలు భారత్‌ను తరచు బెదిరిస్తుంటారు. కశ్మీర్ వంటి అపరిష్కృత సమస్యలు అణు ఘర్షణకు దారితీయవచ్చని 2019లో అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వ్యాఖ్యానించారు. పాక్‌ను రెచ్చగొడితే అణ్వస్త్రాలు వాడడానికి సందేహించబోమని 2022లో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నేత షాజియా మర్రీ హెచ్చరించారు. తాజాగా మొన్న ఏప్రిల్‌లో పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ మరింత ముందుకు వెళ్లి "పాకిస్థాన్ వద్ద 130 అణు వార్‌హెడ్లు ఉన్నాయి. ఘోరీ, ఘజ్నవీ, షహీన్ క్షిపణులు ఉన్నాయి. అవన్నీ ప్రదర్శన కోసం కాదు. భారత్‌పై ప్రయోగించడం కోసమే" అంటూ దారుణంగా మాట్లాడారు. పాకిస్థాన్ ఓవైపు భారత్‌పై ఉగ్రవాద దాడులు చేయిస్తుంటుంది. దానికి సైనికపరంగా స్పందించాలని భారత్ ఆలోచిస్తే చాలు... అది అణు యుద్ధానికి దారితీస్తుందని, భారత్‌పై అణ్వాయుధాలు వేసేస్తామని బెదిరిస్తూ.. భారత దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంటుంది. అంటే తన అణుబాంబులను బూచిగా చూపిస్తూ భారత్‌పై యథేచ్ఛగా ఉగ్రవాద దాడుల్ని కొనసాగించవచ్చని పాక్ భావిస్తుంటుంది. సంప్రదాయ ఆయుధాలతో యుద్ధం చేస్తే తాము ఓడిపోతామని తెలుసు కాబట్టి అలాంటి యుద్ధమే జరగకుండా అణ్వాయుధాల్ని అడ్డు పెట్టుకుంటుంటుంది. పాక్ నిర్మించుకున్న ఈ అణు కవచాన్ని భారత్ ఇటీవల మెల్లమెల్లగా బద్దలుకొడుతూ వస్తోంది.

1998లో భారత్ పోఖ్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించగా దానికి స్పందనగా పాక్ కూడా అణు పరీక్షలు జరిపింది. దీనితో రెండు దేశాలూ ప్రకటిత అణ్వస్త్ర రాజ్యాలుగా ఆవిర్భవించాయి. ఆ తర్వాత 1999లో పాక్ కార్గిల్ కొండల్ని ఆక్రమించగా భారత్ తన ఆర్మీయే కాదు వాయుసేనను కూడా ఉపయోగించి పాక్‌పై దాడి చేసింది. కానీ ఆనాటి యుద్ధమంతా భారత భూభాగంలోనే జరిగింది. ఆ సందర్భంలో కూడా పాక్ అణు బూచిని చూపించినా భారత్ లెక్కచేయలేదు. అలాగే 2001లో భారత పార్లమెంటుపై దాడి తర్వాత భారత్ అయిదు లక్షల సైన్యాన్ని పాక్ సరిహద్దులో మోహరించింది. అప్పుడు కూడా పాక్ అణు బెదిరింపులకు దిగింది. దీనిపై నాటి భారత ఆర్మీ చీఫ్ పద్మనాభన్ స్పందిస్తూ "ఒకవేళ పాక్ భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేస్తే భారత్ ప్రతిస్పందన ఎలా ఉంటుందంటే పాక్ ఏ రూపంలోనైనా ఈ భూమిపై కొనసాగడమే డౌట్ అనేలా ఉంటుంది" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అయినా అప్పుడు కూడా భారత్ సరిహద్దులు దాటి ముందుకు వెళ్లలేదు. కానీ పాక్ అణ్వస్త్ర బూచికి భయపడి వారి ఉగ్రవాద చర్యలను మనం భరించాల్సిందేనా అనే అంతర్మథనం భారత వ్యూహకర్తల్లో మొదలైంది. దీనితో కోల్డ్‌స్టార్ట్ డాక్ట్రిన్ అనే ఒక వ్యూహాన్ని వారు రూపొందించారు. పాక్ అణ్వస్త్ర దాడి చేసేంత పెద్ద కారణాన్ని కల్పించకుండా పాక్‌లో పరిమిత దాడులు చేసి తాను అనుకున్న కొన్ని లక్ష్యాలను సత్వరం సాధించేలా తగిన వ్యూహాలను ఈ డాక్ట్రిన్‌లో పొందుపరిచారు. ఆ తర్వాత భారత్ ధోరణి చాలా మారింది. 2016 యూరి ఉగ్రవాద దాడుల తర్వాత భారత సైన్యం నియంత్రణ రేఖను దాటివెళ్లి మరీ పాక్ ఉగ్రవాద మూకలపై దాడి చేసింది. అలాగే 2019లో పుల్వామా దాడి తర్వాత అంతర్జాతీయ సరిహద్దు దాటి వెళ్లి పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. అంటే పాక్ అణు కవచాన్ని భారత్ మెల్లమెల్లగా ధ్వంసం చేయడం ప్రారంభించింది. "మీరు ఉగ్రవాదం చేస్తే మేం సైనిక దాడి చేసి తీరతాం. మీ అణు బెదిరింపులకు భయపడం" అని చాటి చెబుతూ వస్తోంది. తాజాగా జరిపిన ఆపరేషన్ సిందూర్‌తో "పాక్ అణు బూచి తూచ్" అని భారత్ మరింత గట్టిగా చెప్పినట్టు కనిపిస్తోంది. పాక్‌లోని అత్యున్నత అధికారుల నుంచి అణు బెదిరింపులు వచ్చినా లెక్క చేయకుండా ఒకేసారి తొమ్మిది లక్ష్యాలపై దాడులు చేయడం, అది కూడా వంద కిలోమీటర్ల లోపల ఉన్న ఉగ్ర శిబిరాలపై గురిపెట్టడం ద్వారా పాక్‌కు భారత్ గట్టి సందేశాన్నే పంపింది. తాను తరచు అణు బెదిరింపులు చేయడాన్ని అంతర్జాతీయ సమాజం కూడా హర్షించదని పాక్‌కు కూడా ఇప్పుడు తెలిసివస్తోంది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి









మళ్లీ పౌరులపైనే గురి!

భారత్ దాడితో విచక్షణ కోల్పోయిన పాక్

కశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాలపై ఫిరంగి గుళ్ల వర్షం ..13 మంది మృతి.. 57 మందికి గాయాలు

పూంచ్, మే 7: ఆపరేషన్ సిందూర్‌తో విచక్షణ కోల్పోయిన దాయాదిదేశం సాధారణ భారత ప్రజలపై తన 'ప్రతాపం' చూపింది. జమ్ము కశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరీ, కుప్వారాల్లో వందలాది నివాసాలపై ఫిరంగి గుళ్ల వర్షం కురిపించింది. ఈ దారుణమైన దాడిలో కనీసం 13 మంది పౌరులు మరణించగా.. 57 మంది గాయపడ్డారు. అనేక ఇళ్లు, భవనాలు నేలమట్టమయ్యాయి. ఓ గురుద్వారా కూడా ధ్వంసమైంది. మృతుల్లో నలుగురు పిల్లలు, ఒక జవాను కూడా ఉన్నారు. పాక్ దాడి నేపథ్యంలో, వేలాదిమందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుధవారం వేకువజామున భారత్ దాడి జరిగిన కొద్ది వ్యవధిలోనే పాక్.. సరిహద్దు ప్రాంతాల పౌర నివాసాలపై విచక్షణారహిత దాడి ప్రారంభించింది. పూంచ్ బస్టాండు లక్ష్యంగానూ పాక్ కాల్పులు జరిపింది. పలు బస్సులు ధ్వంసమయ్యాయి. పూంచ్ పట్టణంలో ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ కార్యాలయం, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ భవనాలు కూడా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం వరకూ కాల్పులు కొనసాగాయి. అనుకోకుండా జరిగిన ఈ పరిణామానికి జనం భీతిల్లిపోయారు. ప్రాణాలు దక్కించుకోవటానికి పరుగులు తీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం స్థానికులు.. కాల్పుల మధ్యనే ఆస్పత్రులకు తరలించారు. కాగా, పాక్ జరిపిన దాడిలో పౌర నివాసాలకు జరిగిన నష్టం, విధ్వంసం తాలూకు ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. కాగా భారత్ క్షిపణులు, డ్రోన్లు, యుద్ధవిమానాలతో ఉగ్ర శిబిరాల మీద దాడి చేస్తే పాక్ మాత్రం శతఘ్నులు, ఫిరంగులతో భారత పౌరుల మీద దాడి చేయటం ఆ దేశం స్థాయిని తెలుపుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పాక్ సైన్యం కాల్పుల్లో మరణించిన చిన్నారి

300 విమానాల రద్దు

25 విమానాశ్రయాల మూసివేత

గగనతలంపై కేంద్రం భద్రతాపరమైన ఆంక్షలు

మే 10 వరకూ పలు ఎయిర్‌లైన్స్ విమానాలు రద్దు

పాకిస్థాన్‌కు ఖతార్ ఎయిర్‌వేస్ సర్వీసులు రద్దు

హైదరాబాద్ నుంచి ఆరు ప్రాంతాలకు విమానాల నిలిపివేత

న్యూఢిల్లీ/ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (ఆంధ్రజ్యోతి), మే 7: 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో గగనతలంపై కేంద్రం ఆంక్షలు విధించడంతో బుధవారం ఉదయం 5.29 గంటల నుంచి ఈ నెల 10 వరకూ దేశవ్యాప్తంగా 300పై చిలుకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. శ్రీనగర్, లేహ్, జమ్ము, అమృత్‌సర్, సిమ్లా సహా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని 25 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసేశారు. మరోవైపు, పాకిస్థాన్ మీదుగా వెళ్లే సుమారు 25 విమాన సర్వీస్ రూట్లను మూసేసినట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో.. వివిధ విమానాశ్రయాల నుంచి సర్వీసులను రద్దు చేసినట్టు పలు విదేశీ, స్వదేశీ విమానయాన సంస్థలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో.. ప్రయాణికులు బయలుదేరడానికి ముందు రియల్‌టైం అప్‌డేట్స్ చెక్ చేసుకోవాలని అభ్యర్థించాయి. మరోవైపు.. పాకిస్థాన్‌కు తాత్కాలికంగా విమాన సర్వీసులు నిలిపేశామని ఖతార్ ఎయిర్‌వేస్ తెలిపింది. తాజా ఆంక్షల నేపథ్యంలో బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయానికి బయలుదేరే ప్రయాణికులు తమ ఎయిర్‌లైన్స్ నుంచి వచ్చే అప్‌డేట్స్ చెక్ చేసుకోవాలని ఆ సంస్థ సూచించింది. ఆపరేషన్ సిందూర్‌కు తోడు.. హైదరాబాద్‌లో జరిగే 'మిస్ వరల్డ్' పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి సుందరీమణులు వస్తున్న నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హై అలర్ట్ ప్రకటించారు. గగనతల ఆంక్షలతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఉత్తర భారతంలోని ఆరు ప్రాంతాలకు వెళ్లే 20 విమానాలు రద్దు కాగా, 22 సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో విమానాశ్రయంలో అడుగడుగునా సీఆర్పీఎఫ్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. భద్రత కారణాల రీత్యా.. నిర్దేశిత సమయానికి కంటే ముందుగానే ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకోవాలని సూచించారు. చెకిన్‌లో కొంత ఆలస్యం జరుగనుండటంతో ఓపిగ్గా వ్యవహరించాలని ప్రయాణికులను కోరారు.







ఉగ్ర స్థావరాలపై

ఉక్కు పాదం

పీవోకేలో 5.. పాకిస్థాన్‌లో 4 టెర్రర్ క్యాంపుల్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడులు చేసిన భారత్



పార్లమెంటులో.. పహల్గాంలో.. పఠాన్‌కోట్‌లో.. పుల్వామాలో.. ఇలా ఎక్కడ పడితే అక్కడ పదే పదే వి చక్షణరహిత దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదుల పీచమణచడానికి చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా భారతదేశం వారికి చెందిన 9 కీలక స్థావరాలను గుర్తించింది. నిఘా వర్గాల ద్వారా వాటికి సంబంధించిన పూర్తి సమాచారం సేకరించి అనూహ్యంగా అర్ధరాత్రి దాడులు చేపట్టి అరగంటలోపే పని ముగించేసింది. పుల్వామాలో నలభై మంది భారతీయ సైనికులను బలిగొన్న జైషే మహమ్మద్ ఉగ్రవాదుల కీలక స్థావరాలు.. సముద్ర మార్గంలో ముంబైలోకి చొరబడి నరమేధం సృష్టించిన అజ్మల్‌కసబ్‌కు శిక్షణ ఇచ్చిన ఉగ్ర శిబిరం.. పహల్గాం దాడికి సూత్రధారి అయిన లష్కరేతాయిబాకు చెందిన కీలక క్యాంపులపై క్షిపణులతో విరుచుకుపడింది! పదుల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టింది. భారత్ దాడిలో తునాతునకలైన ఆ తొమ్మిది ఉగ్రవాద క్యాంపుల్లో ఐదు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండగా.. నాలుగు పాకిస్థాన్‌లో ఉన్నాయి. ఆ వివరాలు..


సయ్యద్‌నా బిలాల్ క్యాంప్, ముజఫరాబాద్ (పీవోకే)

నియంత్రణ రేఖకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జైషే మొహమ్మద్ ఉగ్రశిబిరమిది. ఆయుధాల డిపోగా, పేలుడుపదార్థాల గిడ్డంగిగా, అడవుల్లో మనుగడ సాగించడం ఎలాగో ఉగ్రవాదులకు నేర్పే శిక్షణ శిబిరంగా దీన్ని వాడుతున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జైషే మొహమ్మద్ ప్రధాన కేంద్రమిది. ముజఫరాబాద్‌లో రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. భారత్‌లోకి చొరబడే జైషే ఉగ్రవాదులు.. పీవోకేలో ఇక్కడే మకాం వేస్తారు. నిత్యం కనీసం 50 నుంచి 100 మంది ఈ క్యాంపులో ఉంటారని అంచనా.

ఇది నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ముజఫరాబాద్-నీలమ్ రోడ్‌లో చెలాబండి బ్రిడ్జికి సమీపంలో ఉంది. లష్కరే తాయిబాకు చెందిన ఉగ్రవాద శిక్షణ శిబిరం ఇది. 2024లో సోనామార్గ్, గుల్‌మార్గ్‌లో.. తాజాగా పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రమూకలకు శిక్షణ ఇచ్చింది ఈ శిబిరంలోనే. లష్కరే నడిపే అత్యంత కీలకమైన శిబిరమిది. 2000 సంవత్సరం నుంచి ఇక్కడ ఉగ్రవాదుల

షవాయ్ నాలా క్యాంప్, ముజఫరాబాద్ (పీవోకే)

నియామకం, శిక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కాల్పులు జరపడంలో శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ ఫైరింగ్ రేంజ్, ఒక మదర్సా ఉన్నాయి. దాదాపు 250 మంది దాకా టెర్రరిస్టులు ఉండడానికి అవసరమైన ఏర్పాట్లున్నాయి. శిక్షణ కోసం వచ్చేవారికి ఇక్కడ లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ స్వయంగా స్వాగతం పలికేవాడని చెబుతారు. పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ.. ఇక్కడ ఉగ్రవాదులకు శిక్షణనిచ్చేందుకుగాను ఆర్మీ ట్రైనర్లను పంపుతుంది. వారికి ఇక్కడ కాల్పులు జరపడం, బాంబులు, గ్రనేడ్‌లు వేయడంతోపాటు.. జీపీఎస్‌ను వినియోగించడం, మ్యాపులను అర్థం చేసుకోవడం వంటివాటిలో 21 రోజులపాటు ప్రాథమిక శిక్షణ ఇస్తారు. దీన్ని 'దౌరా ఈ ఆమ్' ట్రైనింగ్‌గా వ్యవహరిస్తారు.





మర్కజ్ తయ్యబా, మురీద్‌కే (పాకిస్థాన్)

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 2008లో దారుణ మారణకాండ సాగించిన అజ్మల్ కసబ్, ఆ దాడి సూత్రధారులైన డేవిడ్ హెడ్లీ, తహావుర్ రాణా వంటివారికి 'దౌరా ఏ రిబ్బత్' (నిఘా కార్యకలాపాల్లో) శిక్షణ ఇచ్చిన క్యాంపు ఇది. 2000 సంవత్సరంలో దీని ఏర్పాటుకు.. ఒసామా బిన్ లాడెన్ కోటి రూపాయల నిధులు ఇచ్చినట్టు చెబుతారు. ఇండో-పాక్ సరిహద్దుకు 18 నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుందిది. లష్కరే తాయిబా కీలక ఉగ్రవాద శిక్షణ శిబిరాల్లో ఒకటి. దాదాపు 82 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ క్యాంపులో.. ఒక మదర్సా, మార్కెట్, ఉగ్రవాదుల నివాసాలు, క్రీడా ప్రాంగణం, చేపల పెంపకం కేంద్రం, చిన్నపాటి వ్యవసాయ భూములు ఉంటాయి. లష్కరే సిద్ధాంతకర్తలైన అమీర్ హంజా, అబ్దుల్ రెహ్మాన్ అబిద్, జాఫర్ ఇక్బాల్ ఈ క్యాంపులోనే నివసిస్తుంటారు. యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించి.. జిహాద్‌లో పాల్గొనేలా చేయడమే లక్ష్యంగా ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఒక్కముక్కలో చెప్పాలంటే.. ఇది ఉగ్రవాదులను తయారుచేసే కర్మాగారం.

మర్కజ్ సుభానల్లా, బహావల్ పూర్ (పాక్)

ఇది జైషే మొహమ్మద్ ప్రధాన కార్యాలయం. భారత సరిహద్దులకు 100 కిలోమీటర్ల దూరంలో.. పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో.. ఆ దేశ ఆర్మీ కంటోన్మెంట్‌కు కొన్ని మైళ్ల దూరంలో 18 ఎకరాల విస్తీర్ణంలో ఉందీ ఉగ్రవాద శిబిరం. జైషే మొహమ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజర్ పుట్టి పెరిగింది ఈ ఊళ్లోనే. అతడి నివాసం కూడా ఈ క్యాంప్‌లోనే ఉంది. 2001లో పార్లమెంటులపై దాడి, 2016లో పఠాన్‌కోట్ దాడి, 2019లో పుల్వామా దాడి సహా.. భారత్‌లో జైషే మొహమ్మద్ చేసిన పలు ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించింది ఇక్కడే. 600 మందికి పైగా ఉగ్రవాదుల నివాసాలు ఇక్కడ ఉంటాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ జరిపిన దాడిలో ఈ క్యాంపులోని జావియా మసీదు పైభాగంలో పెద్ద రంధ్రం పడింది. మసీదు ధ్వంసమైంది. దాడులు జరిగిన సమయంలో అక్కడే ఉన్న మసూద్ అజర్ అక్క, బావ, అజర్ మేనల్లుడు, అతడి భార్య, మేనకోడలు, దగ్గరి బంధువుల పిల్లలు మరో ఐదుగురు, అతడి సన్నిహితులు నలుగురు మరణించారు.



మర్కజ్ అబ్బాస్, కోట్లీ (పీవోకే)

నియంత్రణ రేఖకు 13 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న జైషే మొహమ్మద్ ఉగ్ర శిబిరం ఇది. ఆత్మాహుతి దాడులకు పాల్పడే ఫిదాయీలకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. 100-125 మంది ఉండడానికి ఏర్పాట్లుంటాయి. ఎప్పుడూ కనీసం 40-50 మంది ఉంటారు. పఠాన్‌కోట్ దాడికి ముందు జైషే సంస్థ తన ఆయుధాలను సియాల్‌కోట్‌లోని దస్కా మర్కజ్‌లో భద్రపరిచేది. తర్వాత ఇక్కడికి మార్చింది.

మర్కజ్ అహ్లె హదీస్, బర్నాలా (భింబర్, పీవోకే)

నియంత్రణ రేఖ నుంచి 9 కిలోమీటర్ల దూరంలో బర్నాలా పట్టణ శివార్లలో ఉందీ టెర్రర్ క్యాంప్. ఆయుధాలు, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్‌ల నిల్వకు, ఉగ్రవాదులను, ఆయుధాలను పూంచ్-రాజౌరీ-రెయిసీ సెక్టార్‌లోకి దొంగతనంగా పంపించడానికి లష్కరే ఉపయోగిస్తున్న కీలక హబ్ ఇది. ఇక్కడ 100-150 మంది ఉండడానికి ఏర్పాట్లు ఉంటాయి. సాధారణంగా ఎప్పుడూ 40-50 మంది ఉంటారు. షవాయ్‌నాలాలో ప్రాథమిక శిక్షణ అనంతరం.. అంచెలంచెలుగా పూర్తి శిక్షణ పొందిన లష్కరే ఉగ్రవాదులను చివరిగా ఇక్కడికి తెస్తారు. వారు ఇక్కణ్నుంచే భారత్‌లోకి చొరబడతారు.

మెహమూనా జోయా, సియాల్ కోట్ (పాక్)

ఇది హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థకు చెందిన ప్రధాన ఉగ్రవాద శిబిరాల్లో ఒకటి. అంతర్జాతీయ సరిహద్దుకు 12 నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. కథువా-జమ్ము ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలను ఇక్కడి నుంచే నిర్వహిస్తుంటారు. దీన్ని కూడా భారత్‌లోకి ఉగ్రవాదులను పంపే లాంచ్‌ప్యాడ్‌లా వాడుతుంటారు. వారికి ఆయుధాలు వాడడంలో శిక్షణ ఇస్తారు. జమ్ములో పలు దాడులు చేసిన ఉగ్రవాది మొహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్ ఈ క్యాంపు ప్రధాన కమాండర్. 1995లో జనవరి 26న జమ్ములోని మౌలానా అజాద్ స్టేడియంలో పేలుళ్లు జరిపింది అతడే.

మస్కర్ రహీల్ షాహిద్, గుల్పూర్ క్యాంప్, కోట్లీ (పీవోకే)

నియంత్రణ రేఖకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న లష్కరే ఉగ్ర శిబిరమిది. 2023లో పూంచ్‌లో ఉగ్రదాడి, 2024లో యాత్రికులపై ఉగ్రదాడి చేసింది.. ఈ క్యాంపులో శిక్షణ పొందిన ఉగ్రవాదులే. దీన్ని ఉగ్రవాదులకు శిక్షణనివ్వడంతో పాటు.. వారి నివాసాలకు, ఆయుధాల నిల్వకు వినియోగిస్తారు.

పాకిస్థాన్‌లోగానీ, పీవోకేలోగానీ.. ఎక్కడా పౌర ఆవాసాలను, సైనిక స్థావరాలను తాకకుండా కేవలం టెర్రర్ క్యాంపులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కచ్చితమైన దాడులు జరపడం ద్వారా భారత దేశం పాక్‌ను తీవ్రస్థాయిలో ఇరకాటంలోకి నెట్టగలిగింది. ఇంతకీ భారత్ ఇంత కచ్చితంగా ఉగ్రస్థావరాల పైనే దాడులు ఎలా చేయగలిగింది?

ఎలా గుర్తించారంటే..

అంటే.. దాని వెనుక కీలకపాత్ర పోషించింది 'నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్‌టీఆర్‌వో)'. ఆ సంస్థ పీవోకేలో, పాక్‌లో ఉగ్రవాదుల కదలికలను నిశితంగా పరిశీలించి, ఈ క్యాంపుల సమాచారాన్ని సైన్యానికి చేరవేసింది. 2004లో ప్రభుత్వం దీన్ని ఏర్పాటు చేసింది. ఇది జాతీయ భద్రత సలహాదారు, పీఎంవో ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా వేసి.. సమాచారాన్ని సేకరించడం, దేశ ప్రయోజనాలను కాపాడడమే దీని ప్రధాన విధులు.



సర్జాల్ తెహ్రా లాంచింగ్ సెంటర్ (పాక్)

అంతర్జాతీయ సరిహద్దుకు, జమ్ములోని సాంబా సెక్టార్‌కు.. కేవలం 6 కిలోమీటర్ల దూరంలో పాకిస్థాన్‌లో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉందీ జైషే ఉగ్రవాద క్యాంపు. బోర్డర్‌కు అత్యంత సమీపాన ఏర్పాటు చేసుకున్న ఈ క్యాంపును.. భారత్‌లోకి ఉగ్రవాదులను పంపే లాంచ్‌ప్యాడ్‌లా వాడుతుంటారు. ఉగ్రవాదులను అలా భారత్‌లోకి పంపడానికి ఏయే ప్రదేశాలు అనువైనవో గుర్తించి, అక్కడ సొరంగాలు తవ్వడం, డ్రోన్ల ద్వారా కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదులకు ఆయుధాలు, డ్రగ్స్ పంపడం వంటి పనులు ఇక్కడి నుంచే చేస్తుంటారు. ఇటీవలికాలంలో.. డ్రోన్ల ద్వారా ఉగ్రవాదులను సైతం భారత్‌లోకి పంపేందుకు ఇక్కడ కుట్రలు పన్నుతున్నట్టు సమాచారం.

ప్రతీకారం తీర్చుకుంటాం



» పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలు

ఇస్లామాబాద్, మే 7: తమ దేశంలోని పలు ప్రాంతాలపై భారత్ జరిపిన దాడులకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు! ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. "భారత్ చేసిన తప్పునకు పర్యవసానాలు తప్పక ఉంటాయి' అని హెచ్చరించారు. "క్షిపణిదాడులకు భయపడి పాకిస్థాన్ కుంగిపోతుందని, ఓడిపోయినట్టు ఒప్పుకొంటుందని భారత్ అనుకుంటోంది. కానీ.. ఇది తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడం కోసం ఎలా పోరాడాలో తెలిసిన దేశం అని మర్చిపోతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకు ముందు.. బుధవారం ఉదయం పార్లమెంటులో మాట్లాడిన ఆయన భారత్ దాడులను యుద్ధచర్యతో సమానంగా అభివర్ణించారు. కాగా, ఆపరేషన్ సిందూర్‌పై పాక్ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందించారు. సరిహద్దుల్లో భారత్ తన ఆపరేషన్లను నిలిపివేస్తే తదుపరి చర్యకు దూరంగా ఉండటానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. తమపై దాడి జరిగితే పాకిస్థాన్ స్పందిస్తుందని బ్లూమ్‌బర్గ్ టెలివిజన్‌తో అన్నారు. భారత్ పట్ల తాము ఎలాంటి ప్రతికూల చర్యను తీసుకోమని గత పక్షం రోజులుగా చెబుతున్నామని, కానీ తమపై దాడి జరిగితే స్పందిస్తామని చెప్పారు.

మసూద్ అజర్‌కు చావుదెబ్బ!

జైషే మహ్మద్ చీఫ్ కుటుంబంలో 10మంది హతం

మరో నలుగురు సహాయకులు కూడా ఖతం

పశ్చాత్తాపం, భయం, బాధ లేవు కానీ..

నేనూ చనిపోయి ఉంటే బాగుండేది: అజర్

న్యూఢిల్లీ, మే 7: భారత్ జరిపిన వైమానిక దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజర్‌కు చావు దెబ్బ తగిలింది. బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కేంద్రంపై జరిగిన దాడిలో తన కుటుంబానికి చెందిన 10 మందితోపాటు, తన నలుగురు సహాయకులు కలిపి మొత్తం 14 మంది మరణించినట్టు మసూద్ అజర్ బుధవారం వెల్లడించాడు. వారు ఆనందంగా దేవుని చెంతకు చేరారన్నాడు. దీని పట్ల తనకేమీ పశ్చాత్తాపంగానీ, నిరాశగానీ లేవంటూనే.. 'ఈ దాడిలో నేను కూడా చనిపోయి ఉంటే బాగుండేది..' అని నిర్వేదం వ్యక్తం చేశాడు. మరణించిన వారిలో తన అక్క, ఆమె భర్త, మేనల్లుడు, అతని భార్య, మేనకోడలు, ఐదుగురు పిల్లలు ఉన్నారని అజర్ ప్రకటించాడు. "ఈ రోజు రాత్రి నా కుటుంబంలో పది మంది చనిపోయారు. వారిలో ఐదుగురు అమాయక పిల్లలు. ప్రాణం కంటే ఎక్కువైన నా అక్క సాహిబా, ఆమె భర్త, నా మేనల్లుడు అలీం ఫాజిల్, అతని భార్య, మేనకోడలు ఆలం ఫాజిలా, నా సోదరుడు, అతని తల్లి, నా ఇద్దరు సహచరులు.. ఆనందంగా దేవుని చెంతకు చేరారు. వారికి సమయం వచ్చింది. కానీ.. ఆ దేవుడు వారిని చంపలేదు" అని అజర్ వెల్లడించారు. వారి అంతిమ సంస్కారాల్లో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చాడు.



పశ్చాత్తాపం లేదు: అజర్

'అమాయకులైన చిన్నారులు, మహిళలు, వృద్ధులను మోదీ టార్గెట్ చేశారు. దుఃఖం, దిగ్భ్రాంతి భరించలేనంత గొప్పవి. కానీ.. ఈ మరణాల పట్ల పశ్చాత్తాపం లేదు. నిరాశ లేదు.. భయం లేదు. ఈ 14 మందిలో నేను కూడా ఉండివుంటే బాగుండేదని మాత్రం పదే పదే అనిపిస్తోంది. కానీ.. అల్లాను కలిసే సమయం ముందే రాసి పెట్టి ఉంటుంది. మా ఇంట్లో 3 నుంచి 7 ఏళ్ల వయసున్న పిల్లలున్నారు. వారంతా కలిసి స్వర్గానికి వెళ్లారు. భగవంతుడు తాను ప్రేమించే వారికే అమరత్వం ఇస్తాడని ఖురాన్ చెబుతోంది. ఇప్పుడు వాళ్లకు సమయం వచ్చింది. జరగబోయేది ఎవరూ ఊహించలేరు" అని అజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు.

భారత్‌పై దాడులకు కుట్ర

56 ఏళ్ల మసూద్ అజర్.. 2001లో భారత పార్లమెంటుపై దాడి, 2008లో ముంబై దాడులు, 2016 పఠాన్‌కోట్ దాడి, 2019లో పుల్వామా దాడితో సహా భారత్‌లో జరిగిన అనేక ఉగ్రదాడుల కుట్రలో భాగస్వామిగా ఉన్నాడు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి కూడా ఆయనను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. మసూద్ అజర్ పాకిస్థాన్‌లో తలదాచుకున్నాడన్నది బహిరంగ రహస్యమే. అయితే పాక్ మాత్రం అతనికి సంబంధించిన సమాచారం ఏదీ తమ వద్ద లేదని పదే పదే చెబుతూ వస్తోంది.




క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఉగ్రవాదాన్ని సహించేది లేదు!

» క్యాబినెట్ భేటీలో మోదీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, మే 7: ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రధాని మోదీ మరోసారి నొక్కి చెప్పారు. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా ఉపేక్షించకూడదని వ్యాఖ్యానించారు. బుధవారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతం చేసిన భద్రతా దళాలపై మోదీ ప్రశంసలు గుప్పించారు. భేటీలో తొలుత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఆపరేషన్ సిందూర్' జరిగిన తీరును మంత్రులకు వివరించారు. మంత్రులు బల్లపై చరుస్తూ తమ అభినందనలు తెలిపారు. ఇక ఆపరేషన్ సిందూర్ అనంతర పరిణామాల జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. మరోవైపు 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ప్రధాని మోదీ యూరప్ పర్యటన రద్దయింది. ఈనెల మధ్యలో క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్ దేశాల్లో మోదీ పర్యటించాల్సి ఉంది.


కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఖర్గే, రాహుల్‌గాంధీ

పాక్‌పై పోరాటంలో సైన్యానికి కాంగ్రెస్ మద్దతు

» భద్రతా బలగాలకు సంపూర్ణ మద్దతు: ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, జైరాం రమేష్, పార్టీ సీనియర్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాకిస్థాన్‌కు దీటైన సమాధానం ఇచ్చిన భారత దళాలను చూసి కాంగ్రెస్ గర్విస్తోందని ఖర్గే చెప్పారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత విధానం స్పష్టంగా, దృఢంగా ఉందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టే చర్యలకు సీడబ్ల్యూసీ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భారత భద్రతా బలగాలకు తమ పూర్తి మద్దతు ఉందన్నారు. రక్షణ దళాలకు పూర్తి మద్దతు ఇవ్వాలని సీడబ్ల్యూసీ భేటీ నిర్ణయించినట్లు రాహుల్ తెలిపారు.

సైన్యం చరిత్ర సృష్టించింది: రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, మే 7: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం చరిత్ర సృష్టించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. ఉగ్రవాదానికి దీటైన జవాబిచ్చే హక్కును భారత్ ఉపయోగించుకుందన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పౌరులకు ఇబ్బంది కలగకుండా, ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా కచ్చితత్వంతో ఆపరేషన్ నిర్వహించినట్లు రాజ్‌నాథ్ చెప్పారు. పహల్గాంలో అమాయక పౌరులను పొట్టనపెట్టుకున్న వారినే ఆపరేషన్ సిందూర్ ద్వారా మట్టుబెట్టామన్నారు. ఇది భారత సైనికుల సత్తాను ప్రపంచానికి చాటిందన్నారు.


ఉద్రిక్తత పెంచే యత్నం చేస్తే గట్టిగా బదులిస్తాం

» పాక్ విషయంలో అజిత్ డోభాల్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ, మే 7: పాకిస్థాన్ కనుక ఉద్రిక్తతలు పెంచితే మరింత గట్టిగా బదులు చెప్పేందుకు సిద్ధమని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ స్పష్టం చేశారు. అమెరికా, బ్రిటన్, రష్యా, చైనా, సౌదీ అరేబియా, జపాన్, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులకు ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదని, పరిస్థితులను తీవ్రతరం చేసేందుకు పాక్ యత్నిస్తే మరింత తీవ్రంగా ప్రతిస్పందన ఉంటుందన్నారు. రానున్న రోజుల్లోనూ ఎప్పటికప్పుడు సమాచారం పంచుకుంటామని వారికి వివరించారు.

దేనికైనా సిద్ధంగా ఉండాలి: చంద్రబాబు



అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అన్ని స్థాయిల్లో అధికారులు, సంస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బుధవారం సివిల్ డిఫెన్స్ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తీసుకున్నంటున్న భద్రతా చర్యలు, సన్నద్ధతపైన మాక్ డ్రిల్స్ నిర్వహణ, ప్రస్తుత పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడంపై చర్చించారు. ఇలాంటి సమయంలో అన్ని శాఖలు అత్యంత సమన్వయంతో పని చేయాలని, ప్రజలు ఆందోళన చెందకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కాగా బుధవారం తెల్లవారుజామున 3 గంటలకే సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. భారత సాయుధ దళాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చెబుతూ తనను తాను రక్షించుకునే సామర్థ్యం భారతదేశానికి ఉందని ఉక్కు సంకల్పంతో చాటారంటూ ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచానికి మన బలాన్ని.. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలన్న కృతనిశ్చయాన్ని చాటి చెప్పామని పేర్కొన్నారు.

చివరి ఉగ్రవాదినీ అంతం చేయాలి: పవన్



'చివరి ఉగ్రవాదిని అంతం చేసే వరకు ఆపరేషన్ సిందూర్ ఆగకూడదు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో అన్నారు. 'ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే నిర్ణయానికి భారతీయుల సంపూర్ణ మద్దతు ఉంటుంది. ఈ కీలక సమయంలో దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలిచి, ఐక్యతను ప్రదర్శించాలి. దేశంపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు తీవ్రంగా పరిగణించాలి. భారత సైన్యం చర్యలకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసే వారిపై కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటుంది. సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా కుక్కల్లా మొరగవద్దు. దేశాన్ని సెలబ్రిటీలు నడిపించడం లేదు. వారు కూడా బాధ్యతగా, దేశ సమగ్రతను కాపాడేలా మాట్లాడాలి' అని పవన్ అన్నారు.

సంయమనం పాటించండి

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాక్‌కు ప్రపంచ దేశాల పిలుపు

» ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తాం : చైనా

» ఉద్రిక్తతలు త్వరగా చల్లారాలి: ట్రంప్

» భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ప్రపంచం తట్టుకోలేదు : ఐరాస

» చర్చలకే మొగ్గు చూపాలన్న రష్యా, యూఏఈ, జపాన్, యూకే



న్యూఢిల్లీ, మే7: ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ దేశాలు స్పందించాయి. భారత్, పాక్ సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని చైనా వ్యతిరేకిస్తుందని ఆ విదేశీ వ్యవహారాల శాఖ అధికారి ప్రతినిధి ఒకరు చెప్పారు. "భారత సైనిక చర్యపై విచారం వ్యక్తం చేస్తున్నాం. భారత్, పాకిస్థాన్ ఎప్పటికీ దాయాది దేశాలే. చైనాకూ పొరుగు దేశాలే. అన్నిరకాల ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుంది. భవిష్యత్తు పరిణామాలను పరిగణనలోకి తీసుకొని ఇరుదేశాలు సంయమనం పాటించాలి" అని పేర్కొన్నారు.

సంయమనం పాటించాలి..

భారత్, పాక్ సాధ్యమైన మేర సంయమనం పాటించాలని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెరెస్ పిలుపునిచ్చారు. భారత్ చేపట్టిన సైనిక చర్య పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారత్, పాక్ పరస్పర సైనిక చర్యలకు దిగితే ప్రపంచం తట్టుకోలేదని పేర్కొన్నారు. భారత ఆపరేషన్‌పై రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. 1999 లాహోర్ డిక్లరేషన్, 1972 సిమ్లా ఒప్పందాలను అనుసరిస్తూ దౌత్య చర్చల ద్వారా ఇరుదేశాలు సమస్యను పరిష్కరించుకోవాలని ఆశిస్తున్నామని రష్యా విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి పేర్కొన్నారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు బ్రిటన్ సహా చాలా దేశాలకు ఆందోళనకరమని, ఇరుదేశాలు సంయమనం పాటించాలని బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ చెప్పారు. కాగా, భారత్, పాక్ శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆశిస్తున్నామని యూఏఈ పేర్కొంది. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైతే అది ప్రపంచ శాంతికి కూడా ముప్పేనని, అందువల్ల ఉద్రిక్తతలు మరింత తీవ్రమవ్వకుండా ఇరుదేశాలు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని యూఏఈ ఉప ప్రధాని షేక్ అబ్దుల్ బిన్ జాయద్ ఓ ప్రకటన చేశారు. భారత్ పాకిస్థాన్ మధ్య ప్రతీకార దాడులు తీవ్రమైతే పరిస్థితి యుద్ధానికి దారి తీస్తుందని జపాన్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్, పాక్ మధ్య నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇరుదేశాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని జపాన్ చీఫ్ క్యాబినెట్ సెక్రటరీ యోషిమసా హయాషీ కోరారు.

ఉద్రిక్తతలు త్వరగా చల్లారాలి

ఇక, భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగడం దురదృష్టకరమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో అన్నారు. ఇరుదేశాలు వందల ఏళ్లుగా పోరాడుతున్నాయని, గత అనుభవాల ప్రకారం ఏదో ఒకటి జరగబోతుందని ప్రజలకు ముందే తెలుసునని అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు త్వరగా చల్లారాలని ఆకాంక్షించారు. భారత్, పాక్ మధ్య నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో పేర్కొన్నారు.

మిత్రులకు ముందే చెప్పి!

'ఆపరేషన్ సిందూర్'పై విస్తృత స్థాయిలో దౌత్య చర్చలు

» అమెరికా, రష్యా, సౌదీ, యూఏఈ, యూకే, ఫ్రాన్స్‌తో భారత్ మంతనాలు

» ఏకంగా కాబూల్ వెళ్లి తాలిబాన్లతో చర్చలు


ముజఫరాబాద్‌లో శిథిలమైన భవనం

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడికి ఎదురు దాడి తప్పదని మిత్రదేశాలకు భారత్ ముందుగానే స్పష్టంచేసింది. అయితే కేవలం ఉగ్రవాద స్థావరాల ధ్వంసం వరకే పరిమితమవుతామని వాటికి తెలియజేసింది. ప్రతీకారం తన హక్కు అని అవి గుర్తించేలా దౌత్యపరంగా విస్తృత కసరత్తే చేపట్టింది. దీని వల్లే పాకిస్థాన్‌కు ఎల్లప్పుడూ మద్దతిచ్చే సౌదీ అరేబియా, యూఏఈ కూడా ఈసారి భారత్‌కు వెన్నంటి నిలిచాయి. అమెరికా, రష్యా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని మోదీకి ఫోన్‌చేసి మరీ మద్దతు తెలిపారు. ఇక ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ద్వారా భారత్‌ను దోషిగా చిత్రించేందుకు పాక్ విఫలయత్నం చేసిన సంగతి తెలిసిందే. లష్కర్, దాని అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫోర్స్ పాక్ భూభాగం నుంచే కార్యకలాపాలు నడుపుతున్నాయా లేదా అని మండలి సభ్యదేశాలు దానిని నిలదీశాయి. ఆ దేశానికి మిత్రపక్షం చైనా కూడా మద్దతి వ్వకపోవడం గమనార్హం. మండలిలోని తాత్కాలిక సభ్య దేశాలైన అల్జీరియా, డెన్మార్క్, గ్రీస్, గయానా, పనామా, దక్షిణ కొరియా, సియెర్రా లియోన్, స్లొవేనియా, సొమాలియా ప్ర తినిధులలతోనూ భారత దౌత్యవేత్తలు గోప్యంగా చర్చించి వాస్తవాలను వాటి దృష్టికి తీసుకెళ్లారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆయా దేశాల విదేశాంగ మంత్రులను ఫోన్ల ద్వారా సంప్రదిస్తూ వచ్చారు. చివరకు ఇండియా ఇప్పటివరకు గుర్తించని అఫ్ఘానిస్థాన్ పాలకులైన తాలిబాన్లతోనూ చర్చించి వారి మద్దతు పొందడం దౌత్యపరంగా పెద్దవిజయమే. విదేశాంగ సంయుక్త కార్యదర్శి (పాక్, అఫ్ఘాన్, ఇరాన్ వ్యవహారాలు) ఆనంద్ ప్రకాశ్ గత నెల 28న చడీచప్పుడు లేకుండా తన బృందంతో నేరుగా కాబూల్ వెళ్లారు. తాలిబాన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముతాఖీతో భేటీఅయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. అఫ్ఘాన్ ఎవరికీ శత్రువు కాదని ముతాఖీ పునరుద్ఘాటించారు.

అమెరికా, రష్యాతో చర్చలు..

అటు విదేశాంగ మంత్రి జైశంకర్ అమెరికా, రష్యా విదేశాంగ మంత్రులు మార్కో రుబియో, సెర్గీ లావ్రోవ్‌తో, ఐరోపా దేశాల నేతలతో నిరంతరం ఫోన్లో చర్చలు జరిపారు. ప్రతీకార దాడి నిర్దిష్టంగా ఎలా ఉండబోతోందో అమెరికాకు ముందే వివరించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయల్ మేక్రాన్ మోదీకి ఫోన్‌చేసి చర్చలు జరిపారు. జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకతానీ భారత్‌కు వచ్చి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. భారత దౌత్య చర్యల ఫలితంగా మిత్రదేశాలన్నీ.. పహల్గాం దాడికి పాల్పడినవారికి, వారికి మద్దతిచ్చినవారికి శిక్షలు పడాలని డిమాండ్ చేశాయి. అయితే భారత్ యుద్ధానికి దిగితే అణ్వస్త్రాలు ప్రయోగిస్తామని పాక్ మంత్రులు పదే పదే బెదిరింపులకు దిగడం ఆ దేశానికి ప్రతికూలంగా మారిందని.. ప్రతీకార హక్కు ఇండియాకు ఉందని మిత్రదేశాలు బహిరంగంగానే ప్రకటించడం ప్రభుత్వ దౌత్యవిజయమని మాజీ దౌత్యవేత్తలు, విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు.. సర్వకాల సర్వావస్థల్లో పాకిస్థాన్‌ను వీడని చైనా.. పహల్గాం దాడి తర్వాత మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మళ్లీ ఉద్రిక్తతలతో మొదటికే మోసం వస్తుందని అంచనా వేస్తూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

- సెంట్రల్ డెస్క్



పాక్ గగనతలం ఖాళీ!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పాక్‌పై భారత్ దాడులతో ఆ దేశ గగనతలం ఖాళీ అయిపోయింది. గల్ఫ్ విమానయాన సంస్థలన్నీ పాకిస్థాన్‌కు తమ విమానాలను రద్దు చేశాయి. అమెరికా, యూరప్ దేశాల నుంచి భారత్‌కు, ఇతర దేశాలకు వెళ్లే విమానాలన్నింటినీ కూడా పాక్ గగనతలానికి దూరంగా అరేబియా సముద్రం మీదుగా మళ్లిస్తున్నారు. భారత్ తప్ప మిగతా అన్ని దేశాల విమానాలకు పాక్ అనుమతి ఇచ్చినా కూడా ఈ మళ్లింపు కొనసాగుతుండటం గమనార్హం. అదే సమయంలో పాక్ సరిహద్దులకు సమీప ప్రాంతాలు మినహా భారత గగనతలం అంతటా విమానాల ప్రయాణాలు కొనసాగాయి. ప్రపంచవ్యాప్తంగా విమాన రాకపోకల సమాచారాన్ని ప్రచురించే ఫ్లైట్ రాడార్24 సంస్థ దీనికి సంబంధించిన చిత్రాన్ని విడుదల చేసింది. బుధవారం పాక్ గగనతలంలో నాలుగే పౌర విమానాలు ప్రయాణించగా.. భారత్‌లో వందల విమానాలు ప్రయాణించడం గమనార్హం.

సిద్దరామయ్య సిందూరం

నుదుట కుంకుమతో మీడియా ముందుకొచ్చిన సీఎం



బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య నుదుటన సిందూరం పెట్టుకుని మీడియా ముందుకు వచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం దీటుగా బదులిచ్చిందని కొనియాడారు. సాధారణంగా ఆయన కుంకుమ పెట్టుకునేందుకు ఆసక్తి చూపరు. గుడికి వెళ్లినప్పుడు మాత్రమే కాసేపు ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీఎం రాయచూరు జిల్లా పర్యటనను రద్దు చేసుకుని బెంగళూరులోనే ఉన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్ తన సామర్థ్యాన్ని చాటిచెప్పిందని అన్నారు.



'పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మన రక్షణ దళాలు దాడులు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. పహల్గాం తరహా ఘటన మరోసారి పునరావృతం కాకుండా పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాలి. పాక్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలి.'

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ

ఏంటీ.. మీ దేశంలో ఉగ్ర క్యాంపులు లేవా?

» ఉగ్రవాదాన్ని పెంచి పోషించామని మీ రక్షణ మంత్రే చెప్పారు

» పాక్ చరిత్రలో ఉగ్రవాదం భాగమని మీ విదేశాంగ మంత్రి అన్నారు

» లాడెన్ దాక్కున్నది పాక్‌లోనే కాదా?

» పాక్ సమాచార మంత్రి తరార్‌పై స్కై న్యూస్ యాంకర్ ప్రశ్నల క్షిపణులు

» నీళ్లు నమిలిన పాక్ మంత్రి


యాంకర్ యాల్దా హకీమ్,


పాక్ మంత్రి తరార్

న్యూఢిల్లీ, మే 7: పాకిస్థాన్‌లో ఉగ్రవాద క్యాంపులు లేనే లేవని, భారతదేశం ఉద్దేశపూర్వకంగానే పాకిస్థాన్ ప్రజల ఆవాసాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడిందని ప్రపంచాన్ని నమ్మించేందుకు ప్రయత్నించి ఆ దేశ సమాచార, ప్రసార శాఖ మంత్రి తరార్ భంగపడ్డారు. తాను ఇంటర్వ్యూ ఇచ్చిన యాంకర్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత బుధవారం ఉదయం 7గంటల సమయంలో తరార్ హడావుడిగా అమెరికాకు చెందిన ప్రముఖ వార్తా ఛానల్ స్కై న్యూస్ యాంకర్ యాల్దా హకీమ్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. పాకిస్థాన్ ప్రజల ఆవాసాలపై భారత్ దాడులు చేసిందని, అవి పౌరుల ఆవాసాలే అని చెప్పేందుకు తన వద్ద అన్ని ఆధారాలున్నాయని, ఆ ఫొటోలు కూడా ఇస్తానని యాంకర్‌తో అన్నారు. ఆ ఫొటోలు నిజమైనవా..కావా అన్నది నిర్ధారించుకున్న తర్వాతనే ప్రసారం చేస్తామని యాంకర్ అన్నారు. నమ్మకం లేకపోతే, గురువారం జర్నలిస్టులను భారత్ దాడులు చేసిన ప్రాంతాలకు తీసుకువెళ్తానని, మీరు కూడా రావాలని, విమానంలో అన్ని ప్రాంతాలు తిరిగి చూడాలని తరార్ స్కై న్యూస్ యాంకర్‌ను కోరారు. దీనిపై, యాంకర్ యాల్దా స్పందిస్తూ.. గతంలో భారత్ ఇదే ప్రాంతాల్లో ఉగ్ర స్థావరాలున్నాయని చెప్పినప్పుడు పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడికి మీడియా ప్రతినిధులను ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. తాము గతంలోనే పాకిస్థాన్ సందర్శించామని, బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోనే పట్టుబడ్డ విషయం ఇంకా గుర్తుందని యాంకర్ అన్నారు. పాకిస్థాన్ ఎప్పుడూ భారత్‌పై మొదట దాడులు చేయలేదని, ఇండియానే ఎప్పుడూ ఎలాంటి ఆధారల్లేకుండా పాకిస్థాన్‌ను రెచ్చగొడుతోందని తరార్ ఇంటర్వ్యూలో అన్నారు. భారత్ దాడులపై ప్రతీకారం తీర్చుకుంటామని చెప్పారు. "భారత యుద్ధ విమానాలను కూల్చివేశాం అన్నారు. మరి ఇంకా ప్రతీకారం ఎలా తీర్చుకుంటారు" అని యాంకర్ ప్రశ్నించగా.. మిలిటరీ ఆపరేషన్ కొనసాగుతోందని ఆ విషయాలను వెల్లడించలేనని తరార్ దాటవేశారు.

యాల్దా హకీమ్ అడిగిన ప్రశ్నలు

1. తరార్.. మీ దేశంలో ఉగ్రవాద క్యాంపులే లేవు అని మీరు అంటున్నారు. మొన్న నాకు ఇంటర్వ్యూలోనే మీ దేశ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్.. "పాకిస్థాన్ దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది. అమెరికా కోసమే ఆ చెత్త పని చేశాం" అని చెప్పారు కదా. మీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో కూడా ఉగ్రవాదం పాకిస్థాన్ చరిత్రలో ఒక భాగం అన్నారు కదా.

2. లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థ పాక్ భూభాగం నుంచే ఆపరేషన్లు నిర్వహిస్తోందన్న ఆరోపణలున్నాయి. పహల్గాం దాడి తమ పనేనని లష్కరే అనుబంధ సంస్థ రెసిస్టెంట్ ఫ్రంట్ ప్రకటించింది. మీ మిలిటరీ క్యాంప్‌కు అతి దగ్గర్లోనే లాడెన్ దాక్కున్నాడు. మీకు తెలియకుండా లాడెన్‌ను అమెరికా పట్టుకున్నది. అలా రహస్య ఆపరేషన్ నిర్వహించడానికి కారణం మీపై నమ్మకం లేకపోవడమే కదా?

3. అమెరికా మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిని పాకిస్థాన్‌లోనే కదా పట్టుకున్నారు? ఉగ్రవాదానికి సహకరించకపోతే మొన్నటిదాకా పాక్ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో ఎందుకు ఉంది?

ఎల్‌వోసీ సమీపంలో కూలిన విమానం!

కశ్మీరులోని పుల్వామా జిల్లా వయున్‌లో ఘటన

» అది ఎవరి విమానమనే సందేహాలు

» ఎలాంటి ప్రకటనా చేయని భారత్, పాక్


పుల్వామాలో కూలిన జెట్ విడిభాగం వద్ద స్థానికులు

శ్రీనగర్, మే 7: జమ్మూకశ్మీరులోని పుల్వామా జిల్లా పాంపోర్ సమీపంలో బుధవారం ఉదయం ఓ విమానం కూలిపోయింది. మంగళవారం అర్ధరాత్రి పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన నేపథ్యంలో విమానం కూలడం గమనార్హం. ఆ విమానం ఎవరిదనే విషయంలో స్పష్టత లేదు. భారత్ కానీ, పాకిస్థాన్ కానీ దీనిపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. అయితే భారత్‌కు చెందిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థ గగనతల లక్ష్యాలను ఛేదిస్తున్న వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టింది. విమానం కూలిన ఘటనలో ఆకాశ్ క్షిపణి పాత్ర కూడా ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విమానం కూలిన వయున్ ప్రాంతం ఎల్‌వోసీకి సమీపంలో ఉంది. అక్కడ భారత్, పాక్ సైనిక కార్యకలాపాలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. ఈ ఘటనపై స్థానిక కశ్మీరీలు 19 నిమిషాల నిడివి గల ఓ వీడియోను చూపుతున్నారు. అందులో మంటల్లో చిక్కుకున్న విమాన శకలాలు కనిపించాయి. అందులో 14వ నిమిషం వద్ద 'మేడిన్ ఇండియా' విమానం అన్న మాటలు ఉండడంతో అది భారత్‌కు చెందిన విమానమేనన్న ఊహాగానాలు వినిపించాయి. మరోవైపు కూలిన విమానం పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్-17 లేదా ఎఫ్-16 అని, భారత బలగాలు కూల్చివేశాయని కొందరు నెటిజన్లు ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. మరికొందరు అది భారత విమానమని, పాక్ దాన్ని కూల్చేసిందని పోస్టులు పెట్టారు. అఖ్నూర్, రాంబన్‌లలో కూడా రెండు విమానాలు కూలాయన్న వార్తలు వచ్చాయి. మూడు భారత విమానాలను కూల్చామన్న పాక్ ప్రకటనల నేపథ్యంలో ఈ వార్తలు వచ్చాయి. కానీ, వీటిని ఎవరూ నిర్ధారించలేదు. ఐడీఆర్‌డబ్ల్యూ వెబ్‌సైట్ ఏఎఫ్‌ఐని ఉటంకిస్తూ కథనం ప్రచురించింది.

ఆకాశ్ పాత్ర ఉందా?

ఊహాగానాలకు బలం చేకూర్చేలా మరో వీడియో తెరపైకి వచ్చింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి గగనతల లక్ష్యాలను ఛేదించే మధ్యశ్రేణి ఆకాశ్ క్షిపణిని ప్రయోగించినట్లు ఆ వీడియోలో పేర్కొన్నారు. శత్రువుల విమానాలు, డ్రోన్లను (45 కి.మీ. దూరం వరకు) గగనతలంలోనే కూల్చివేసేలా దీన్ని రూపొందించారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఆకాశ్ క్షిపణి వ్యవస్థను ఎల్‌వోసీ వెంట మోహరించారు. ఈ క్షిపణి ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగలదు. పాంపోర్‌లో విమానం కూల్చివేసిన ఘటనలో ఈ క్షిపణి ప్రమేయం ఉందా? లేదా? అన్న విషయంలో స్పష్టత రాలేదు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత గగనతల రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేశారన్న విషయం మాత్రం స్పష్టమవుతోంది.



ఆపరేషన్ సిందూర్

యుద్ధం చాలా ఖరీదు

భరించడం పాక్‌కు అసాధ్యం

టెక్నాలజీ పెరగడం వల్ల అనేక అత్యాధునిక ఆయుధాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటి ఖరీదు మాత్రం చాలా ఎక్కువ. తాజాగా ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఉపయోగించిన ఆయుధాల్లో అత్యధికం చాలా ఖరీదైనవి. ఉగ్రవాదుల్ని పంపి అమాయక ప్రజలపై దాడులు చేసి చంపుతున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడం కోసం ఎంత వ్యయమైనా భరించడానికి భారత్ సిద్ధంగా ఉంది. ఒకవేళ ఈ దాడి మరింత పెద్ద యుద్ధానికి దారితీసినా ఎదుర్కోగల అర్థ బలం భారత్‌కు ఉంది. కానీ పాకిస్థాన్ పరిస్థితి అలా కాదు. పాక్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఉంది. యుద్ధంలో కీలకమైన 155ఎంఎం షెల్స్ పాక్ వద్ద చాలా తక్కువగా ఉండడంతో టర్కీని బతిమలాడి వాటిని దిగుమతి చేసుకుంది. పాక్‌లో ఇతర మందుగుండుకు కూడా కొరత ఉంది. యుద్ధంలో అత్యంత కీలకమైన చమురు నిల్వలూ సరిపడా లేవు. ఇవన్నీ కొనేందుకు డబ్బు కూడా లేదు. పూర్తిస్థాయి యుద్ధం అంటూ వస్తే అందుకు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. తాజా దాడిలో భారత్ ఉపయోగించిన ఆయుధాల ధరలను ఒక్కసారి పరిశీలిస్తే యుద్ధం ఎంత ఖరీదైనదో అర్థమవుతుంది.

స్కాల్ప్ క్షిపణి ఒక్కోటీ రూ.8.5 కోట్లు
బ్రహ్మోస్ క్షిపణి ఒక్కోటీ రూ.34 కోట్లు
హ్యామర్ బాంబు ఒక్కోటీ రూ.70 లక్షలు
పినాక రాకెట్ ఒక్కోటీ 70 లక్షలు
155 ఎంఎం షెల్ ఒక్కోటీ 33 వేలు

(155 ఎంఎం షెల్స్ ఖరీదు తక్కువ కావడంతో పాక్ ఎక్కువగా వాటితోనే భారత్‌పై దాడులు చేస్తోంది)

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

శతఘ్నులు, రాకెట్లు

అంతర్జాతీయ సరిహద్దు, ఎల్‌వోసీ సమీపంలోని లక్ష్యాలపై దాడి చేయడానికి 155 ఎంఎం శతఘ్నుల్ని, పినాక రాకెట్లను భారత్ ఉపయోగించినట్లు సమాచారం. శతఘ్నుల ద్వారా 40-50 కిలోమీటర్లు, పినాక రాకెట్ల ద్వారా 90 కిలోమీటర్ల లోని లక్ష్యాలపై దాడి చేసే అవకాశం ఉంది.



సిందూరాస్త్రాలివే!

రాఫెల్ విమానాలు, హెరాన్ డ్రోన్లతో గాలిలో నుంచి దాడులు

ఎగిరే బాంబులు, శతఘ్నులతో భూతల దాడులు

బ్రహ్మోస్ క్షిపణులు కూడా ప్రయోగించిన భారత్?





పహల్గాం దాడులకు ప్రతీకారంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్, పీవోకేలోని 9 లక్ష్యాలపై భారత్ దాడులు చేసింది. ఏకంగా తొమ్మిది చోట్ల దాడులు జరిగినప్పటికీ అవన్నీ కేవలం 25 నిముషాల్లోపే ముగిశాయి. ఒకచోట దాడి జరిగిన సమాచారం మరోచోటికి తెలిస్తే అక్కడి వారు జాగ్రత్త పడతారనే ఉద్దేశంతో ఆ అవకాశం ఇవ్వకుండా ఒకేసారి పక్కా ప్లాన్‌తో అన్నిచోట్లా మెరుపు దాడి చేసింది. అందుకే కీలకమైన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టగలిగింది. ఇంత తక్కువ సమయంలో ఇన్ని చోట్ల దాడులు జరగడాన్ని బట్టి చూస్తే భారత్ అనేక ఆయుధాలను ఈ ఆపరేషన్‌కు వినియోగించినట్లు స్పష్టమవుతోంది. భారీఎత్తున యుద్ధ విమానాలు, డ్రోన్లు, శతఘ్నులు, క్షిపణులతోపాటు లాయిటరింగ్ మ్యూనిషన్లను కూడా ఈ దాడుల్లో ఉపయోగించినట్టు తెలుస్తోంది. పాక్ సరిహద్దు దాటకుండానే, పాక్ గగనతలంలోకి ప్రవేశించకుండానే భారత్ లాంగ్‌రేంజ్ ఆయుధాలతో భారత్ ఈ దాడులు చేసింది. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రాఫెల్ యుద్ధ విమానాలది ఈ దాడుల్లో ప్రధాన పాత్ర అని రక్షణ నిపుణులు చెబుతున్నారు. భారత్ వద్ద 36 రాఫెల్ యుద్ధ విమానాలు ఉండగా హర్యానాలోని అంబాలాలో 18, బెంగాల్‌లోని హషిమారాలో మరో 18 విమానాలను మోహరించి ఉంచారు. అంబాలా ఎయిర్‌బేస్‌లోని రాఫెల్ విమానాలను ఈ దాడుల్లో ఉపయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు. రాఫెల్ విమానాలను భారత్ ఒక దాడిలో ఉపయోగించడం ఇదే ప్రప్రథమం. అలాగే కామికాజె డ్రోన్లను, బ్రహ్మోస్ క్షిపణులను కూడా తొలిసారిగా శత్రువులపై వాడినట్లు సమాచారం. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఉపయోగించిన ఆయుధాలేమిటో పరిశీలిద్దాం.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

హ్యామర్ బాంబులు

హైలీ ఎజైల్ మాడ్యులర్ మ్యూనిషన్ ఎక్స్‌టెండెడ్ రేంజ్ (హ్యామర్) బాంబులను కూడా రాఫెల్ విమానాలతోపాటే భారత్ కొనుగోలు చేసింది. భూవిపై ఉన్న కదిలే, కదలని లక్ష్యాలపై దాడుల కోసం వీటిని ఉపయోగిస్తారు. వీటి రేంజ్ 60 కిలోమీటర్ల వరకూ ఉంటుంది. ఇందులో 250, 500, 1000 కిలోల వెర్షన్లు ఉన్నాయి. స్కాల్ప్ క్షిపణుల్లాగే ఇవి కూడా గట్టి కాంక్రీట్ నిర్మాణాలను ధ్వంసం చేయగలవు.

రాఫెల్ యుద్ధ విమానాలు

ఫ్రాన్స్ నుంచి భారత్ 36 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసింది. 4.5 తరం యుద్ధ విమానాల్లో ఇవి అత్యాధునికమైనవి. స్టెల్త్ విమానాలు కాకపోయినా వీటిలో కొన్ని స్టెల్త్ ఫీచర్లు ఉన్నాయి. శత్రు రాడార్ల కన్నుగప్పి చొచ్చుకువెళ్లగలవు. శత్రు రాడార్లను, విమాన విధ్వంసక క్షిపణి వ్యవస్థల్ని స్తంభింపజేయగల ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు ఇందులో ఉన్నాయి. భారత యుద్ధ విమానాలు పాక్ సరిహద్దు దాటకపోయినా సరిహద్దు సమీపంలోకి వెళితే చాలు పాక్ విమాన విధ్వంసక వ్యవస్థలు అలర్ట్ అవుతాయి. కానీ వాటి కళ్లుగప్పడంలో రాఫెల్ విజయవంతమైందని రక్షణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కామికాజె డ్రోన్లు

వీటినే లాయిటరింగ్ మ్యూనిషన్లు అని కూడా అంటారు. అంటే ఎగిరే బాంబులు అన్నమాట! ఇవి నేలపై నుంచి తక్కువ ఎత్తులో ఎగురుతూ టార్గెట్‌ను పరిశీలిస్తూ అనువైన సమయంలో వాటిపై పడి ధ్వంసం చేస్తాయి. భారత్ నాగాస్త్ర -1, ఎల్‌ఎం 0, ఎల్‌ఎమ్ 1, హెక్సాకాప్టర్ వంటి లాయిటరింగ్ మ్యూనిషన్లను పరీక్షించింది. వీటిని తాజా దాడిలో ప్రయోగాత్మకంగా ఉపయోగించి ఉండవచ్చని కొందరు రక్షణ నిపుణులు అంటున్నారు.

బ్రహ్మోస్ క్షిపణులు

భారత్-రష్యా సంయుక్తంగా రూపొందించిన సూపర్‌సానిక్ క్రూజ్ క్షిపణి బ్రహ్మోస్. ధ్వని వేగానికి దాదాపు మూడు రెట్ల వేగంతో ప్రయాణించి శత్రు భూభాగంపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగలదు. భారత త్రివిధ దళాలు ఈ క్షిపణిని ఉపయోగిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో ఆర్మీ వీటిని వాడినట్లు చెబుతున్నారు. మొదట ఈ క్షిపణుల రేంజ్ 290 కిలోమీటర్లు మాత్రమే ఉండేది. తర్వాత దీనిని 500 కిలోమీటర్లకు పెంచారు.



హెరాన్ డ్రోన్లు



ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన ఈ డ్రోన్లలో మార్క్ 1, 2 అనే రెండు వెర్షన్లు ఉన్నాయి. మొదటిది కేవలం నిఘా కోసం మాత్రమే ఉపయోగిస్తారు. రెండో వెర్షన్ బాంబులు కూడా ప్రయోగించగలదు. మార్క్ 2 వెర్షన్ భారత్ వద్ద ఉన్నప్పటికీ వాటికి బాంబులను అమర్చే ప్రక్రియ జరగలేదని ఇప్పటివరకూ ఉన్న సమాచారం. తాజా దాడుల్లో కొన్ని డ్రోన్లు కూడా పాలు పంచుకున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నదానిని బట్టి చూస్తే భారత్ వీటికి బాంబులు అమర్చి ఉండవచ్చనే అభిప్రాయాన్ని కొందరు రక్షణ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అయితే హెరాన్ డ్రోన్లు టార్గెట్లను గుర్తించి వాటిపై లేజర్ కిరణాలను ప్రసరింపజేస్తాయని, దాని ఆధారంగా రాఫెల్ యుద్ధ విమానాలు ఆ టార్గెట్లపై దాడి చేసి ఉండవచ్చని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. ఈ డ్రోన్లు 30,000 అడుగుల ఎత్తులో 45 గంటలపాటు గాలిలో ఎగురుతూ నేల మీద ఏం జరుగుతున్నదీ పరిశీలించగలవు.



స్కాల్ప్ క్రూజ్ క్షిపణులు:

రాఫెల్ విమానాల నుంచి ప్రయోగించగల ఈ స్కాల్ప్ క్షిపణుల్ని భారత్ ఆ విమానాలతో పాటే కొనుగోలు చేసింది. ఇవి 250 నుంచి 500 కిలోమీటర్ల దూరంలో భూమిపై ఉన్న లక్ష్యాలను ఛేదించగలవు. శత్రు రాడార్లకు కనిపించకుండా ప్రయాణించే స్టెల్త్ సామర్థ్యంతోపాటు భూమికి సమాంతరంగా ఒకే ఎత్తును మెయింటెయిన్ చేయగల సత్తా వీటికి ఉంది. అంటే కింద కొండ ఉంటే క్షిపణి పైకి లేస్తుంది. కింద లోయ ఉంటే కిందికి దిగుతుంది. ఇది 450 కిలోగ్రాముల టాండెమ్ వార్ హెడ్ కలిగి ఉంటుంది. టాండెమ్ అంటే ముందు ఒక పేలుడు జరిగి క్షిపణి కొంతదూరం చొచ్చుకువెళ్లాక రెండో పేలుడు జరుగుతుంది. దీనివల్ల ఎంత గట్టి కాంక్రీట్ నిర్మాణాలైనా ధ్వంసం అవుతాయి.

సిందూరానికి గౌరవంగా..

మహిళా శక్తిని చాటేలా..

'ఆపరేషన్ సిందూర్' వివరాలను వెల్లడించిన ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ.. వాయుసేన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

- భారీ ఆపరేషన్ వివరాలను మహిళా అధికారులు వెల్లడించడం ఇదే తొలిసారి
- అదే వేదికపై కశ్మీరీ పండిట్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ
- వ్యూహాత్మకంగా ప్రెస్‌మీట్



న్యూఢిల్లీ, మే 7: పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ గట్టిగా బదులు తీర్చుకోవడమే కాదు.. ఆ దాడి వివరాలను వెల్లడించిన తీరుతోనూ పాకిస్థాన్‌కు బలమైన సంకేతాలు పంపింది. ఇద్దరు మహిళా అధికారులు ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ, వాయుసేన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.. 'ఆపరేషన్ సిందూర్' వివరాలను వెల్లడించారు. ఈ సమయంలో వారి వెంట విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఉన్నారు. బైసరన్‌లో ఉగ్రవాదులు పర్యాటకుల్లో పురుషులను వాళ్ల భార్యల కళ్లముందే దారుణంగా కాల్చేయడం.. తమనూ చంపేయాలని వారు బాధతో వేడుకుంటే.. 'వెళ్లి మోదీకి చెప్పుకోండి' అంటూ ఘాటుగా మాట్లాడిన విషయం తెలిసిందే. భారత్ చేసిన దాడి వివరాలనూ నాటి ఘటనకు దీటైన జవాబుఇచ్చే తరహాలోనే వెల్లడించడం గమనార్హం.

ఆ మహిళల త్యాగాలను గౌరవిస్తూ..

భారత్‌లో వివాహిత మహిళల సంప్రదాయానికి, మనోభావాలకు చిహ్నమైన సిందూరం పేరుతోనే.. దాడులకు 'ఆపరేషన్ సిందూర్' అని పేరుపెట్టడం.. పహల్గాం దాడిలో భర్తలను కోల్పోయిన మహిళల త్యాగాన్ని గౌరవించడమేనని రక్షణ వర్గాలు చెబుతున్నాయి. భారత్ చేసిన భారీ దాడులకు సంబంధించిన వివరాలను ఇలా మహిళా అధికారులు వెల్లడించడం ఇదే తొలిసారి.

ఉగ్రవాదుల 'మత'వాదాన్ని తిప్పికొడుతూ..

బైసరన్‌లో ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్చిచంపడాన్ని ఎత్తిచూపుతూ, భారత్‌లో ఐక్యతను చాటిచెప్పేలా కూడా 'ఆపరేషన్ సిందూర్' ప్రెస్‌మీట్ ఉందన్న విశ్లేషణలూ వెలువడుతున్నాయి. భారత దాడుల వివరాలను వెల్లడించిన సోఫియా ఖురేషీ ముస్లిం వర్గానికి, వ్యోమికా సింగ్ సిక్కువర్గానికి చెందిన వారుకాగా.. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ హిందూ కశ్మీరీ పండిట్ కావడం గమనార్హం.

ఎవరీ సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్?

- గుజరాత్‌లోని వడోదరకు చెందిన సోఫియా ఖురేషీది వారసత్వంగా మిలటరీ కుటుంబమే. ఆమె తాత, తండ్రి మిలటరీలో వివిధ విభాగాల్లో పనిచేశారు. భర్త కూడా ఆర్మీ అధికారే. 1981లో జన్మించిన సోఫియా ఖురేషీ బయోకెమిస్ట్రీలో పీజీ చేసినా.. సైన్యంపై మక్కువతో 1999లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరారు. శిక్షణ అనంతరం సైన్యంలో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2006 నుంచి ఆరేళ్లపాటు కాంగో, ఇతర దేశాల్లో ఐక్యరాజ్యసమితి శాంతిదళంలో భారత్ తరఫున పనిచేశారు. 2016లో 18 దేశాల సైనిక కవాతులో భారత ఆర్మీ కంటింజెంట్‌కు నేతృత్వం వహించారు. ఇలా భారత్ తరఫున మహిళా అధికారి నేతృత్వం వహించడం అదే తొలిసారి కావడం గమనార్హం.
- సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్. వైమానిక దళంలో హెలికాప్టర్ పైలట్‌గా పనిచేస్తున్నారు. స్కూల్ స్థాయిలోనే ఎన్‌సీసీలో చురుకుగా పనిచేశారు. తన పేరుకు తగినట్టుగా ఆకాశంలో విహరించేలా పైలట్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత డిఫెన్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. 2004 వాయుసేనలో చేరారు. 2017లో వింగ్ కమాండర్‌గా పదోన్నతి పొందారు. ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్‌లో ఎత్తయిన కొండలు, పర్వత ప్రాంతాల్లో ప్రమాదకరమైన పరిస్థితుల్లో చేతక్, చీటా హెలికాప్టర్లను సమర్థంగానడిపారు. 2020 నవంబరులో అరుణాచల్ ప్రదేశ్‌లో అత్యంత క్లిష్టమైన రెస్క్యూ ఆపరేషన్‌కు నేతృత్వం వహించి మన్ననలు పొందారు. 2,500 గంటలకుపైగా హెలికాప్టర్ నడిపిన అనుభవం ఆమె సొంతం. ఆమె భర్త కూడా వైమానిక దళంలో పైలట్‌గా పనిచేస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై

నేడు అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ, మే 7: ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం జరిపిన మెరుపుదాడులపై వివరించేందుకు కేంద్రం గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని లైబ్రరీ భవనంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు.



రాష్ట్రపతితో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ, మే 7: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం పాక్‌లోని 9 ఉగ్రస్థావరాలపై నిర్వహించిన మెరుపుదాడులను గురించి వివరించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా ఫొటో జత చేసి వెల్లడించింది.



హెచ్‌క్యూ 9

చైనా సరుకు ఫెయిల్

భారత్ దాడిని అడ్డుకోలేని పాక్ ఎయిర్ డిఫెన్స్

చైనా నుంచి కొన్నవే అత్యధికం

సాంకేతిక సమస్యలు, నైపుణ్య లేమి

భారత్ దాడి చేస్తే ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ చెబుతూ వచ్చింది. సరిహద్దులో తమ సైనిక దళాలు, విమాన/క్షిపణి విధ్వంసక వ్యవస్థలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని ప్రకటించుకుంది. కానీ మంగళవారం అర్ధరాత్రి తర్వాత భారత్ ఒకేసారి తొమ్మిది లక్ష్యాలపై కేవలం 25 నిముషాల వ్యవధిలో దాడి చేసినా పాక్ పసిగట్టలేకపోయింది. భారత క్షిపణుల్ని, డ్రోన్లను అడ్డుకుని కూల్చివేయలేకపోయింది. పాక్ గగనతల రక్షణ వ్యవస్థల్లో అత్యధికం చైనా నుంచి కొనుగోలు చేసినవే కావడం, వాటి నిర్వహణలో అనేక సమస్యలుండడం పాక్‌కు శాపంగా మారుతోంది. 2011లో అమెరికా దళాలు అర్ధరాత్రి పాక్‌లోకి చొరబడి అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టాయి. ఆ ఆపరేషన్ కోసం అమెరికా రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు, ఒక చినూక్ హెలికాప్టర్, అనేక నిఘా డ్రోన్లను ఉపయోగించింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు వాటిని అడ్డుకోలేకపోయాయి. 2019లో భారత మిరాజ్ యుద్ధ విమానాలు పాక్‌లోని బాలాకోట్‌లోకి ప్రవేశించి అక్కడి ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేశాయి. అప్పుడూ పాక్ కనిపెట్టి అడ్డుకోలేకపోయింది. తాపీగా మర్నాడు ప్రతీకార దాడికి మాత్రం దిగింది. 2022 మార్చిలో భారత్‌కు చెందిన ఒక బ్రహ్మోస్ క్షిపణి సాంకేతిక తప్పిదం కారణంగా పాక్‌లోకి ప్రవేశించి పాక్ గగనతలంలో 110 కిలోమీటర్ల మేర ప్రయాణించింది. అయినా పాక్ ఎయిర్ డిఫెన్స్‌కు ఎంతమాత్రం తెలియలేదు. తాజాగా 2024 జనవరిలో ఇరాన్ పాక్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో గల ఉగ్రవాద శిబిరాలపై క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. వాటిని కూడా అడ్డుకోలేక పాక్ తెల్లమొహం వేసింది. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత క్షిపణులు, డ్రోన్లు తమ భూభాగంలోకి, పీవోకేలోకి ప్రవేశించినా పాక్ కనిపెట్టలేకపోయింది.

పాక్ భారత సరిహద్దు వెంబడి, ఎల్‌వోసీ వెంబడి ప్రధానంగా నాలుగు రకాల ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను మోహరించింది.

హెచ్‌క్యూ 9: చైనా తయారీ లాంగ్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణి వ్యవస్థ. ఇది వంద కిలోమీటర్ల పరిధిలో విమానాలు, క్షిపణుల్ని అడ్డుకోవడానికి ఉద్దేశించినది.

ఎల్‌వై 80: తక్కువ ఎత్తులో విమానాల్ని, క్షిపణుల్ని అడ్డుకోగల 40 కిలోమీటర్ల రేంజి వ్యవస్థ.

టీపీఎస్ 77 అండ్ వైఎల్‌సీ -18ఏ రాడార్లు: ఎక్కువ విస్తీర్ణాన్ని కవర్ చేస్తూ ఎక్కువ దూరంలో శత్రు విమానాల్ని, క్షిపణుల్ని గుర్తించగల వ్యవస్థ

అవాక్స్ విమానాలు: ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ అనే ఈ వ్యవస్థల్ని విమానాల్లో అమర్చుతారు. ఈ విమానాలు గాలిలోకి ఎగిరినప్పుడు వాటిలోని రాడార్లు శత్రు విమానాల్ని, క్షిపణుల్ని చాలా దూరం నుంచే పసిగడతాయి. చైనా నుంచి కొన్న జెడ్‌డీకే-03, స్వీడన్ నుంచి కొన్న సాబ్ 2000 ఏరీఐ విమానాల్ని భారత సరిహద్దులో పాక్ సిద్ధంగా ఉంచుతుంది.

కానీ ఆపరేషన్ సిందూర్‌ను అడ్డుకోవడంలో ఈ వ్యవస్థలన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. ప్రధానంగా చైనా నుంచి కొనుగోలు చేసిన వ్యవస్థల్లో తరచు సాంకేతిక సమస్యలు వస్తుంటాయి. వాటిని సరిచేసే పరిజ్ఞానం పాక్ సైనిక సిబ్బందికి సరిగా లేకపోవడం, అన్నింటికీ చైనాపై ఆధారపడడం వల్ల తరచు ఎయిర్ డిఫెన్స్‌లో గ్యాప్స్ ఏర్పడుతుంటాయి. పాక్‌కు ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరగడం వల్ల వీటి మెయింటెనెన్స్ కూడా సరిగా లేదని సమాచారం. పైగా ఎయిర్ డిఫెన్స్ అనేది అందరూ సమన్వయంతో చేయాల్సిన పని. పాక్‌లో వివిధ విభాగాల మధ్య సమన్వయం సరిగా లేదు. చైనా నుంచి కొనుగోలు చేసిన చాలా వ్యవస్థలపై పాక్ సైనికుల్లో సరైన అవగాహన కూడా లేదు. వెరసి తమ గగనతలాన్ని కాపాడుకోవడంలో పాక్ తరచు విఫలమవుతోంది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

అధికారంలోకి వచ్చేది మనమే

» కేసులు లేకుండా రాజకీయాలు ఉండవు: పార్టీ నాయకులతో జగన్

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వచ్చేది కచ్చితంగా వైసీపీనే. వచ్చే ఏడాది బ్రహ్మాండంగా ప్లీనరీని నిర్వహిస్తాం' అని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రకటించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్తలతో జగన్ సమావేశమయ్యారు. 'చంద్రబాబులా నేను అబద్ధాలు చెప్పలేను. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలోని సంక్షేమ పథకాలన్నింటిని రద్దు చేశారు. కేసులు లేకుండా రాజకీయాలు ఉండవు. పోలీసు కేసులకు భయపడవద్దు. రాష్ట్రంలో 12 నెలలుగా చంద్రబాబు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. ప్రజలు భయాందోళనల్లో బతుకుతున్నారు. వైసీపీని అభిమానించే వారిని కొడుతున్నారు. ఇది నన్ను బాధిస్తోంది. నా అభిమానులను రక్షించుకోవాల్సిన బాధ్యత నాపైనే ఉంది' అని జగన్ అన్నారు.

వివేకా కేసులో పిటిషన్లన్నీ కలిపి విచారిస్తాం

» విచారణ 20కి వాయిదా: సుప్రీం

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన పిటిషన్లు అన్నింటినీ కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాశ్ రెడ్డి, గంగిరెడ్డిల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఆయన కుమార్తె సునీత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. బుధవారం సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట ఈ పిటిషన్లు విచారణకు వచ్చాయి. అన్ని పిటిషన్లను కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలోని కేసులతో ఈ పిటిషన్లను కూడా ట్యాగ్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

జైలు దుస్తుల్లో గాలి జనార్దన్‌రెడ్డి

సైదాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల కేసులో దోషిగా తేలి చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి సాధారణ ఖైదీలా కారాగారంలో ఉంటున్నారు. మిగిలిన ఖైదీల మాదిరిగానే జైలు అధికారులు ఇచ్చిన తెల్లని దుస్తులు ధరించారు. 2011లో ఇదే చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గాలి జనార్దన్ రెడ్డికి... కోర్టు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. కానీ, ఇప్పుడు శిక్ష పడడంతో అలాంటి సదుపాయాలు ఉండవు. గాలి జనార్దన్ రెడ్డితో పాటు శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్‌ను జైలులోని ఒకే బ్యారక్‌లో ఉంచినట్టు సమాచారం. ఇక, గాలి జనార్దన్ రెడ్డిని ఆయన భార్య, కుమార్తె, సోదరుడు బుధవారం ములాఖత్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన భార్య, కూతురు కన్నీటి పర్యంతమయ్యారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై కేసు కొట్టివేత

» ఆరోపణలకు ఆధారాల్లేవన్న హైకోర్టు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసుతోపాటు విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌ను సైతం కొట్టివేసింది. పిటిషనర్‌పై ఏసీబీ మోపిన అభియోగాలు విచారణలో నిలబడవని పేర్కొంది. ఏసీబీ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, అస్పష్టమైన, నిరాధార ఆరోపణలు చేశారని తెలిపింది. ఈ అభియోగాలు చట్టం ముందు నిలబడవని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్.. దిగువ కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ బుధవారం తీర్పు ఇచ్చారు. భద్రత, నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారానికి సంబంధించి 2021 మార్చిలో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఏబీ వెంకటేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించారు.

వైద్య విభాగంలో 128 పోస్టులకు నోటిఫికేషన్

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): డీఎంఈ పరిధిలోని ఆసుపత్రుల సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 128 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పోస్టులు మొత్తాన్ని వాకిన్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈనెల 16న విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రిలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ సూర్యకళ నోటిఫికేషన్‌లో తెలిపారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, లేటరల్ ఎంట్రీ ద్వారా పోస్టుల భర్తీ చేస్తామని చెప్పారు.

విచారణకు సహకరించండి!

» రఘురామ కస్టోడియల్ కేసులో ప్రభావతికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో విచారణకు సహకరించాలని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ నీలం ప్రభావతిని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణకు సహకరించని పక్షంలో బెయిల్ రద్దు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. అనంతరం ప్రభావతికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ప్రభావతి తరఫున సీనియర్ న్యాయవాది మాధవి దివన్ వాదనలు వినిపిస్తూ.. నిందితురాలి కుమారుడు మానసిక సమస్యతో బాధ పడుతున్నాడని తెలిపారు. విచారణకు ఆమె సహకరిస్తున్నారని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ బెయిల్ ఇస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందన్నారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

కర్రెగుట్టల్లో.. 19 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

» మృతుల్లో 8 మంది మహిళలు.. వీరంతా తెలంగాణ కమిటీ వారే!

» ఆంధ్ర-ఒడిసా సరిహద్దుల్లో.. ఏవోబీ జోనల్ కమిటీ నేత జగన్,

» డీసీఎం నేత రమేశ్ కాల్చివేత.. ములుగులో ఐదుగురి లొంగుబాటు

చర్ల/ములుగు మే 7(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కర్రెగుట్టలు' 16వ రోజైన బుధవారం మావోయిస్టులు, పోలీసులకు మధ్య భారీ కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 19 మంది నక్సలైట్లు ఉన్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్ర క్యాడర్‌కు చెందినవారని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు. మృతుల్లో ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. ఘటనాస్థలిలో తుపాకులు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బుధవారం రాత్రికి 19 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బీజాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే.. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతిచెందినట్లు ప్రచారం జరుగుతున్నా.. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించలేదు. ఎన్‌కౌంటర్ సమయంలో తుపాకుల మోత కంటే.. బాంబుల దాడి, షెల్లింగ్ శబ్దాలు విపరీతంగా వినిపించాయని స్థానిక ఆదివాసీ గూడేల ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా.. ఆంధ్ర-ఒడిసా సరిహద్దుల్లోని జీకేవీధి ఏజెన్సీలో పోలీసులు-మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి పండన్న అలియాస్ జగన్, ఒడిసాలోని మల్కన్‌గిరి డీసీఎం నేత రమేశ్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రెండు ఏకే-47 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

వంశీ, పీఎస్ఆర్‌లకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, మే 7(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కేసుల్లో విజయవాడ జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్‌లను న్యాయస్థానం పొడిగించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీని బుధవారం విజయవాడలోని మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. అదేవిధంగా ముంబై నటి కాదంబరి జెత్వాని కేసుకు సంబంధించి పీఎస్ఆర్ ఆంజనేయులునూ ఇదే కోర్టులో హాజరుపరిచారు. వారిద్దరికీ ఈ నెల 21 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.తిరుమలరావు ఆదేశాలిచ్చారు.

వంశీ అనుచరుడు రంగాకు బెయిల్

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీమోహన్ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా, 89వ నిందితుడు ప్రశాంత్‌లకు విజయవాడ 12వ ఏడీజే కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

'బెయిల్' అర్హత మీకు లేదు!

జగన్ బ్యాచ్‌కు హైకోర్టు షాక్

వైసీపీ మద్యం కుంభకోణంలో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలకు ముందస్తు బెయిల్ నో

వీరు దాఖలు చేసిన పిటిషన్లు కొట్టివేత

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో జగన్ బ్యాచ్‌కు హైకోర్టు షాకిచ్చింది. ఈ కుంభకోణంలో నిందితులుగా ఉన్న మాజీ సీఎం జగన్ అప్పటి కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలు ముందస్తు బెయిల్ పొందేందుకు అర్హులుకారని తేల్చేసింది. ఈ క్రమంలో వీరు వేసిన పిటిషన్లను కొట్టివేసింది. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని పేర్కొంది. రూ.3200 కోట్లు లంచాల రూపంలో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఇంత తీవ్ర ఆరోపణలున్న కేసులో దర్యాప్తు అధికారికి స్వేచ్ఛ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పిటిషనర్లపై ఆరోపణలు తీవ్రమైనవని, వారిని దర్యాప్తు అధికారులు ఇంకా విచారించలేదని గుర్తు చేసింది. నేరారోపణలపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు పిటిషనర్లను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరముందని పేర్కొంది. కస్టోడియల్ విచారణకు నిరాకరిస్తే దర్యాప్తు ప్రక్రియలో లోపాలు చోటు చేసుకుంటాయని, తద్వారా దర్యాప్తు సమగ్రతపై ప్రతికూల ప్రభావం పడుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. మద్యం కుంభకోణానికి సంబంధించి ముఖ్యమైన సమాచారం వెల్లడికావాలంటే పిటిషనర్లను కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది. "సాక్షుల వాంగ్మూలాలను పరిశీలిస్తే మద్యం పాలసీతో ముడిపడి ఉన్న నేరపూరిత కుట్రలో పిటిషనర్ల పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా స్పష్టమవుతోంది. దర్యాప్తులో భాగంగా సీఐడీ సేకరించిన ఆధారాలు, పిటిషనర్లపై ప్రాసిక్యూషన్ పేర్కొన్న తీవ్ర ఆరోపణలను విస్మరించడానికి వీల్లేదు. మద్యం విధానాన్ని తీసుకురావడంలో ఉన్న విస్తృత కుట్రకోణాన్ని వెలికితీసేందుకు దర్యాప్తులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను పిటిషనర్ల ముందు ఉంచి విచారించాల్సిన అవసరం ఉంది. ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. రొటీన్‌గా ముందస్తు బెయిల్ మంజూరు చేయకూడదన్నది ఇప్పటికే రూఢీ అయిన న్యాయసూత్రం. అసాధారణ పరిస్థితులు ఉన్నాయని నమ్మకం కలిగినప్పుడే ముందస్తు బెయిల్ మంజూరుకు కోర్టు జోక్యం చేసుకుంటుంది. ఈ కేసులో పిటిషనర్లకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సరైన కారణాలు లేవు. ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్లు అర్హులు కారు." అని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు బుధవారం తీర్పు ఇచ్చారు.

వీరిదే కీలక పాత్ర: సీఐడీ

సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్, మనుశర్మ వాదనలు వినిపించారు. "వైసీపీ హయాంలో తీసుకొచ్చిన మద్యం పాలసీ రూపకల్పన, లంచాల వసూలు, ఆ సొమ్ము ను షెల్ కంపెనీల ద్వారా మళ్లించడంలో పిటిషనర్లు కీలకపాత్ర పోషించారు. ధనుంజయరెడ్డి కీలక పాత్ర పోషించారు. మద్యం కొనుగోళ్ల ఇండెంట్‌ను మాన్యువల్ విధానంలోకి తెచ్చారు. లంచాలు ఇచ్చిన డిస్టలరీలకే మద్యం ఆర్డర్లు ఇచ్చారు. ఇవ్వని డిస్టలరీలను బెదిరించి వ్యాపారం నుంచి తప్పుకొనేలా చేశారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్ అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పిన డిస్టలరీలకు మాత్రమే మద్యం ఆర్డర్లు ఇచ్చారు. ఇండెంట్లు, అమ్మకాలను ప్రత్యేక అధికారి సత్యప్రసాద్ పర్యవేక్షించారు. ప్రభుత్వ పెద్దల సూచనలకు అనుగుణంగా డిపో మేనేజర్లకు వాట్సప్ కాల్ ద్వారా ఏ బ్రాండ్‌లకు ఎంత ఇండెంట్ పెట్టాలో సూచించారు. దీనికి సంబంధించి సత్యప్రసాద్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. పర్సంటేజీల గురించి చర్చించేందుకు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి మద్యం కంపెనీ యజమానులతో హైదరాబాద్ , తాడేపల్లిలో పలుమార్లు భేటీ అయ్యారు. చార్టెడ్ అకౌంటెంట్ అయిన గోవిందప్ప మద్యం కంపెనీల నుంచి వసూలు చేసిన సొమ్మును షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించారు. ఎవరి ఖాతాల్లోకి సొమ్ము చేరిందనే విషయంలో దర్యాప్తు సాగుతోంది. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలు, కేసు డైరీలను కోర్టు ముందు ఉంచాం. రూ.3,200 కోట్ల ముడుపులు తీసుకున్నారని ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో తేలింది. నిధులు ఎక్కడకు మళ్లించారనేది తేల్చేందుకు కస్టోడియల్ విచారణ అవసరం. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే వీరు పారిపోయే ప్రమాదం ఉంది." అన్నారు.

ఆ పాలసీతో సంబంధం లేదు: పిటిషనర్లు

పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వికాస్‌సింగ్, నాగముత్తు, సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. "ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలకు మద్యం పాలసీతో సంబంధం లేదు. ఇండెంట్‌లను మాన్యువల్ విధానంలో చేపట్టాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆధారాలు లేవు." అని తెలిపారు.



రాజ్ కసిరెడ్డి అరెస్టులో నిబంధనలు పాటించాం

హైకోర్టుకు నివేదించిన ఏజీ

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాజ్ కసిరెడ్డి అరెస్టు విషయంలో సీఐడీ అధికారులు చట్టనిబంధనల మేరకే వ్యవహరించారని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టుకు నివేదించారు.ఆయనకు ఇచ్చిన అరెస్ట్ మెమోలో స్పష్టంగా మద్యం కేసులో నిందితుడిగా చేర్చినట్లు పేర్కొన్నారని తెలిపారు. రాజ్ కసిరెడ్డిని ఏప్రిల్ 18నే కేసులో నిందితుడి చేర్చామని, అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిందన్నారు. చట్టనిబంధనలు అనుసరించలేదన్న పిటిషనర్ వాదనలో వాస్తవం లేదన్నారు. బుధవారం విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. మద్యం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డికి రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరుతూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్‌రెడ్డి పిటిషన్ వేశారు.

లిక్కర్ కమీషన్‌తో ఆస్తుల కొనుగోలు!

రాజ్ కసిరెడ్డి ఇల్లు, కార్యాలయంలో 'సిట్' సోదాలు.. నేడూ తనిఖీలు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో తనకు కమీషన్‌గా వచ్చిన మొత్తంతో ప్రధాన నిందితుడు(ఏ-1) కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి ఆస్తులు కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. ఈ ఆస్తుల వివరాలతో పాటు రహస్య పెట్టుబడుల సమాచారాన్ని సిట్ కస్టోడియల్ విచారణలో రాబట్టినట్లు తెలిసింది. మద్యం ముడుపుల సొమ్ములు ఎక్కడకు చేరాయో గుర్తించే పనిలో 4 సిట్ బృందాలు హైదరాబాద్ వెళ్లాయి. రాజ్ కసిరెడ్డి ఇల్లు, ఆఫీసుతో పాటు ఆయన తోడల్లుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి(ఏ-7), ముఖ్య అనుచరుడు బూనేటి చాణక్య(ఏ-8) ఇళ్లలోనూ తనిఖీలు చేశాయి. కీలక పత్రాలు, కొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మరో ఆరు బృందాలు హైదరాబాద్ తరలివెళ్లాయి. గురువారం కూడా తనిఖీలు కొనసాగించే అవకాశం ఉంది. కాగా.. చాణక్యకు ఐదు రోజుల కస్టడీ ముగియడంతో సిట్ అధికారులు ఆయన్ను విజయవాడ జైలుకు తరలించారు. రాజ్ కసిరెడ్డి ఏడు రోజుల కస్టడీ గురువారంతో ముగియనుంది.

వైదొలగండి!

జస్టిస్ యశ్వంత్ వర్మను కోరిన సుప్రీం సీజే

» న్యాయమూర్తి ఇంట నగదు నిజమే...

» చీఫ్‌జస్టిస్ ఖన్నాకు అందిన కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, మే 7: వివాదాస్పద న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన నగదు అభియోగాలను సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ధ్రువీకరించింది. దీంతో న్యాయమూర్తిగా వైదొలగాలంటూ ఆయనను చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా కోరినట్టు తెలిసింది. కమిటీ ఇచ్చిన నివేదికను జస్టిస్ వర్మకు పంపించి, దానిపై వివరణ కోరినట్టు న్యాయవాద వర్గాలు తెలిపాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉండగా జస్టిస్ వర్మ నివాసంలో ఈ ఏడాది మార్చి 14న జరిగిన అగ్నిప్రమాదంలో భారీఎత్తున నగదు బయటపడటం కలకలం రేపింది. నిప్పును ఆర్పడానికి వెళ్లినవారికి ఒక గదిలో కాలిన నగదు పెద్దఎత్తున కనిపించింది. న్యాయమూర్తుల ప్రతిష్ఠను ప్రశ్నార్థకం చేసిన ఈ ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పంజాబ్-హరియాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ శీల్ నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సందావాలీయా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌లతో ఒక కమిటీని ఏర్పాటుచేసింది. దాదాపు యాభైమంది సాక్షుల వాంగ్మూలాలను కమిటీ సేకరించింది. న్యాయమూర్తి నివాసంలో అగ్నిప్రమాద ఘటనపై తొలుత స్పందించిన ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా, ఢిల్లీ అగ్నిమాపక దళం చీఫ్ అతుల్ గార్గ్ నుంచీ వివరాలు తీసుకుంది. తన నివేదికను ఈ నెల 3న సుప్రీంకోర్టుకు సమర్పించింది. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను తొలినుంచీ జస్టిస్ వర్మ ఖండిస్తున్నారు. కమిటీ పని కొనసాగుతుండగానే ఆయనను సుప్రీంకోర్టు కొలీజియం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించింది. దీనిపైనా అప్పట్లో విమర్శలు వచ్చాయి. సాధారణ ప్రక్రియలో భాగంగానే జస్టిస్ వర్మను బదిలీపై పంపినట్టు సుప్రీంకోర్టు తెలిపింది. మరోవైపు ఈ నెల 13న ప్రస్తుత సీజే పదవీవిరమణ చేయనున్నారు. ఈలోపే దీనికి ముగింపు పలకాలని జస్టిస్ ఖన్నా భావిస్తున్నారని సమాచారం.

కొత్తతరం నాయకులే లక్ష్యంగా టీడీపీ శిక్షణ తరగతులు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): నవతరం నాయకులను రూపొందించడంపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి ఎంపిక చేసిన యువ నాయకులను పార్టీ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దే పనిలో భాగంగా రాజకీయ శిక్షణ తరగతులను పునఃప్రారంభించింది. తొలి రోజు శిక్షణ కార్యక్రమం హెచ్‌ఆర్డీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పర్యవేక్షణలో జరిగింది. ఐదు జోన్లలో ఒక్కో నియోజకవర్గాన్ని తీసుకుని శిక్షణ ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగా తొలి రోజు శిక్షణలో తెనాలి నియోజకవర్గానికి చెందిన 48 మంది నాయకులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో వర్ల రామయ్య, కొమ్మారెడ్డి పట్టాభి అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం షాక్!

» ఓఎంసీ కేసులో ఆమె పాత్రపై పునర్విచారణ అవసరమన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కేసు నుంచి విముక్తి పొందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు గట్టి షాకిచ్చింది. ఈ కేసులో ఆమె పాత్రపై మరోసారి సమగ్ర విచారణ అవసరమని తేల్చింది. మూడు నెలల్లో విచారణ జరిపి.. ఆమె పాత్ర ఉందో లేదో తేల్చాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) అక్రమ తవ్వకాల కేసులో ఏ-6గా ఉన్న శ్రీలక్ష్మిపై కేసును 2022లోనే తెలంగాణ హైకోర్టు కొట్టేసింది (మంగళవారం కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా తేల్చిన సీబీఐ కోర్టు.. మిగిలిన నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం విదితమే). దీనిని 2023 ఆగస్టు 3న సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో శ్రీలక్ష్మిది కీలక పాత్ర అని.. ప్రతివాదుల వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇదే కేసులో మిగిలినవారిని సీబీఐ కోర్టు దోషులుగా తేల్చి శిక్ష విధించిందని గుర్తు చేశారు. సీబీఐ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. శ్రీలక్ష్మి పాత్రపై మరోసారి విచారణ చేపట్టాలని హైకోర్టును ఆదేశించింది. తాజాగా విచారణ చేపట్టి 3 నెలల్లో ముగించాలని ఆదేశించింది.



చేసిన పాపం వెంటాడుతోంది!

శ్రీలక్ష్మి మెడపై 'ఓఎంసీ' కత్తి

హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు తారుమారైతే శిక్ష తథ్యం!

(అమరావతి/హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

చేసిన పాపాలు ఊరికే పోవంటారు.. సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి విషయంలో సరిగ్గా అదే జరుగుతోంది. అతిపిన్న వయసులోనే ఐఏఎస్ అధికారిగా ఎంపికైన ఆమె.. అత్యంత ఇబ్బందికర పరిస్థితుల్లోకి వెళ్లడానికి 'క్యాప్టివ్' అనే ఒక్క పదం కారణమంటే ఆశ్చర్యం కలుగుతుంది. వైఎస్ ప్రభుత్వంలో గనుల శాఖ కార్యదర్శిగా ఆమె జారీ చేసిన జీవోలో ఆ ఒక్క పదాన్ని తొలగించి నాడు జైలుపాలయ్యారు. ఇప్పుడు మళ్లీ చిక్కుల్లో పడ్డారు. ఆమె 2022లో తెలంగాణ హైకోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ వేసి ఉపశమనం పొందారు. అయితే ఓఎంసీకి మైనింగ్ లీజుల జీవోలో ఆమె చేసిన కిరికిరి వ్యవహారమే మొత్తం కుంభకోణానికి దారి తీసిందంటూ సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీకి సొంత వాడకం కోసం గనులను లీజుకివ్వాల్సి ఉండగా.. మైనింగ్ కార్యదర్శి హోదాలో మంత్రికి సైతం తెలీకుండా 'క్యాప్టివ్' పదాన్ని తొలగించారని అందులో పేర్కొంది. మైనింగ్ వ్యాపారులు సొంత పరిశ్రమ అవసరాల కోసం తీసుకునే లీజు విధానాన్ని 'క్యాప్టివ్' మైనింగ్ అంటారు. పొరుగు దేశాలకు ఎగుమతి చేసేందుకైతే క్యాప్టివ్ అనే మాట ఎక్కడా ఉండదు. వైఎస్ మంత్రివర్గ తీర్మానంలోనూ క్యాప్టివ్ అనే ఉంది. నాటి గనుల మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంతకం చేసిన నోట్ ఫైలులోనూ అదే ఉండడంతో ఆమెను సీబీఐ కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. అప్పట్లో గనుల శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి చేతిలో ఓఎంసీ మైనింగ్ లీజు ఫైలు పడగానే 'క్యాప్టివ్' మైనింగ్ అనే పదం ఎగిరిపోయింది. తద్వారా ఇనుప ఖనిజాన్ని జనార్దన్‌రెడ్డి స్టీల్‌ప్లాంటుకు కాకుండా విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి అనుమతి ఇచ్చినట్లయింది. నిబంధనలు పట్టించుకోకుండా ఫైలులో మార్పులు చేసిన శ్రీలక్ష్మి ఇచ్చిన జీవో.. ఈ మొత్తం కుంభకోణానికి కారణమైందన్నది సీబీఐ వాదన. ఓఎంసీకి ఐరన్ ఓర్ గనులు లీజుకిస్తే ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోయే బ్రహ్మణి స్టీల్‌కు కోసం మాత్రమే ఉపయోగిస్తామని గాలి జనార్దన్‌రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌కు లేఖ రాశారు. లీజుల కోసం వచ్చిన 30 దరఖాస్తులనూ పరిశీలించాలని కేంద్రం చెప్పినప్పటికీ.. ఓఎంసీకి ఆర్థిక సామర్థ్యం ఉందని.. ప్రతిపాదిత బ్రహ్మణి స్టీల్స్ కోసమే ఐరన్‌ఓర్ ఉపయోగిస్తారని శ్రీలక్ష్మి తెలిపారు. మిగతా దరఖాస్తులను పక్కనపెట్టారు. కేంద్రం ముందస్తు అనుమతి ఇచ్చిన వెంటనే ఆగమేఘాలపై మిగతా దరఖాస్తుదారులకు కనీసం సమయం ఇవ్వకుండా షోకాజ్ నోటీసులు జారీచేశారు. 'క్యాప్టివ్ యూసేజ్' కింద లీజులు పొందినప్పటికీ ఆ పదమే లేకుండా ఆమె జీవో 151 జారీచేశారు. దీంతో లీజు అసలు ఉద్దేశానికి విరుద్ధంగా అక్రమంగా విదేశాలకు ఎగుమతులు చేసుకుని రూ.కోట్లు దండుకోవడానికి ఆస్కారం ఏర్పడింది. గాలి జనార్దన్‌రెడ్డి, ఓఎంసీ ఎండీ బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్‌ను దోషులుగా నిర్ధారించి ఏడేళ్ల జైలు శిక్ష విధించిన సీబీఐ కోర్టు.. శ్రీలక్ష్మికి కేసు నుంచి విముక్తి కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆమె జోలికి వెళ్లలేదు. అయితే ఈ తీర్పు వచ్చిన మరుసటి రోజే సర్వోన్నత న్యాయస్థానం ఆమెకు ఝలక్ ఇచ్చింది. శ్రీలక్ష్మి కేసు పునర్విచారణ చేయాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఆమెకు విముక్తి కల్పిస్తూ ఇదివరకు ఇచ్చిన తీర్పు తారుమారైతే ఆమెకు శిక్ష తప్పదని న్యాయనిపుణులు అంటున్నారు.

అత్యున్నత స్థాయికి వెళ్తారనుకుంటే..

కేంద్ర కేబినెట్ సెక్రటరీ స్థాయికి వెళ్తారనుకున్న శ్రీలక్ష్మి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన కుమారుడు జగన్ పుణ్యమా అని ఓఎంసీ అక్రమ తవ్వకాల కేసులో చిక్కుకుని జైలు పాలయ్యారు. సీబీఐ 2011 నవంబరులో ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపింది. దీంతో ఆమె సస్పెండయ్యారు. అనారోగ్యం కారణంగా 2012 అక్టోబరులో బెయిల్‌పై విడుదలయ్యారు. 2016లో ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆమె తెలంగాణ కేడర్‌కు వెళ్లారు. 2019లో జగన్ సీఎం అయ్యాక ఆంధ్ర కేడర్‌కు తీసుకొచ్చారు. అఖిల భారత సర్వీసు రూల్స్‌ను పక్కనపెట్టి వరుసగా పదోన్నతులు కూడా ఇచ్చారు. గత ఏడాది ఎన్నికల్లో జగన్ ఘోరపరాజయం పాలవడంతో ఆమె పరిస్థితి తలకిందులైంది. ఏపీ కేడర్‌లో అందరికన్నా సీనియర్‌గా ఉన్న ఈ ఐఏఎస్ అధికారికి కూటమి ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వలేదు. 11 నెలలుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. వచ్చే ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయనున్న ఆమె.. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన షాక్‌తో మళ్లీ జైలుకు వెళ్లే ప్రమాదంలో పడ్డారని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

గ్రూప్ 1 పేపర్లు గృహిణులు దిద్దారు

» అనామకులతో మార్కుల మ్యాపింగ్

» పీఎస్ఆర్ డైరెక్షన్‌లో 'క్యామ్‌సైన్' నిర్వాకం

» రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే అంశాలు

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ కార్యాలయం బయట పరీక్ష పేపర్ల మూల్యాంకనం చేయడం చట్టరీత్యా నేరం. కానీ మంగళగిరిలోని హాయ్‌ల్యాండ్‌కు గ్రూపు-1 పరీక్ష పేపర్లు తీసుకొచ్చారు. రూ.15,000 ఇస్తామని ఆశపెట్టి గృహిణులు, చంటిపిల్లల తల్లులతో దిద్దించారు. కాబోయే సబ్ కలెక్టర్లు, డీఎస్పీల భవిష్యత్‌ను నిర్ణయించే ఈ పరీక్షలో డిగ్రీ కూడా లేని వీరే మార్కులు వేశారు. ఈ విషయం వారికి కూడా పోలీసులు విచారణకు పిలిస్తే కానీ తెలియలేదు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుంభకోణం దర్యాప్తులో విస్తుపోయే విషయాలు ధాత్రి మధుపై పోలీసుల రిమాండ్ రిపోర్టులో బయటపడ్డాయి. అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పీఎస్ఆర్ ఆంజనేయులు వ్యవహరించారు. వైసీపీ పెద్దలు సూచించిన వ్యక్తులను ఆర్డీవోలు, డీఎస్పీలుగా చేసేందుకు 'క్యామ్‌సైన్' అనే మీడియా సంస్థతో కలిసి ఆయన చేసిన బాగోతాన్ని పోలీసులు నిగ్గు తేల్చారు. పమిడికాల్వ మధుసూదన్(ధాత్రి మధు)ను హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విజయవాడ పోలీసులు.. నిందితుడు వెల్లడించిన అంశాలను కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారు. దాని ప్రకారం.. 2020 డిసెంబరులో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. ఫలితాలను 2021 ఏప్రిల్‌లో డిజిటల్ మూల్యాంకనం ద్వారా విడుదల చేశారు. ఈ మూల్యాంకనంపై అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆ మూల్యాంకనాన్ని రద్దు చేసి సాధారణ మూల్యాంకనం చేయించారు. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఇక్కడే అడ్డదారులు తొక్కారు. కార్యాలయం నుంచి గ్రూపు 1 మెయిన్స్ పరీక్ష పత్రాలను ఆయన ఆదేశాలతో అక్రమంగా హాయ్‌ల్యాండ్‌కు తరలించారు. మధుసూదన్ క్యామ్‌సైన్ అనే మీడియా సంస్థను నిర్వహిస్తారు. ఆయన తన వద్ద పనిచేసే సిబ్బందితోపాటు కొందరు గృహిణులు, చిన్నపిల్లల తల్లులకు డబ్బులుఇచ్చి వారితో ఈ పని చేయించారు. ఈ ప్రక్రియలో 66మంది పాల్గొన్నారు. డిజిటల్ మూల్యాంకనంలో వచ్చిన మార్కులు చూసి మళ్లీ ఓఎంఆర్ షీట్లపై వారితో రాయించారు. వారిలో ఒక్కరూ అర్హులు లేరు. గృహిణులు, చిన్నపిల్లల తల్లులను ఎంపిక చేసి ఎగ్జామినర్, క్యాంప్ ఆఫీసర్, స్క్రూటినైజర్ అంటూ తప్పుడు హోదాలతో సంతకాలు చేయించారు. అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియంతా మోసమే. ఈ రహస్య కార్యాచరణ కోసం ఏపీపీఎస్సీ నుంచి ధాత్రి మధు సంస్థకు రూ.1.14కోట్లు అందాయి. ఈ మూల్యాంకన ప్రక్రియపై ఐదుగురు ఏపీపీఎస్సీ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తంచేయగా వారిపై పీఎస్ఆర్ మండిపడ్డారు.



కామ్‌సైన్ మధుకు 21 వరకు రిమాండ్

పీఎస్ఆర్‌పై పీటీ వారెంట్.. నేడు కోర్టులో హాజరు

విజయవాడ మే 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అక్రమాల కేసులో కామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు విజయవాడ కోర్టు ఈనెల 21 వరకు రిమాండ్ విధించింది. మధుసూదన్‌కు పోలీసులు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వైద్య పరీక్షలు చేయించిన అనంతరం ఒకటో ఏజేసీజే మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసు డైరీని పరిశీలించిన న్యాయాధికారి దేవిక ఆయనకు రిమాండ్ విధించారు. అనంతరం అతన్ని విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడు పీఎస్ఆర్ ఆంజనేయులును కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. కాదంబరి జెత్వానీ కేసులో ప్రస్తుతం ఆంజనేయులు విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.